# మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 6 ఆగస్టు 2025 | సంపుటి: 9 | సంచిక: 219 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


### వీసా గడువు ముగిసినోళ్లకు
## మన ఎంబసీ వార్నింగ్




2

### రాత్రి షిఫ్టుల్లోనూ మహిళలు
## ఉద్యోగం చేయొచ్చు
బట్, కండిషన్స్ అప్లై!



2

### ఆ సుంకాలపై చర్చలకు
# అమెరికా నో



**లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద**

ఢిల్లీ, ఆగస్టు 5: భారత్ అల్యూమినియం, ఉక్కు, సంబంధిత ఉత్పత్తులపై అమెరికా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందం కింద చర్చలకు రావాలంటూ భారత్ చేసిన అభ్యర్థనకు అమెరికా అంగీకరించలేదని కేంద్రమంత్రి జితిన్ ప్రసాద లోక్ సభలో వెల్లడించారు. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని వాటిని విధించినట్లు అగ్రరాజ్యం వాదించిందని లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. దిగుమతి సుంకాల విషయంలో డబ్ల్యూటీవో అగ్రిమెంట్స్ ఆన్ సేఫ్ గార్డ్స్ నిబంధనలను ...మిగతా 2లో

### దాని బుద్ధి వంకరే..
## కాల్పులకు తెగబడ్డ పాక్

కశ్మీర్, ఆగస్టు 5: ఆపరేషన్ సిందూర్ తరువాత పాక్ మొదటి సారి కాల్పులకు తెగబడింది. మంగళవారం జమ్మూకశ్మీర్లోని పూంచ్ జిల్లాలో పాక్ సైన్యం 15 నిమిషాల పాటు నిరంతరాయంగా కాల్పులు జరిపినట్లు సమాచారం. తక్షణమే అప్రమత్తమైన భారత బలగాలు ధీటుగా బదులిచ్చాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## జూబ్లీహిల్స్ బరిలోకి కవిత?
### రసవత్తరంగా మారనున్న ఉప ఎన్నిక



సిటీబ్యూరో, మనం న్యూస్: అనూహ్య రాజకీయ పరిణామాల నేపథ్యంలో జాగృతి అధినేత్రి, ఎమ్మెల్సీ కవిత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. గులాబీ నేతలపై ఇటీవల కవిత చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆమెను పార్టీ నుంచి బహిష్కరించనున్నట్లుగా తెలుస్తోంది. అదే జరిగితే ఆమె ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌తో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని అనుకుంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు జరగనున్న ఉప ఎన్నికల్లో కవిత పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్‌పై వచ్చిన ఆరోపణలు, ...మిగతా 2లో

### 42 శాతం బీసీ రిజర్వేషన బిల్లు కోసం..
# పార్లమెంటులో గళమెత్తిన కాంగ్రెస్ ఎంపీలు
## ఉభయ సభల్లో వాయిదా తీర్మానాల తిరస్కరణ

- ప్లకార్డులతో కాంగ్రెస్ ఎంపీల నిరసన
- కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లిన పార్లమెంటు
- నేడు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా




హైదరాబాద్, ఆగస్టు 05 ( మనం బ్యూరో): తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలు గళమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. మంగళవారం పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాగానే లోక్‌సభలో రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి 42 శాతం రిజర్వేషన్ల అంశంపై వాయిదా తీర్మానాలను ప్రతిపాదించారు. అలాగే, రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు రణదీప్ సింగ్ సుర్జేవాలా వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రశ్నోత్తరాలను పక్కనబెట్టి వాయిదా తీర్మానాలపై చర్చించాలని ఉభయ సభల్లో పట్టుబట్టారు. అయితే, ఈ తీర్మానాలను ఉభయ సభలో తిరస్కరించడంతో విపక్ష నేతలంతా పార్లమెంటు ఆవరణలో ఆందోళనకు దిగారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మల్లు రవి మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంలో జాప్యం చేస్తున్న కారణంగా స్థానిక సంస్థల నిర్వహణకు అడ్డంకులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బిల్లును రాష్ట్రపతి వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజ్యాధికారం కల్పించడం ...మిగతా 2లో

- ప్రత్యేక రాష్ట్ర సాధనే శ్వాసగా జీవించిన ప్రొ.జయశంకర్
- తెలంగాణ సాధనకు ఆయువు పట్టు గద్దర్
- కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా కోమటిరెడ్డి సోదరుల వ్యవహారం 2

### ఉత్తరకాశీలో మెరుపు వరదలు..
# కొట్టుకుపోయిన ధరాలీ గ్రామం
### 4గురు పౌరులు, 10 మంది సైనికులు మృతి



డెహ్రాడూన్, ఆగస్టు 5: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉత్తరకాశీలో మెరుపు వరదలు (మేఘ విస్ఫోటనం కారణంగా సంభవించే వరదలు) బీభత్సం సృష్టించాయి. ఇక్కడి ధరాలీ గ్రామంపై జలప్రవాహం విరుచుకుపడింది. ఊళ్లోని ఇండ్లను వరద బురద కప్పేసింది. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు సమాచారం. దాదాపు 50 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని, 20-25 హోటళ్లు, నివాసాలు ...మిగతా 2లో

### ఇప్పుడు వీరి టైమొచ్చింది..
# బీఆర్ఎస్ టార్గెట్‌గా కమలం భారీ స్కెచ్
**ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలను బీజేపీలో చేర్చుకునే యత్నం**

- ఇప్పటికే కారుకు గువ్వల బాలరాజు గుడ్‌బై, త్వరలో బీజేపీ గూటికి?
- ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సూత్రధారులంతా బాలరాజు బాటలోనే?
- డీకే అరుణకు టచ్‌లో ఉన్న ఈ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, (మనం బ్యూరో): రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల విషయంలో కాంగ్రెస్ సర్కార్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ టార్గెట్‌గా పావులు కదుపుతోందంటూ ప్రచారం జరుగుతుండగా, మరోవైపు, బీజేపీ సైతం ఆ పార్టీని దెబ్బతీసేందుకు భారీ స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో త్వరలోనే మరి కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. బాలరాజు బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా పని చేశారు. గత పార్లమెంట్ ఎన్నికలలో సైతం బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ఆయనకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సన్నిహితునిగా పేరుంది. గువ్వల బాలరాజు బాటలోనే బీఆర్ఎస్‌కు చెందిన మరి కొంతమంది ఎమ్మెల్యేలు కమలం గూటికి ...మిగతా 2లో



## సత్యపాల్ మాలిక్ మృతి

ఢిల్లీ, ఆగస్టు 5: జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందినట్లు సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల ఆయన నివాసాల్లో సోదాలు జరిపి, సీబీఐ ఛార్జీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ...మిగతా 2లో

# ఉపాధి నిధులు పెంచాలె
### కేంద్రమంత్రిని కోరిన మంత్రి సీతక్క



ఢిల్లీ, ఆగస్టు 5:ఉపాధి హామీ నిధులు పెంచాలని, నిధుల కోతలతో గ్రామీణాభివృద్ధికి ఆటంకం కలుగుతుందని రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రేటర్ వరంగల్ మేయర్ ...మిగతా 2లో

### కాళేశ్వరం తెలంగాణకు
# గుండెకాయ
కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతరు? రాష్ట్ర భవిష్యత్తు కోసమే కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టులు కట్టినం

కేసీఆర్ అభినవ ఆర్థర్ కాటన్ అంటూ అభివర్ణన

కాళేశ్వరం రిపోర్టుపై హరీశ్‌రావు పీపీటీ..

2

### ఇమ్రాన్‌ను వెంటనే
# విడుదల చేయాలె
పాకిస్తాన్ వ్యాప్తంగా ఆందోళనలు

వందలాది మంది పీటీఐ కార్యకర్తల అరెస్ట్

దేశంలో నిరంకుశత్వం నడుస్తోందని ఆ పార్టీ నేతల ఆరోపణ

ఇస్లామాబాద్, ఆగస్టు 5: పాకిస్తాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలంటూ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. ఆయన్ను అక్రమంగా అరెస్టు చేశారని, వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు ...మిగతా 2లో

## ఈవీఎంలపై అనుమానాలున్నయ్
బ్యాలెట్ తోనే ఎన్నికలు పెట్టాలి?:కేటీఆర్

2

## వీసా కావాలంటే 15,000 డాలర్లు కట్టాలె
వలసదారులపై మరో ఆర్థిక దాడి • ట్రంప్ ప్రభుత్వ నిర్వాకం

2

### ట్రంప్ దుందుడుకు చర్యల ఫలితం..
### క్షిపణుల మోహరింపు ఒప్పందం నుంచి
# తప్పుకున్న రష్యా
**1987లో కుదిరిన ఐఎన్ఎఫ్ (ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ఫోర్స్ ట్రీటీ) ఇక నుంచి అంతే సంగతులు!**



మాస్కో, ఆగస్టు 5: మధ్యశ్రేణి క్షిపణులను మోహరింపు రష్యా- అమెరికాల మధ్య ఉన్న ఐఎన్ఎఫ్ (ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ఫోర్స్ ట్రీటీ) ఒప్పందాన్ని పాటించేది లేదంటూ రష్యా ప్రకటించింది. పశ్చిమదేశాలు ...మిగతా 2లో

### ఆ విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నడు
ఏకచ్ఛత్రాధిపత్యం కోసమే అమెరికా ఆరాటం

రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా

2

# 24 గంటల్లో భారత్‌పై మరిన్ని సుంకాలు
### మళ్లీ బెదిరిస్తున్న ట్రంప్.. • భారత్ మంచి వ్యాపార భాగస్వామి కాదంటూ వ్యాఖ్య

న్యూయార్క్, ఆగస్టు 5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మనపై తన అక్కసును వెళ్లగక్కారు. రానున్న 24 గంటల్లో భారత్‌పై సుంకాలను గణనీయంగా పెంచుతామని ఓ అంతర్జాతీయ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ పెద్దమొత్తంలో చమురు కొనుగోలు చేస్తోందని, తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందని ఆరోపించారు. ఇదే విషయాన్ని ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ సోమవారం హెచ్చరించిన విషయం పాఠకులకు విదితమే. 'వాణిజ్యం విషయంలో భారత్ మంచి భాగస్వామి కాదు. ఆ దేశం మాతో పెద్దమొత్తంలో వ్యాపారం చేస్తోంది. కానీ.. మేం మాత్రం ఆ స్థాయిలో చేయడం లేదు. కాబట్టి.. 25శాతం సుంకాలు విధించాం. రానున్న 24 గంటల్లో దీన్ని గణనీయంగా పెంచబోతున్నాం. ఎందుకంటే.. వారు రష్యా నుంచి భారీ స్థాయిలో చమురును కొనుగోలు చేస్తున్నారు. తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తున్నారు' అని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ...మిగతా 2లో

### ట్రంప్ బెదిరింపులు అసమర్థమైనవి
వాణిజ్య భాగస్వాముల ఎంపిక మా హక్కు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌కు రష్యా స్ట్రాంగ్ కౌంటర్

ట్రంప్ ఈ హెచ్చరికపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ తీవ్ర స్థాయిలో మండిపడింది. భారతదేశంపై అమెరికా ...మిగతా 2లో

# ఆ సుంకాలపై చర్చలకు అమెరికా నో

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా పాటించనందున.. భారత్ సైతం అదే స్థాయిలో చర్యలు తీసుకునే హక్కు కలిగి ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. స్టీల్, అల్యూమినియంపై అమెరికా సుంకాల విధింపును రక్షణాత్మక చర్యలుగా భారత్ భావిస్తోంది. డబ్ల్యూటీవో అగ్రిమెంట్స్ ఆన్ సేఫ్ గార్డ్స్ కింద సంప్రదింపులకు లోబడి ఉండాల్సిన అంశంగా దీన్ని పరిగణిస్తోంది. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కొనసాగుతున్న చర్చల్లో భారత్ చురుకుగా పాల్గొంటోందని మంత్రి మరో సమాధానంలో తెలిపారు. రైతులు, దేశీయ పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఈ ఏడాది మార్చిలో చర్చలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఐదు రౌండ్ల చర్చలు జరిగాయి.

# ఉపాధి హామీ నిధులు పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

గుండు సుధారాణి, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ తో కలిసి కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో భేటీ అయ్యారు. అనంతరం శాఖపరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను పెంచాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కేంద్రం రూ.12 కోట్ల పని దినాలు మంజూరు చేసినప్పటికీ ఈ సంవత్సరం కేవలం 6.5 కోట్ల పని దినాలకే పరిమితం చేయడం గ్రామీణాభివృద్ధికి అడ్డంకిగా మారిందని ఆమె పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధితో పాటు మౌలిక సదుపాయాలు కూడా అందిస్తున్నామని తెలిపారు. ఉపాధిపై ఆంక్షలు లేకుండా నిధులను పెంచాలని కోరుతూ వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందచేశారు. సీతక్క విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

# కొట్టుకుపోయిన ధరాలీ గ్రామం

(మొదటి పేజీ తరువాయి)

కొట్టుకుపోయి ఉండొచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. సహాయక చర్యల కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం భారత సైన్యాన్ని అప్రమత్తం చేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఐటీబీపీ బృందాలు ఘటనా స్థలానికి బయల్దేరి రంగంలోకి దిగినట్లు సమాచారం.

**అమిత్ షా ఆరా..**

ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల విషయంలో సీనియర్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఉత్తరకాశీ ప్రాంతంలోని ధరాలీలో కుండపోత వర్షాల వల్ల భారీ నష్టం జరిగిందనే వార్త చాలా బాధాకరమన్నారు.



**ప్రధాని సంఘీభావం..**

ధరాలీ బాధిత కుటుంబాలకు ప్రధాని మోడీ సంఘీభావం ప్రకటించారు. ముఖ్యమంత్రి పుష్కర్ ధామీతో మాట్లాడి వివరాలు ఆరా తీసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో సహాయ బృందాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని ట్వీట్ చేశా

**నలుగురు పౌరులు..**

**10 మంది సైనికులు గల్లంతు..**

ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ.. సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. తీవ్రత ఎక్కువగా ఉండటంతో 150 మంది సైనికులను ఘటనాస్థలానికి పంపినట్లు ఆర్మీ తన అధికారిక 'ఎక్స్'లో పేర్కొంది.

ధరాలీలో సంభవించిన మెరుపు వరదల్లో దాదాపు 10 మంది సైనికులు గల్లంతైనట్లు తెలుస్తోంది. ఆర్మీ బేస్ క్యాంప్ ఉన్న హర్షిల్ దిగువ ప్రాంతంలో వీరంతా వరదలో కొట్టుకుపోయినట్లు సమాచారం. ఓ వైపు తమ బృంద సభ్యుల ఆచూకీ దొరకనప్పటికీ.. సైన్యం మాత్రం అకుంఠిత దీక్షతో సహాయ చర్యలు కొనసాగిస్తోంది.

# వీసా గడువు ముగిసినోళ్లకు మన ఎంబసీ వార్నింగ్

**న్యూయార్క్, ఆగస్టు 5:** నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని ఉద్దేశించి భారత్లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. పర్యాటక, విద్యార్థి, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తోన్న భారతీయులను ఉద్దేశించి ఈ హెచ్చరిక చేసింది. 'యూఎస్ వీసా గడువు నిబంధనలను పాటించండి. ఉల్లంఘనలకు పాల్పడితే వీసా రద్దు, దేశ బహిష్కరణకు గురయ్యే ముప్పు ఉంది. భవిష్యత్తులో వీసా రాకుండా అనర్హత వేటు పడొచ్చు. గడువు దాటి ఉండటం వల్ల అమెరికాలో ప్రయాణించడం, చదువుకోవడం, పని చేయడంపైనా శాశ్వత ప్రభావం పడొచ్చు'' అని ఎంబసీ హెచ్చరించింది. దీనికి ముందు అమెరికా చట్టసభ సభ్యురాలు టేలర్ గ్రీని.. హెచ్1-బీ వీసాలపై అమెరికాకు వచ్చే భారతీయులను ఉద్దేశించి అక్కసు వెళ్లగక్కారు. అమెరికన్ల ఉద్యోగాలను లాగేసుకునే భారతీయ హెచ్1-బీ వీసాలకు ముగింపు పలకండని వ్యాఖ్యలు చేయడం గమనార్హం. గా.. అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ వలసలపై ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. దానిలోభాగంగా బిజినెస్, టూరిస్ట్ వీసా (ఖి ఞీట్స) కోసం దరఖాస్తు చేసుకునేవారు షూరిటీ కింద 15వేల డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.13లక్షలు) వరకు బాండ్ (ఆ్ఫీ జూట ఞీట్స) కోసం చెల్లించాలని అగ్రరాజ్య విదేశాంగశాఖ ప్రతిపాదనలు చేసింది. వీసా కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడే ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ సదరు వీసాదారులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకొని.. గడువు పూర్తయిన తర్వాత దేశం వీడితే ఆ మొత్తాన్ని రీఫండ్ చేస్తారు. అలాకాకుండా.. చట్టవిరుద్ధంగా వ్యవహరించినా.. వీసా గడువు ముగిశాక కూడా అగ్రరాజ్యంలోనే ఉన్నా.. ఎలాంటి రీఫండ్ రాదు.

# 24 గంటల్లో భారత్పై మరిన్ని సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా, ఐరోపా దేశాల అభ్యంతరాలను భారత్ ఇప్పటికే గట్టిగా తిప్పికొట్టింది. అణు పరిశ్రమ, విద్యుత్ వాహనాలు, ఎరువుల తయారీకి అవసరమైన పదార్థాలను రష్యా నుంచి అగ్రరాజ్యం దిగుమతి చేసుకోవడాన్ని ప్రశ్నించింది.

# ఇమ్రాన్ను వెంటనే విడుదల చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనల్లో 500మందికిపైగా పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారని పీటీఐ ఆరోపించింది. పంజాబ్ ప్రావిన్స్ లోనే ఎక్కువ మందిని అరెస్టు చేసినట్లు తెలిపింది. దేశ వ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని నేరుగా ఇమ్రాన్ ఖానే పిలుపు నివ్వడంతో పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చారు. 'ఇమ్రాన్ ఖాన్ జైలుకు వెళ్లి ఇవాళ్టికి రెండేళ్లు పూర్తయ్యాయి. ఆయన ప్రాథమిక హక్కులను ప్రభుత్వం రద్దు చేసింది. న్యాయ బృందంగానీ, కుటుంబ సభ్యులు గానీ ఆయన్ను కలిసేందుకు కూడా వీలు కల్పించడం లేదు. ఒకరిద్దర్ని తప్ప పార్టీ నేతలు కూడా ఆయన్ను కలిసేందుకు అవకాశం ఇవ్వడం లేదు' అని పీటీఐ సీనియర్ నేత ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ్టి నిరసనలను అడ్డుకునేందుకు షెహబాజ్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించిందని, జనాలు గుంపులు గుంపులుగా ఉండొద్దని ఆదేశాలు జారీ చేసిందని, హైవేలను మూసివేసిందని, కార్లపై పీటీఐ జెండాలు ఉంటే.. వాటిని రోడ్ల మీదకి రాకుండా అడ్డుకుందంటూ ఆ పార్టీ అంతర్జాతీయ వ్యవహారాల అధికార ప్రతినిధి బుఖారీ మండిపడ్డారు. పాకిస్తాన్ లో ప్రజాస్వామ్యం, మానవ హక్కులు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ప్రజలపైనే ఇలా నిరంకుశంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. వివిధ కేసులను ఎదుర్కొంటున్న ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి అడియాలా జైల్లో ఉన్న సంగతి పాఠకులకు తెలిసిందే.

# రాత్రి షిఫ్టుల్లోనూ మహిళలు ఉద్యోగం చేయొచ్చు

- బట్, కండిషన్స్ అప్లై!

**భువనేశ్వర్, ఆగస్టు 5:** రాత్రి వేళల్లో మహిళలు విధులు నిర్వర్తించేటందుకు ఒడిశా ప్రభుత్వం అనుమతించింది. పరిశ్రమలు, దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాల్లో వారు రాత్రి షిఫ్టుల్లో పనిచేయడానికి అనుమతిస్తూ లేబర్ అండ్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ డిపార్ట్మెంట్ మార్గదర్శకాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన జీవో ఇస్తూ.. అందుకు కొన్ని నియమాలను పెట్టింది. మహిళలు పని చేసే షిఫ్టులో కనీసం ముగ్గురు స్త్రీ ఉద్యోగులుండాలని, జీపీఎస్ ట్రాకింగ్ తో కూడిన వాహనంలో వారికి రవాణా సౌకర్యం కల్పించాలని, పని ప్రదేశానికి దగ్గర్లో వాష్రూమ్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, సీసీటీవీ నిఘా, తగినంత లైటింగ్ ఉండాలంటూ నిబంధనలు విధించింది. వీటితో పాటు రాత్రి షిఫ్టులో పని చేసే మహిళల నుంచి రాతపూర్వక సమ్మతి తప్పనిసరని ప్రభుత్వం ఆ నోటిఫికేషన్లో పేర్కొంది.

**విమర్శలు..**

కేంద్రం నుంచి వచ్చిన సూచనల మేరకు తాము ఈ నిర్ణయం తీసుకున్నామని కార్మిక శాఖ మంత్రి వెల్లడించారు. అయితే విపక్షాలు మాత్రం ప్రభుత్వం పెట్టిన షరతును విమర్శిస్తున్నాయి. ''మహిళలు రాతపూర్వక అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే వారు తమను తాము రక్షించుకోవాలనా? దీనిద్వారా ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించాలని చూస్తోంది'' అని బిజూ జనతాదళ్ విమర్శించింది

# ట్రంప్ బెదిరింపులు అసమర్థమైనవి

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ వాణిజ్య ఒత్తిడిని కలిగిస్తోందని విమర్శించింది. సార్వభౌమ దేశాలకు తమ వాణిజ్య భాగస్వాములను సొంతంగా ఎంచుకునే హక్కు ఉంటుందని అగ్రరాజ్యానికి స్పష్టం చేసింది. భారత్ పై ట్రంప్ చేస్తున్న బెదిరింపులు అసమర్థమైనవని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ విమర్శించారు. 'ఉక్రెయిన్తో యుద్ధం ముగింపుపై నిర్ణయం తీసుకోకపోవడంతో మాతో వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవాలని అగ్రరాజ్యం ఇతర దేశాలను బెదిరించడం మేం గమనిస్తూనే ఉన్నాం. అటువంటి బెదిరింపులను చట్టబద్ధమైనవిగా పరిగణించం. ఎందుకంటే సార్వభౌమ దేశాలు వాణిజ్య, ఆర్థిక సహకారం కోసం సొంతంగా తమ వాణిజ్య భాగస్వాములను ఎంచుకునే హక్కును కలిగి ఉంటాయని మేం విశ్వసిస్తున్నాం. అందుకు విరుద్ధంగా అమెరికా ఇలాంటి బెదిరింపులకు పాల్పడడం సరైన చర్య కాదు' అని దిమిత్రీ పెస్కోవ్ అన్నారు.

# బీఆర్ఎస్ టార్గెట్గా కమలం భారీ స్కెచ్

(మొదటి పేజీ తరువాయి)

చేరనున్నట్లు సమాచారం. అయితే, బాలరాజు బీఆర్ఎస్కు రాజీనామా వెనుక బీజేపీలో కీలక స్థానంలో ఓ నేత హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. మూడేళ్ల క్రితం రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదంటూ బహిర్గతమైన ఓ వీడియో రాష్ట్ర రాజకీయాలలో పెను సంచలనం సృష్టించింది. ఆ నలుగురు ఎమ్మెల్యేలలో తాజాగా బీఆర్ఎస్కు రాజీనామా చేసిన గువ్వల బాలరాజు కూడా ఉండటం గమనార్హం. ఈ నలుగురు ఎమ్మెల్యేలను అప్పటి సీఎం కేసీఆర్ భారీ భద్రత మధ్య చాలా రోజుల పాటు తన ఫామ్ హౌస్లోనే ఉంచారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఈ నలుగురు ఎమ్మెల్యేలూ ఓటమి పాలుకావడం విశేషం. అయితే, బాలరాజుతో పాటు ఆ కేసులో ఉన్న మిగతా ముగ్గురు కూడా ఆయన బాటలోనే కమలం గూటికి చేరతారన్న ప్రచారం జరుగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీకి చెందిన ముఖ్య నేతపై ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్ర పన్నుతున్నారని రాజద్రోహం కేసు సైతం నమోదు చేసింది. వీరందరికీ పార్టీలో కీలక స్థానంలో ఉన్న ఆ ముఖ్య నేత మార్గనిర్దేశం చేస్తున్నట్లు తెలిసింది. గువ్వల బాలరాజు ఇప్పటికే బీఆర్ఎస్కు రాజీనామా చేయగా త్వరలో జాతీయ పార్టీలో చేరనున్నట్లు వెల్లడించారు.

# క్షిపణుల మోహరింపు ఒప్పందం నుంచి తప్పుకున్న రష్యా

(మొదటి పేజీ తరువాయి)

తమ జాతీయ భద్రతకు నేరుగా ముప్పును సృష్టించాయని.. అందుకే, ఒప్పందాన్ని అనుసరించే పరిస్థితులు లేవని తేల్చిచెప్పింది. ఈమేరకు రష్యా విదేశాంగశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. తాము కొన్నిరకాల క్షిపణులను మోహరించకుండా విధించుకొన్న ఆంక్షలను ఇక పాటించబోమని ప్రకటించింది. అమెరికా దళాలు ఫిలిప్పీన్స్ లో టైఫూన్ క్షిపణి లాంచర్లను మోహరించడం, ఆస్ట్రేలియా సమీపంలోని టలిస్మాన్ సాబ్రె డ్రిల్స్లో క్షిపణులను పరీక్షించడం దీనికి ప్రధాన కారణంగా వెల్లడించింది. మరోవైపు ట్రంప్ చర్యలు కూడా దీనికి ఆజ్యం పోశాయి. 1987లో అమెరికా అధ్యక్షుడు రొనాల్ రీగన్, రష్యా అధినేత మిఖాయిల్ గోర్బచేవ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ఫోర్స్ ట్రీటీగా దీనిని వ్యవహరిస్తారు. దీనిప్రకారం భూ ఉపరితలంపై నుంచి ప్రయోగించే మధ్యశ్రేణి రేంజి క్షిపణుల మోహరింపును నిషేధించారు. 500 కిలోమీటర్ల నుంచి 5,500 కిలోమీటర్ల మధ్యలోవి ఈ ఒప్పంద పరిధిలోకి వస్తాయి. అప్పట్లో ఐఎన్ఎఫ్ ట్రీటీ కారణంగా సోవియట్ అమెరికాలకు చెందిన దాదాపు 2,692 క్షిపణులను ధ్వంసం చేశారు. దీనిని ప్రచ్ఛన్న యుద్ధాన్ని మలుపుతిప్పిన సంధిగా భావిస్తారు.

2019లో ట్రంప్ ఈ ఒప్పందం నుంచి అమెరికాను బయటకు లాగేశారు.

# ఈవీఎంలపై అనుమానాలున్నయ్

- వాటిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి కేటీఆర్ విజ్ఞప్తి

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన ఆరోపణలకు తెర లేపారు. ఈవీఎంల విషయంలో ఎన్నో అనుమానాలున్నాయని.. వాటిని రద్దు చేసి.. తిరిగి బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని.. కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. అయితే తమ పార్టీ గుర్తు అయిన కారుతో పోలి ఉన్న గుర్తులను.. ఎన్నికల ప్రక్రియ నుంచి తొలగించాలని గత కొన్నేళ్లుగా తాము తీవ్ర పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలను పారదర్శక పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. ఇక ఎన్నికల్లో అడ్డగోలుగా హామీలు ఇచ్చే సంస్కృతి పోవాలని.. అందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేశారు. దేశంలో ప్రధానంగా తీసుకురావాల్సిన ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)లపై చర్చించేందుకు పలు పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానించింది. ఈ క్రమంలోనే కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం సమావేశమై చర్చించింది. ఎన్నికల సంస్కరణలకు సంబంధించి.. బీఆర్ఎస్ నేతలు అభిప్రాయాలను వివరించారు. ఈ క్రమంలోనే ఈవీఎంలు, బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ గురించి బీఆర్ఎస్ బృందం.. కీలక వ్యాఖ్యలు చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్.. ఈవీఎంల విషయంలో పలు అనుమానాలను.. ఎన్నికల సంఘం అధికారుల ముందు లేవనెత్తినట్లు తెలుస్తోంది.

# జూబ్లీహిల్స్ బరిలోకి కవిత?

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం వ్యవహారంలో ఆమె ఆ పార్టీని వీడుతారని ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే ఆమె జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేస్తే సహజంగానే జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలలో పరిచయాలు.. పదేండ్ల పాటు నందినగర్లోనే నివాసం ఉండటంతో పక్కనే ఉన్న నియోజకవర్గం అయినందున ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని ఆమె ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. ఫలితాలను ప్రభావితం చేసే సెటిలర్స్, మైనార్టీ ఓటర్లు, పేదలు, బీఆర్ఎస్ నేతలతో ఉన్న పరిచయాలు.. అన్నీ కలిసి వచ్చే అవకాశాలుగా ఆశాభావంతో ఉన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ గెలిచే పరిస్థితి లేదని.. ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె అయినందున కచ్చితంగా బీఆర్ఎస్ ఓట్లు కూడా ఆమెకు పడే అవకాశం ఉంటుందని శ్రేణులు చర్చించుకుంటున్నాయి. అనూహ్యంగా మారుతున్న రాజకీయ పరిమాణాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం, స్వతంత్ర అభ్యర్థిగా కవిత పోటీ చేస్తే బహుముఖ పోటీ కారణంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రసవత్తరం కానున్నది.

# సత్యపాల్ మాలిక్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

అస్వస్థతకు గురైన సత్యపాల్ మాలిక్ ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. ఆగస్టు 23, 2018 నుంచి అక్టోబర్ 30, 2019 వరకు జమ్మూకశ్మీర్ గవర్నర్గా సత్యపాల్ మాలిక్ పనిచేశారు. ఆ సమయంలో ఓ పవర్ ప్రాజెక్ట్ టెండర్ల ప్రక్రియలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో మాలిక్పై సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసింది. ఇటీవలే ఆయన నివాసాల్లో సోదాలు జరిపిన సీబీఐ.. ఆయనతోపాటు మరో ఐదుగురి పేర్లను ఛార్జిషీటులో పేర్కొంది. దీనిపై 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన. ప్రస్తుతం తాను ఆసుపత్రిలో ఉన్నానని, ఎవరితో మాట్లాడే పరిస్థితిలో లేనన్నారు.

# కాళేశ్వరం తెలంగాణకు గుండెకాయ

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** ఎంతో ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్.. తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు వ్యాఖ్యానించారు. నాడు.. ప్రజల గుండెల్లో నిలిచిపోయిన సర్ ఆర్థర్ కాటన్తో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ను పోల్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్లో ఏర్పాటుచేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తెలంగాణకే గుండెకాయ లాంటిదని కొనియాడారు. బ్రిటీష్ పాలనా కాలంలో ధవళేశ్వరం బ్యారేజీని ఆర్థర్ కాటన్ నిర్మించారని... రైతులకు మేలు జరగాలనే ఆకాంక్షతో ఉభయ గోదావరి జిల్లాలనకు సాగునీరు అందించారని హరీశ్ గుర్తుచేశారు. ఆ రోజుల్లోనే కాటన్ మీద బ్రిటీష్ ప్రభుత్వం హెమింగ్టన్ కమిషన్ వేసిందని... ఆ కమిషన్ కాటన్ను 900 ప్రశ్నలు అడిగి ఎంతో కాలం వేధించిందని తెలిపారు. అయినా, చివరకు ఏం జరిగింది? ఇప్పటికీ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో కాటన్ నిలిచిపోయారని అన్నారు. అదే విధంగా చరిత్ర పుటల్లో తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ నిలిచిపోతారని చెప్పారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్కు కూడా తెలుసని వ్యాఖ్యానించారు. మల్లన్నసాగర్ నుంచి మూసీలోకి నీళ్లు పోయడానికి రూ. 6 వేల కోట్లకు టెండర్లను ఫైనల్ చేశారని... మల్లన్నసాగర్ కాళేశ్వరంలో భాగమేనని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కాళేశ్వరం, మల్లన్నసాగర్ లాంటి ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని చెప్పారు.

# ఆ విషయాన్ని ట్రంప్ జీర్ణించుకోలేక పోతున్నడు

**మాస్కో, ఆగస్టు 5:** 'గ్లోబల్ సౌత్' దేశాలపై ఆధిపత్యాన్ని చలాయించేందుకు అమెరికా ఆధునిక వలసవాద విధానాన్ని అనుసరిస్తోందని రష్యా ఆరోపించింది. బహుళ ధ్రువ ప్రపంచం నిర్మాణం, అందరికీ సమాన అవకాశాల కోసం గ్లోబల్ సౌత్ దేశాలతో.. ముఖ్యంగా 'బ్రిక్స్'తో సహకారాన్ని పెంపొందించేందుకు సిద్ధమని ప్రకటించింది. భారత్ సహా అనేక దేశాలపై అమెరికా అధ్యక్షుడు సుంకాలు విధించిన వేళ.. రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ఈ మేరకు వ్యాఖ్యానించారు. సుంకాల యుద్ధాలు, ఆంక్షలనేవి చరిత్ర గమనాన్ని ప్రభావితం చేయలేవన్నారు. 'ఆయా దేశాలపై ఆంక్షలు విధించడం విచారకరం. అంతర్జాతీయ వేదికపై తన ఆధిపత్యం క్షీణించడాన్ని అమెరికా జీర్ణించుకోలేకపోతోంది. ఈ క్రమంలోనే తన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ఆధునిక వలసవాదాన్ని పాటిస్తోంది. తనను అనుసరించేందుకు నిరాకరిస్తున్న దేశాలపై రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు తీసుకొస్తోంది' అని జఖరోవా ఆరోపించారు. గ్లోబల్ సౌత్లోని రష్యా భాగస్వాముల విషయంలో ట్రంప్ సుంకాల విధానంపై మాట్లాడుతూ.. సంబంధిత దేశాల సార్వభౌమాధికారంపై ప్రత్యక్ష ఆక్రమణగా, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నంగా పేర్కొన్నారు.

# ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆయువు పట్టు గద్దర్

**హైదరాబాద్, ఆగస్టు 05, (మనం బ్యూరో):** ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టి సారించకుండా ప్రతి ఒక్కరికీ కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన ఆట పాటలతో ప్రజలను చైతన్యపరిచారని పేర్కొన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతం కోసం పని చేశారనీ, పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని కొనియాడారు. ఆయన చేసిన సాంస్కృతిక సేవలకు గుర్తింపుగా గద్దర్ పేరిట ఫిల్మ్ అవార్డులను సినీ ప్రముఖులు, కళాకారులకు అందించడం జరుగుతోందనీ, ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రత్యేక రాష్ట్ర సాధనే శ్వాసగా జీవించిన ప్రొ.జయశంకర్

- సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 05, (మనం బ్యూరో):** ప్రత్యేక రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా జీవించిన ప్రొ.జయశంకర్ను తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రొ.జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన నిర్విరామ కృషిని స్మరించుకున్నారు. జయశంకర్ స్వరాష్ట్ర కలల జెండాను, భవిష్యత్ ఎజెండాను ఎన్నడూ వదిలిపెట్టలేదనీ, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికారనీ, కోట్లాది జనుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలంగాణ ప్రాంతం, ప్రజలు ఏ విధంగా నష్టపోయారో గణాంకాలతో సహా ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాల పాటు సజీవంగా ఉంచారని కొనియాడారు. ప్రొ.జయశంకర్ ఆశయ సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

# పార్లమెంటులో గళమెత్తిన కాంగ్రెస్ ఎంపీలు

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీకి ఇష్టం లేదనీ, తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లుకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు మద్దతిచ్చి ఢిల్లీలో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను చేర్చడాన్ని సాకుగా చూపుతూ బిల్లు ఆమోదం కాకుండా ఆపుతున్నారని ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ శాసన సభ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బుధవారం ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద భారీ ధర్నా చేపట్టనున్నారు. ఢిల్లీలో మూడు రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న ఈ ధర్నాలో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లతో పాటు ముఖ్య నేతలంతా పాల్గొననున్నారు. ధర్నాలో పాల్గొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఇప్పటికే ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్తో పాటు మంత్రులంతా ప్రత్యేక రైలులో హస్తినకు చేరుకున్నారు.

# కాంగ్రెస్లో హాట్ టాపిక్గా కోమటిరెడ్డి సోదరుల వ్యవహారం

- సీఎంకు అండగా అన్న వెంకటరెడ్డి
- అందుకు భిన్నంగా మాటల తూటాలు పేలుస్తున్న రాజగోపాల్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 05, (మనం బ్యూరో):** తెలంగాణ కాంగ్రెస్లో కోమటిరెడ్డి సోదరుల వ్యవహారం హాట్ టాపిక్గా మారింది. ఇటీవల మంత్రి వర్గ విస్తరణలో మంత్రి పదవి ఆశించి భంగపడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తరచూ సీఎం రేవంత్ రెడ్డిపై మాటల తూటాలు పేలుస్తూ ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తుండగా, అందుకు భిన్నంగా అన్న మంత్రి వెంటకరెడ్డి సీఎంను వెనకేస్తుకొస్తున్నారు. రేవంత్ రెడ్డి మరో ఐదేళ్ల పాటు సీఎంగా కొనసాగాలని తన నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్కు భూమి పూజ కార్యక్రమం సందర్భంగా గణపతి పూజ చేయించానని వెంకటరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని వ్యాఖ్యానించారు. ఆ మరుసటి రోజే తనకు మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ అధిష్టానం మోసం చేసిందని రాజగోపాల్ రెడ్డి విమర్శనాస్త్రాలు ఎక్కు పెట్టారు. పార్టీలో సీనియర్ అయిన తనకు ఇవ్వకుండా నిన్న మొన్న పార్టీలో చేరిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని విమర్శించారు. మునుగోడు ఎన్నికల సమయంలోనే తనకు మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారనీ, భువనగిరి ఎంపీ స్థానాన్ని గెలిపించినప్పుడు కూడా మంత్రి పదవి ఇస్తానని మాటిచ్చారు, ఇస్తరా? ఇవ్వరా? అంటూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని సూటిగా ప్రశ్నించారు. అయినా తనకు మంత్రి పదవి ముఖ్యం కాదనీ, మునుగోడు నియోజకవర్గ ప్రజలే ముఖ్యమనీ, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు. అవసరమైతే, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రభుత్వాన్ని మునుగోడు ప్రజల కాళ్ల దగ్గరికి తీసుకొస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి కోసం దిగజారి బతకలేననీ, ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనంటూ పరోక్షంగా అధిష్టానాన్ని హెచ్చరించారు. తన సోదరుడు రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి వెంకటరెడ్డి స్పందిస్తూ రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇప్పించే స్థాయిలో ఉన్నానా ? అంటూ ప్రశ్నించారు. తన సోదరుడికి ఎన్నికల సమయంలో ఏం హామీ ఇచ్చిందో తనకు తెలియదని వ్యాఖ్యానించారు.

# వీసా కావాలంటే 15,000 డాలర్లు కట్టాలె

**న్యూయార్క్, ఆగస్టు 5:** వలసదారులపై కఠిన ఆంక్షలు అమలుచేస్తోన్న అమెరికా.. తాజాగా వీసా ఆశావహుల నెత్తిన మరో బాంబు పేల్చేందుకు సిద్ధమైంది. బిజినెస్, టూరిస్ట్ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు షూరిటీ కింద 15వేల డాలర్ల వరకు బాండ్ చెల్లించాలని అగ్రరాజ్య విదేశాంగశాఖ ప్రతిపాదనలు చేసింది. ఈమేరకు అమెరికా కాలమానం ప్రకారం ఫెడరల్ రిజిస్ట్రీలో మంగళవారం నోటీసులు పబ్లిష్ చేయనుంది. 12 నెలల పైలట్ ప్రోగ్రామ్ కింద ఈ కొత్త నిబంధన తీసుకురానున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. బీ-1 (బిజినెస్), బీ-2 (టూరిస్ట్) వీసాలపై ఈ నిబంధనను తీసుకురానున్నారు. ఫెడరల్ రిజిస్ట్రీలో అధికారి నోటీసు పెట్టిన 15 రోజుల్లోపు ఈ పైలట్ ప్రోగ్రామ్ అమల్లోకి రానుంది. దీని ప్రకారం.. బిజినెస్, పర్యాటక వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు అమెరికా ప్రవేశం పొందాలంటే కనీసం 5వేలు, 10వేలు, లేదా 15వేల సెక్యూరిటీ బాండ్లను సమర్పించాల్సి ఉంటుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ సదరు వీసాదారులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకొని.. గడువు పూర్తయిన తర్వాత దేశం వీడితే ఆ మొత్తాన్ని రీఫండ్ చేస్తారు. అలాకాకుండా.. చట్టవిరుద్ధంగా వ్యవహరించినా.. వీసా గడువు ముగిశాక కూడా అగ్రరాజ్యంలోనే ఉన్నా.. ఎలాంటి రీఫండ్ దక్కదు.

# మున్సిపల్ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి

- రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి
- ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మున్సిపల్ కార్మికులకు పర్మినెంట్ చెయ్యాలి
- ప్రమాదంలో మరణించిన కార్మికులకు 50 లక్షల నష్టం పరిహారం చెల్లించాలి
- రాష్ట్ర అధ్యక్షులు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



**తుర్కయంజాల్,ఆగస్టు5( మనం న్యూస్):** 2025 సెప్టెంబర్ 19 వ తేదీ 20వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా, తుర్కయాంజల్లో జరగనున్న మహాసభలను జయప్రదం చెయ్యాలి. మున్సిపల్ కార్మికుల రాష్ట్ర 5వ మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటుతెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర 5వ మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం తుర్కయాంజల్, అరుణ కన్వెన్షన్ హాల్ నందు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. కిషన్, టి. నర్సింహాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ జి. కవిత, మధ్యాహ్న భోజనం రాష్ట్ర అధ్యక్షులు స్వప్న, మెడికల్ హెల్త్ రాష్ట్ర కార్యదర్శి బలరామ్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి. యాదగిరి, సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్. ఎల్లేష్, జె. పెంటయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని, సంవత్సరాల తరబడి విధులు నిర్వహించిన పనికి భద్రత లేదని, పర్మినెంట్కు నోచుకోవడం లేదని, చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మున్సిపల్ కార్మికుల పర్మినెంట్, కనీస వేతనాల అమలుతో పాటు 2వ పిఆర్సిలో మినిమం బేసిక్ రూ.26,000/ఋలుగా నిర్ణయించి మున్సిపల్ కార్మికులకు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు పైబడిన వారు మరియు మరణించిన కార్మికుల స్థానంలో ఎలాంటి షరతులు లేకుండా వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలని, అనేక మున్సిపాల్టీలలో అభివృద్ధి పేరుతో అవార్డులు ఋ రివార్డులను అందుకుంటూ కేంద్ర ప్రభుత్వం నుండి ఫండ్ తెస్తున్నారు. తెచ్చిన ఫండ్లో కార్మికులకు మాత్రం వాటా ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని అన్నారు. మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, మున్సిపల్ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, పారిశుద్ధ్య పనులకు మున్సిపల్ కార్మికులు ఉదయం 5ఋ00 గంటలకే పనికి రావాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇకనుండి ఈ పద్ధతి మానుకోవాలని, అధికారులు నిర్ణయించిన సమయానికి రావాలంటే కార్మికుల నివాస ప్రాంతాల నుండి రవాణా సౌకర్యాలను కల్పించాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, అన్ని మున్సిపాల్టీల్లో ఒక్కపూట పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే రేవంత్రెడ్డి ప్రభుత్వానికి మున్సిపల్ కార్మికుల సమ్మె సెగ తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ రాష్ట్ర 5వ మహాసభల జయప్రదానికి రంగారెడ్డి జిల్లాలోని వివిధ మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు మహాసభల నిర్వహణకు పెద్ద ఎత్తున విరాళాలు సేకరించాలని, ఫండ్ ఇవ్వాలని సమావేశంలో పాల్గొన్న వక్తలు కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం 5వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. ఆహ్వాన సంఘం చైర్మన్ తిప్పర్తి యాదయ్య డిప్యూటీ కమీషనర్ జిహెచ్ఎంసి తెలంగాణ ఉద్యోగుల సంఘం, జనరల్ సెక్రటరీ డి. కిషన్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ట్రెజరర్ సిహెచ్. ఎల్లయ్య, చీఫ్ ప్యాట్రన్స్ పాలడుగు భాస్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మరియు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్యాట్రన్స్ ఎం. చంద్రమోహన్ సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి, తదితరులతో ఆహ్వాన సంఘం ఏర్పడింది. ఈ సమావేశంలో 14 మున్సిపాల్టీలు, 3 కార్పొరేషన్ల నుండి మున్సిపల్ కార్మికులు పాల్గొని మహాసభల జయప్రదానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని హామీనిచ్చారు.

## చేవెళ్లలో బాలికల సంక్షేమ హాస్టల్ వెంటనే ప్రారంభించాలి

### ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్



**చేవెళ్ల, ఆగస్టు 5(మనం న్యూస్)** చేవెళ్లలో బాలికల సంక్షేమ హాస్టల్ ను వెంటనే ప్రారంభించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చేవెళ్ల నగర శాఖ ఆద్వర్యంలో చేవెళ్లలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేవెళ్ల నగరంలో వివిధ కళాశాలలో చదువుతున్న బాలికలకు సంక్షేమ హాస్టల్ లేని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గతంలో అద్దె భవనంలో ఉండేవారు కానీ ఈ సంవత్సరం వారికి భవనం లేక ఇంటి నుంచి రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. స్వంత భవనం కోసం ఆలోచించి స్థలం కేటాయించి అద్దె భవనంలో అయినా విద్యార్థులకు కేటాయింపు చేయాలన్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపాల్, మల్లేష్, హరికృష్ణ, ఆకాష్, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## తుర్క యంజాల్ రైతు సేవ సహకార సంఘంలో పర్సనల్ ఇన్చార్జి కమిటీ సమావేశం

### టీజీ క్యాబ్ వైస్ చైర్మన్ డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య



**తుర్కయంజాల్, ఆగస్టు 5( మనం న్యూస్):** తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలో రైతు సేవ సహకార సంఘం మంగళవారం పర్సనల్ ఇన్చార్జి కమిటీ సమావేశం ప్రధాన కార్యాలయంలో టీజి క్యాబ్ వైస్ చైర్మన్ డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య ఆధ్వర్యంలో జరిగింది. వారు మాట్లాడుతూ, సమావేశములో నూతన సభ్యులుగా 23 మందిని చేర్చుకున్నారు.24 మంది రైతులకు రెండు కోట్ల 65 లక్షల రూపాయలు అప్పులు మంజూరు చేశామని అన్నారు.
సంఘం 2024-25 ఆర్థిక సంవత్సరం యొక్క ఆడిట్ సర్టిఫికేట్ ను ఆమోదించామని తెలియజేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరం మే 1 నుండి జులై 31 వరకు 2025 మూడు నెలల జమ ఖర్చులు ఆమోదించనైది. మరియు సంఘ సభ్యుల సంక్షేమం కొరకు ఇతర అభివృద్ధి కార్యక్రమములు చేయుటకు ఆమోదించాము.
ఈ కార్యక్రమ సమావేశంలో సంఘం పర్సనల్ ఇన్చార్జి కమిటీ సభ్యులు కొత్త రాం రెడ్డి, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, వంగేటి లక్ష్మ రెడ్డి,కొండ్రు స్వప్న, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణ రెడ్డి, సామ సత్య నారాయణ రెడ్డి, మరియుసంఘ సెక్రెటరీ వై.రాందాస్ పాల్గొన్నారు.

## పాఠశాలలో ఎర్త్ క్లబ్ ఏర్పాటు ప్రశంసనీయం




- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్

**చేవెళ్ల, ఆగస్టు 5(మనం న్యూస్ ) :** పాఠశాలలో ఎర్త్ క్లబ్ ఏర్పాటు ప్రశంసనీయమని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ అన్నారు. పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నా యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం చేవెళ్ల ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ చిన్నప రెడ్డి అధ్యక్షతన, రిటైర్డ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మోహిద్దీన్ ఆధ్వర్యంలో 20 రకాల ఔషధ మొక్కలతో ఔషధ తోట ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ , ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రవికుమార్ హాజరై పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ... కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ గత 15 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను ఉద్దేశించి అభినందించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎర్త్ క్లబ్ ప్రశంసనీయమని, అందులో భాగంగా పాఠశాలలోని లక్ష్మీ తేజ, ఆలియా, బిందు ,న్యాన్సీ, సమాఫలక్ , మనస్విక ఇలా ఎనిమిది మంది విద్యార్థులను ఎర్త్ లీడర్స్ గా ఎంచుకొని వారిని పర్యావరణ పరిరక్షణ కోసం చిన్న వయసు నుండి అవగాహన కార్యక్రమం చేస్తూ వారిని పుడమి నాయకులుగా ముందుకు నడిపించే కార్యక్రమం చేస్తుందని అన్నారు. అనంతరం చేవెళ్ల మోడల్ స్కూల్ విద్యార్థులని డీర్ పార్క్ సందర్శనకు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెంటార్ టీచర్ డాక్టర్. మహేశ్వర్ రావు, ఉపాధ్యాయులు, పీడీ ఆంజనేయులు,విద్యార్థులు, యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాం రంగారెడ్డి జిల్లా కో - ఆర్డినేటర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేటలో తుపాకీ, బుల్లెట్లు లభ్యం

- నిందితుడి అరెస్ట్

**రంగారెడ్డి ఆగస్టు 5 (మనం న్యూస్)** నగరంలోని మీర్పేట్ పరిధిలోని ఓ ఇంట్లో తుపాకీతో పాటు బుల్లెట్లు లభ్యం కావడం కలకలం రేపింది. వివరాల్లోకివెళితే.. చంద్రశేఖర్ అనే యువకుడు దొంగతనాలే ప్రవృత్తిగా మార్చుకొని గత రెండేళ్లుగా మీర్పేట్లోని ఎస్ఎల్ఎన్ ఎస్ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు చంద్రశేఖర్ ఇంటిపై దాడి చేశారు. తుపాకీతో పాటు బుల్లెట్లు, గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. చంద్రశేఖర్ ను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించినట్లు సమాచారం.

## వర్రె వెంకటేశ్వర్లుని కలిసిన శ్రీశైలం యాదవ్



**హైదరాబాద్, ఆగస్టు 5(మనంన్యూస్):** రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ మెంబర్ గా భాద్యతలు స్వీకరించిన డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు గారిని ట్రూ హెల్పింగ్స్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి.. శుభాకాంక్షలు తెలపడం జరిగింది. గతంలో ఉమ్మడి రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ గా పనిచేసి, మరోసారి అత్యున్నత స్థానంలోకి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ట్రూ హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు మాట్లాడుతూ నూతన పోలీస్ కంప్లైంట్ అథారిటీ శాఖ ద్వారా పేద మధ్య తరగతి ప్రతీ సామాన్యునికి న్యాయం జరుగుతుంది. బి ఆర్ కె ఆర్ భవన్ లో డి బ్లాక్ లోని 8 వ అంతస్తులో పోలీస్ ఫిర్యాదు సంస్థ రాష్ట్ర కార్యాలయం ఉంది రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన పోలీస్ కంప్లైంట్ అథారిటీ నీ అభినందిస్తూ ఈ సేవలను ఉపయోగించుకోవాలని ట్రూ హెల్పింగ్ అండ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మారమోని శ్రీశైలం యాదవ్ సూచించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఎంతో మేలు: సబితా ఇంద్రారెడ్డి

### లబ్ధిదారులకు రూ. 31,500ల చెక్కు పంపిణీ

**రంగారెడ్డి, ఆగస్టు 5 (మనం న్యూస్):** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఎంతో మేలు అని మాజీ మంత్రి , మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కె పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ కి చెందిన సునీత అనే మహిళకు మంజూరైన రూ . 31,500 చెక్కును లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్యం పాలిట ముఖ్యమంత్రి సహాయ నధి సంజీవనిగా తోడ్పాటు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్, నాయకులు సాజీద్,కొండ్ర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేష్ గౌడ్ మురళీధర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, శేఖర్,పెంబర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.



# పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలి

### సైబర్ నేరాలపై ప్రజలలో అవగాహన కల్పించాలి
### సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
### పటాన్ చెరు పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ
### పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డుల పరిశీలన




**రామచంద్రపురం, ఆగస్టు 5 (మనం న్యూస్):** ఆన్ లైన్ బెట్టింగ్స్, సైబర్ నేరాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. మంగళవారం పటాన్ చెరు పోలీసు స్టేషన్ ను ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల మెయింటెనెన్స్, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, స్టేషన్ రికార్డును తనిఖీ చేశారు. పెండింగ్ కేసులలో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లాంగ్ పెండింగ్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ఇన్వెస్టిగేషన్ లో ఎలాంటి సందేహాలున్న ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని ఎస్ హెచ్ఓ కు సూచించారు. ఆస్తి సంభందిత నేరాలు జరుగుతున్న ప్రాంతాలను హాట్ స్పాట్ గా గుర్తించి, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్ హెచ్ఓకు సూచనలు చేశారు. సిబ్బంది ప్రతి ఒక్కరు అన్నిరకాల విధులను తెలుసుకొని ఉండాలని, మారుతున్న సమాజానికి అనుగుణంగా, ఎలాంటి విధులనైనా చేయగలిగే విధంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని, ఆధునిక సాంకేతికతను అందించుకోవాలని సూచించారు. జిల్లాలో పటాన్ చెరు సబ్ డివిజన్ ఏరియాలో అధికంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, సైబర్ నేరాల నివారణ గురించి ప్రజలలో విద్యా సంస్థలాల్లో కమ్యూనిటీ పోలిసింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలన్నారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ పన్నిన వలలో చిక్కుతున్నారని, ఈజీ మనీ అనేది సైబర్ నేరగాళ్ల పన్నాగం అని గుర్తించాలని యువతకు సూచించారు. నేరాల నియంత్రణ, జరిగిన నేరాలను చేధించడానికి కీలకంగా ఉపయోగపడే సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ ధాబాలు, పెట్రోల్ పంపులు, విధ్యా సంస్థలు, షాప్స్ లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్ కు వచ్చిన ఫిర్యాది దారులతో స్వయంగా ఎస్పీ మాట్లాడుతూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పటాన్ చెరు పోలీసులు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. పోలీసు శాఖ మరిన్ని మెరుగైన సేవలను అందించడానికి పోలీసు శాఖ పని తీరుపై ప్రజల అభిప్రాయం చాలా అవసరం అని జిల్లా ఎస్పీ అన్నారు.

## మహిళల పెట్రోల్ బంకు ఆదర్శంగా నిలవాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య




**సంగారెడ్డి ఆగస్టు 5 మనం న్యూస్ ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్లో గల మహిళా ప్రాంగణం సమీపంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య మంగళవారం సందర్శించి, నిర్వహణ, సేవల నాణ్యతను పరిశీలించారు .డిఆర్డిఏ జిల్లా మహిళా సమైక్య ఆధ్వర్యంలో నడుపబడుతున్న ఈ బంక్ను మహిళలే స్వయంగా నిర్వహిస్తుండడం చాలా గర్వకారణమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహిళలు కోటీశ్వరులుగా మారడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అన్నారు . ప్రభుత్వం మహిళలకోసం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు . మహిళల చేతిలో పెట్రోల్ బంక్ నిర్వహణ అన్నది మహిళా సాధికారతకు ఒక మైలురాయి అన్నారు. మహిళలు ఇప్పుడు ఉద్యోగాలకే పరిమితమయ్యే స్థాయిలో కాకుండా, ఉద్యోగాలను సృష్టించే దిశగా అడుగులు వేస్తున్నారని అన్నారు . మహిళల చేతుల్లో ఉన్న ఈ పెట్రోల్ బంకు ఒక ఆదర్శంగా నిలవాలని అన్నారు . పెట్రోల్ బంక్ లో నిర్వహణ సంబంధిత వివిధ అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా స్టాక్ రిజిస్టర్, రోజువారి అమ్మకాలు, యూపీఏ ట్రాన్సాక్షన్ వివరాలను పరిశీలించి, ఖచ్చితమైన లెక్కలు ఉండాలని సూచించారు. అలాగే, వినియోగదారులకు అనుకూలంగా స్టాక్ బోర్డు, సిటిజన్ చార్ట్, అత్యవసర నెంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. అమ్మకాలు పెంచుకునే విధంగా ప్రణాళికా బద్దంగా ముందుకెళ్లాలని సూచించారు . నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలి అని హితవు పలికిన కలెక్టర్ , ఖాళీ బాటిల్స్ లలో పెట్రోలు అమ్మకూడదు ఇది చట్ట విరుద్ధం. లీగల్ మెట్రాలజీ శాఖ తరచుగా తనిఖీలు చేసి నాణ్యత, పరిమాణాలను నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. అలాగే, బంక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మౌలిక అవసరాలను కల్పించాలన్నారు. ఈ సందర్భముగా కలెక్టర్, పెట్రోలు పోసుకోవడానికి వచ్చిన వినియోగదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులు మహిళలు నడుపుతున్న బంక్లో సురక్షితంగా, వేగంగా సేవలు అందుతుండటంపై సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్డిఏ సూర్యారావు , ఏ పి ఎం లు సంబంధిత అధికారులు, జిల్లా మహిళా సమైక్య ప్రతినిధులు , బంక్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కొంచెం సేపే ఆగిన పాట

పల్లె పల్లెలో కల్లోలపు సమాజపు
నీ పాటల పల్లవులు విల్లంబు లై
దూసుకెళ్తునే వుంటాయని..నీ చరణాలు గద్దరన్నకు మరణం
లేదని.. చాటుతునే వుంటాయని.. మృత్యువుకేమి తెలుసు
నీ మాట పాటై పలుకరించనిదే
పొయ్యిమీద బువ్వ వుడికేది కాదు
పొలంలో తల్లులు మునుము దాటే వాళ్ళు కాదు
సింగరేణి సైరన్లోను, రేలపూల రాగాల్లోను
నీ దరువుల నాదం లేనిదే
పాట పోరు గాలై ప్రతి ధ్వ నించేది కాదు
క్యాంపస్ కోర మీసాల్లోను
కార్మికుల దండల కండల్లోను
నీ రితమే రక్తాన్ని సలసల మందించేది
రైతు చెమట ఊటల్లోనూ
నీ దరువులు లేకుండా పొద్దు గుంకేదికాదు
ఐదు పదుల కాలమంతా
నీ వేలే పట్టుకొని తిరిగింది పాట
నీ పంచే కట్టుకొని ఆడింది ఆట
పాటల విత్తనమై మళ్ళీ మొలకెత్తనీకి
మట్టి గర్భంలోంచి ఎదురు చూస్తున్నావా
'గద్దర్' మూడక్షరాల పదం
భాస్వరమై ప్రజ్వరిల్లగా చూడని మనిషుంటాడా
నాచువట్టి మూల్గుతూ ఉండని దొరల గడీలుంటయా
మద్దుల శిరస్సుపై ముద్దుగా... నీ రాగమెత్తని రాగోలుంటాయా
నీ మరణం మెసేజ్ చూసి... మొబైల్ కాల్స్ విని
రెప్పల తూముల్లోంచి అలుగై దుంకని.. దుఃఖ ముంటుందా
ఇప్ప చెట్టుకింది ఆదిమతల్లి దగ్గరికెల్లి
దోసిల్ల కొద్ది ముచ్చట్లు గుమ్మరిస్తున్నవా
నువ్వు విశ్రాంతిలో వున్నచోటునుంచి
పాటల చిగుర్లు మళ్ళీ మొదలై.. మహా బోధి వృక్ష మై
కోరస్ మొగ్గలు మోయనీకి
లక్షలాది పక్షులు వరుసకట్టినయ్
ఆయువు ఫుల్ స్టాప్ కాడనే ఆగేంత వరకు
ఊపిరి సలుపని పోరాటాలు...ఉద్యమాలు తూటాలు..
ప్రజా కవీ! వాగ్గేయకారుడా!!
నీ గొంగలీ గోచి గజ్జల కాళ్లంటే
మృత్యువుకెంత ఇష్టమో

- డా. ఉదారి నారాయణ
9441413666

# తెలంగాణ ఉద్యమ జ్యోతి ఆచార్య జయశంకర్



ఆధిపత్యశక్తులపై అతడు వీరభద్రుడు, ఆలోచనల అవసరాన్ని తెలిపిన నిబద్ధుడు, తెలంగాణ కనుగొన్న అతడు మరో బుద్ధుడు, అతడే ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్, తెలంగాణను స్వప్నించి, శాసించిన మహోపాధ్యుడు జయశంకర్ సార్ వరంగల్ జిల్లా, ఆత్మకూరు మండలం అక్కన్నపేట గ్రామంలో లక్ష్మీ కాంతారావు, మహాలక్ష్మి దంపతులకు 1934 ఆగస్టు 6న జన్మించాడు. హనుమకొండ లోని మార్కజీ పాఠశాలలో ప్రాథమిక విద్య నేర్చాడు. హనుమకొండ న్యూ హైస్కూల్లో మాధ్యమిక వరకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్. ఎస్. సీ వరకు చదువుకున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని బి.ఏ పూర్తి చేశాడు. బెనారస్ విశ్వవిద్యాలయం, అలీగడ్ విశ్వవిద్యాలయం నుండి పి.జి పూర్తి చేశాడు. జయశంకర్ సార్ సమస్యల పట్ల ఏ విధంగా స్పందించాలో, కానీ ఏ విధంగా ఉద్యమంగా తీర్చిదిద్దాలో నిరూపించే సంఘటన ఒకటి ఈయన విద్యాభ్యాస కాలంలో జరిగింది. అప్పట్లో వరంగల్ లో డిగ్రీ కళాశాల లేదు. డిగ్రీ చదవాలంటే హైదరాబాదుకు వెళ్లాలి. లెక్చరర్స్ ప్రోద్దు బలంతో డిగ్రీ కాలేజీ కావాలని విద్యార్థులు ఉద్యమించారు. అందులో మొదటి వరుసలో జయశంకర్ ఉన్నాడు. ఈ సంఘటన తర్వాత పదేళ్లకు డిగ్రీ కాలేజీ, 30 ఏళ్లకు యూనివర్సిటీ వచ్చింది. ఏదైతే డిగ్రీ కాలేజీ యూనివర్సిటీ కోసం ఉద్యమం చేసిండో అదే యూనివర్సిటీకి ఆచార్య జయశంకర్ వైస్ ఛాన్సలర్ అయ్యాడు. 1960లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టడం ద్వారా ఉద్యోగ జీవితం మొదలైంది. హనుమకొండలో ఉపాధ్యాయుడిగా నియామకమై, లెక్చరర్ గా ఆదిలాబాద్ కు పోయాడు.

1975-79 వరకు సీ కె ఎం కళాశాల ప్రిన్సిపల్ గా, బోర్డు మెంబర్ సేవలందించాడు. 1982-91 వరకు సీఫెల్ రిజిస్ట్రర్ గా పని చేశాడు. 1991-94 వరకు కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గా పనిచేశాడు. ఇవే కాక వివిధ ప్రభుత్వం ఉద్యోగాల్లో సంఘాల పదవుల్లో పనిచేసి తనదైన ముద్ర వేశాడు. ఇన్ని పదవుల్లో పనిచేసిన నాకు సీ. కె ఎం. కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేయడం ఎక్కువ తృప్తినిచ్చింది అని స్వయంగా అన్నాడు. మూడు దశలుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ కీలక పాత్ర



పోషించాడు. 1952 లో ఇంటర్మీడియట్ విద్యార్థిగా తెలంగాణకు జై కొట్టి తరగతులను బహిష్కరించాడు. వరంగల్లో మొదలైన ఉద్యమం హైదరాబాద్ కేంద్రీకృతమైంది. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తెలంగాణ సాధనకు ఎలాంటి వ్యూహాలు రచించారు జయశంకర్ కు తెలుసు. తెలంగాణ ఉద్యమానికి మూడు దశలు ఉన్నాయి. మొదటిది భావజాల వ్యాప్తి.అది జరిగింది.రెండవది ఆందోళన కార్యక్రమం. అది కొనసాగుతున్నది. ఇక మిగిలింది రాజకీయ ప్రక్రియ అది జరగాల్సి ఉంది. దానిని పూర్తి చేయడమే ఉద్యమ కర్తవ్యం కావాలి. దానికి రాజకీయ చిత్తశుద్ధి అవసరము ఇప్పుడున్న రాజకీయ నాయకత్వం ఆ పని పూర్తి చేస్తుందని అని నేను నమ్ముతున్నాను, అని అన్నాడు. మూడు దశలో కూడా జయశంకర్ మాత్రం మరువలేనిది. అందుకే అతడు తెలంగాణ సిద్ధాంతకర్త. మొదటిది తెలంగాణ భావజాల వ్యాప్తి. అది ప్రజలలో చొచ్చుక పోయిందో జయశంకర్ ఒక రోజు ఇట్లు చెప్పిండు.

'ఎందుకమ్మా తెలంగాణ అంటే? సార్ తెలంగాణ వస్తే మా పొలాలకు నీళ్లు వస్తాయి, మా పోరగాళ్ళు కొలువులు వస్తాయి. అనే భావన వారికి కలిగింది ' చదువురాని ఆడవాళ్లు చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకున్నాడు. జయశంకర్ విద్యార్థి, సంఘ నాయకుడు గొప్ప పరిపాలనాదక్షుడు. తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యశురుడు. తెలంగాణ కోసం తెలంగాణ రాజకీయ నాయకులకు తన సహకారం అందించాడు. చెన్న రెడ్డి నుండి చంద్రశేఖర్ రావు వరకు ప్రతి ఒక్కరి రాజకీయ పార్టీకి తన మేదో శ్రమను ధరపోశాడు. అయన ఆశిన్నట్లే చివరగా రాజకీయ ప్రకీయతో నే తెలంగాణ వచ్చింది. అందరిని తన మార్గంలో నడిపించాడు. అందుకే అతడు మార్గదర్శి. తెలంగాణకు చిరునామా, తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్.

*(ఆగస్టు 6 ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి)*

- **దేవులపల్లి రమేశ్**
9963701294

# తొలి రాజకీయ సంస్థ స్థాపకుడు సురేంద్రనాథ్

సర్ సురేంద్రనాథ్ బెనర్జీ (1848 నవంబరు 10-1925 ఆగస్టు6) బ్రిటిష్ కాలంలో భారత రాజకీయ నాయకులలో ఒకడు. తొలి భారతీయ రాజకీయ సంస్థలలో ఒకటైన ఇండియన్ నేషనల్ అసోసియేషణ్‌ను స్థాపించాడు. దీని ద్వారా ఆనందమోహన్ బోస్‌తో కలిసి 1883, 1885 లలో ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్ రెండు సెషన్లకు నాయకత్వం వహించాడు. బెనర్జీ తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సీనియర్ నాయ కుడిగా మారారు. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా మోంటాగు- చెల్మ్‌మ్‌స్ ఫోర్డ్ సంస్కరణలను స్వాగతించాడు. చాలా మంది ఉదారవాద నాయకులతో అతను కాంగ్రెస్ నుండి నిష్క్రమించి, 1919 లో ఇండియన్ నేషనల్ లిబరేషన్ ఫెడరేషన్ అనే కొత్త సంస్థను స్థాపించాడు. అతను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులలో ఒకడు.

సురేంద్రనాథ్ బెనర్జీ బెంగాల్ ప్రావిన్స్ లోని కలకత్తాలో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అతని తండి దుర్గా చరణ్ బెనర్జీ వైద్యుడు, ఉదారవాద, ప్రగతిశీల ఆలోచనలు గలవాడు. అతని తండ్రి అతనిపై తీవ్ర ప్రభావం చూపాడు. కలకత్తా విశ్వవిద్యాలయం నుండి పట్టా పొందిన తరువాత, అతను 1868లో రోమేష్ చుందర్ దత్, బిహారీ లాల్ గుప్తాతో కలిసి ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలను రాయడానికి ఇంగ్లాండ్ వెళ్ళాడు. అతను 1869లో పోటీ పరీక్షలో నెగ్గినప్పటికీ, అతను తన వయస్సును తప్పుగా చూపించాడనే వాదనతో అతనిని నిషేధించారు. బెనర్జీ 1871 లో మళ్లీ పరీక్షను రాసి విజయం పొంది సిల్‌హెట్‌లోఅసిస్టెంట్ మేజిస్ట్రేట్‌గా నియామకం పొందాడు.

బెనర్జీ లండన్‌లోని యూనివర్శిటీ కాలేజీలో తరగతులకు కూడా హాజరయ్యాడు. అతను 1871 లో చివరి పరీక్షలు రాసి 1871 ఆగస్టులో భారత దేశానికి తిరిగి వచ్చాడు. 1874 లో, బెనర్జీ లండన్ తిరిగి వచ్చి మిడిల్ టెంపుల్ లో విద్యార్థి అయ్యాడు. బ్రిటీష్ వారి పట్ల విసుగు చెంది భారతదేశానికి తిరిగి వచ్చాడు. అతను ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో (1874-1875), ఎడ్మండ్ బుర్కే, ఇతర ఉదార తత్వవేత్తల రచనలను



అధ్యయనం చేశాడు. ఈ రచనలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేసిన నిరసనలలో అతనికి మార్గనిర్దేశం చేశాయి. అతన్ని ఇండియన్ బుర్కే అని పిలిచేవారు. 1882 లో అతను స్థాపించిన రిప్పన్ కాలేజీ (ఇప్పుడుసురేంద్రనాథ్ కాలేజీ)లో ఇంగ్లీష్ ప్రొఫెసర్ అయ్యాడు. అతను జాతీయవాద, ఉదారవాద రాజకీయ అంశాలతో పాటు భారతీయ చరిత్రపై బహిరంగ ప్రసంగాలు చేయడం ప్రారంభించాడు.

అతను జూలై 26, 1876 న ఆనందమోహన్ బోస్‌తో కలిసి తొలి భారతీయ రాజకీయ సంస్థ లలో ఒకటైన ఇండియన్ నేషనల్ అసోసియేషన్ను స్థాపించాడు.

1878 లో భారతీయ ప్రజలను బోధించడానికి జరిగిన సమావేశంలో ఆయన ఇలా అన్నాడు, 'హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పరేసీల మధ్య శాంతి, సద్భావనల గొప్ప సిద్ధాంతం, మన దేశ ప్రగతి అన్ని వర్గాల మధ్య. 'ఏకత్వం' అనే పదాన్ని అందులో మెరిసే బంగారం అక్షరాలు చెక్కనివ్వండి... మా మధ్య మత భేదం ఉండవచ్చు, సామాజిక వ్యత్యాసం ఉండవచ్చు. కానీ మనమందరం కలుసుకునే ఒక సాధారణ వేదిక ఉంది. ఇది మన దేశ సంక్షేమం వేదిక '. ఐసిఎస్ పరీక్షలకు హాజరయ్యే భారతీయ విద్యార్థులకు వయోపరిమితి సమస్యను పరిష్కరించడానికి అతను ఈ సంస్థను ఉపయో గించాడు. భారత దేశంలో బ్రిటీష్ అధికారులు దేశవ్యాప్తంగా ప్రసంగాల ద్వారా చేసిన జాతి వివక్షను ఆయన ఖండించాడు. ఇది తనను బాగా ప్రాచుర్యం పొందేట్లు చేసింది.

1879లో అతను ది బెంగాలీ అనే వార్తాపత్రికను స్థాపించాడు. 1883లో తన వార్తా పత్రికలో వ్యాఖ్యలను ప్రచురించినందుకు బెనర్జీని అరెస్టు చేసినప్పుడు, కోర్టు ధిక్కారంలో బెంగాల్ అంతటా, ఆగ్రా, ఫైజాబాద్, అమృత్సర్, లాహోర్, పూణే లలో హర్తాళ్ళు, నిరసనలు చెలరేగాయి. భారత జాతీయ కాంగ్రెస్ గణనీయంగా విస్తరించింది. కలకత్తాలో జరిగిన వార్షిక సమావేశానికి భారత దేశం నలుమూలల నుండి వందలాది మంది ప్రతినిధులు వచ్చారు.

1885లో బొంబాయిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించిన తరువాత, బెనర్జీ 1886 లో వారి సాధారణ లక్ష్యాలు, సభ్యత్వాల కారణంగా తన సంస్థను అందులో విలీనం చేశాడు. 1895లో పూనాలో, 1902 లో అహ్మదా బాద్లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు.

1905 లో బెంగాల్ ప్రావిన్స్ విభజనను నిరసించిన ప్రజా నాయకులలో సురేంద్రనాథ్ ఒకడు. బెనర్జీ ఈ ఉద్యమంలో ముందంజలో ఉన్నాడు.

బెంగాల్, భారతదేశం అంతటా నిరసనలు జరిగి, విస్తృతమైన ప్రజా మద్దతును పొందాడు. ఇది చివరికి 1912 లో బెంగాల్ విభజనను తిప్పికొట్టడానికి బ్రిటిష్ వారిని బలవంతం చేసింది. భారత నాయకులైన గోపాల్‌కృష్ణ గోఖలే, సరోజిని నాయుడులకు బెనర్జీ పోషకునిగా మారారు. మితవాద కాంగ్రెస్ సీనియర్ - మోస్ట్ నాయకులలో బెనర్జీ కూడా ఒకడు. విప్లవం, రాజకీయ స్వాతంత్ర్యాన్ని సమర్థించిన వారు బాల గంగాధర్ తిలక్ నేతృత్వంలో 1906 లో పార్టీని వీడారు. స్వదేశీ ఉద్యమంలో బెనర్జీ ఒక ముఖ్యమైన వ్యక్తిగా విదేశీ ఉత్పత్తులకు వ్యతిరేకంగా భారత దేశంలో తయారైన వస్తువులను సమర్థించాడు.

1909 లో మోర్లే-మింటో సంస్కరణలకు బెనర్జీ మద్దతు ఇచ్చాడు. మహాత్మా గాంధీ ప్రతిపాదించిన శాసనోల్లంఘన ఉద్యమం ప్రతిపాదిత పద్ధతిని బెనర్జీ విమర్శించాడు. మాంటెగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణలను అంగీకరించడానికి సురేంద్రనాథ్ బెనర్జీ అనుకూలంగా ఉన్నాడు.

కొందరు కాంగ్రెస్‌ను విడిచిపెట్టి ఇండియన్ లిబరేషన్ ఫెడరేషన్‌ను స్థాపించారు. వారిని ఉదారవాదులు అని పిలుస్తారు. ఆ తరువాత వారు భారత జాతీయ ఉద్యమంలో తమ సాంగత్యాన్ని కోల్పోయారు. బెంగాల్ ప్రభుత్వంలో మంత్రి పదవిని అంగీకరించడం అతనికి జాతీయ వాదుల, ప్రజలకు కోపాన్ని కలిగించింది.

అతను 1921లో సంస్కరించ బడిన శాసన మండలికి ఎన్నుకోబడ్డాడు. అదే సంవత్సరంలో 1921 నుండి 1924 వరకు స్థానిక స్వపరిపాలన మంత్రిగా పదవిలో ఉన్నాడు. 1923లో ఎన్నికలలో అతని ఓటమి అతని రాజకీయ జీవితాన్ని ముగించింది. కాగా 1923లో బెంగాల్ శాసనసభ ఎన్నికలలో స్వరాజ్య పార్టీ అభ్యర్థి బిధన్ చంద్రరాయ్ చేతిలో ఓడిపోయాడు. బ్రిటీష్ సామ్రాజ్యానికి రాజకీయ మద్దతు ఇచ్చినందుకు అతను నైట్ అయ్యాడు. బెనర్జీ బెంగాల్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేస్తున్నప్పుడు కలకత్తా మునిసిపల్ కార్పొరేషన్ను మరింత ప్రజాస్వామ్య సంస్థగా మార్చాడు. ఆయన 1925 లో ప్రచురించబడిన ఎ నేషన్ ఇన్ మేకింగ్ ద్వారా విస్తృతంగా ప్రశంసలు అందుకున్నాడు. సురేంద్రనాథ్ 6 ఆగస్టు 1925 న బరాక్పూర్లో మరణించాడు.

భారత రాజకీయాల అధికారీ కరణకు మొదటిగా బాట వేసిన నేతగా-భారత రాజకీయాల మార్గదర్శకునిగా బాగా గుర్తుంచుకోబడుతున్నాడు. బ్రిటీషువారు ఆయన చివరి సంవత్సరాలలో ''సరెండర్ నాట్'' బెనర్జీగా గౌరవించారు.

- **రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## నవ్వుపూల వనమొకటి

నవ్వుల విత్తనాలు నాటిన
వసంతంలాంటి పూలవనమొకటి
కావాలి నాకు
చిన్నారి పాదం మోపినట్లు
ఆ నేల పవిత్రం కావాలి.
అమ్మ చూపులా వెన్నెల పూత
వనంలో విరబూయాలి.
తీరని దాహంతో నెర్రెలిచ్చిన
నల్లరేగడి నేలపైన
కరుణ కన్నీటి ధారలు కురిపించి
అది ఆశల చిగుళ్లు తొడగాలి.
కన్నతల్లి కళ్లలో కనిపించే
అలకలులేని అమాయక కాంతిలా
గుండెలో పదిలంగా ఉన్న
స్వచ్ఛమైన ఆనందం వెల్లి విరియాలి
నవ్వు పువ్వుగా వికసించే
క్షణం వరకు ఓర్పుతో వేచి ఉండాలి
ప్రపంచ గ్రంథాల సారమంతా కలిపి
అన్ని మతాల ఏకత్వాన్ని చాటి
కుల, మత భేదాలు లేని
మానవత్వపు నవ్వుపువ్వులు
పరిమళించాలి
స్వచ్ఛమైన నవ్వులజలం సేవించి
అజ్ఞానపు కలుపు మొక్కలు తీసేసి
జ్ఞానపు పరిమళాన్ని వెదజల్లాలి.
నాకో నవ్వులపూల వనం కావాలి,
అది కేవలం పూలవనం మాత్రమే కాదు.
మానవత్వం మరచిపోని,
బంధాలకు ప్రతీకైన వనం కావాలి
మానవ బంధాల విలువలని
మరువని మధుర పరిమళాలతో
నిత్యం పరిమళించే
నవ్వుల పూలవనమొకటి
కావాలి నాకు!

-విల్సన్ రావు కొమ్మవరపు
89 85 43 55 15

# 'ఏదైనా అంతా మన మంచికే'...



'ఏదైనా మన మంచికే' అనే సూక్తి కేవలం ఒక ఆశావాద వాక్యం కాదు; ఇది మానవ మనస్తత్వం, జీవిత పాఠాలను అర్థం చేసుకునే విధానంపై ఆధారపడిన ఒక సంక్లిష్ట తాత్విక దృక్పథం. ఇది ఉపరితలంపై సరళంగా కనిపించినప్పటికీ, దీని వెనుక లోతైన మనోవైజ్ఞానిక, ఆధ్యాత్మిక, సామాజిక కోణాలు దాగి ఉన్నాయి.

**తాత్విక పునాదులు ఆశావాదం**

ఆశావాదానికి మూలస్తంభం లాంటిది. ఇది జీవితంలో సంభవించే ప్రతి సంఘటన, అది మంచిదైనా చెడుదైనా, చివరికి మనకు మేలు చేస్తుందని లేదా ఒక విలువైన పాఠాన్ని నేర్పుతుందని నమ్ముతుంది.

**నియంత్రణ అంగీకారం:** మన నియంత్రణలో లేని విషయాలపై బాధపడకుండా, వాటిని అంగీకరించే వైఖరిని ప్రోత్సహిస్తుంది. స్టోయిసిజం వంటి ప్రాచీన తత్వశాస్త్రాలు కూడా ఇదే భావనను ప్రతిబింబిస్తాయి. మనకు జరిగిన వాటిని మార్చలేము.

కానీ వాటికి మనం ఎలా ప్రతిస్పందిస్తామనేది మన చేతుల్లో ఉంటుంది.

**అంతిమ ప్రయోజనం:** ఇది బాధను విస్మరించమని చెప్పదు. బదులుగా దీర్ఘకాలికంగా ఆ సంఘటన నుండి ఏదో ఒక ప్రయోజనం లభిస్తుందని చెబుతుంది. ఇది వ్యక్తిగత ఎదుగుదల కావచ్చు కొత్త అవకాశాలు కావచ్చు, లేదా ఒక కొత్త దృక్కోణం కావచ్చు అని తెలియజేస్తుంది. ఇది 'ఒక తలుపు మూసుకుంటే, ఇంకో తలుపు తెరుచుకుంటుంది' అనే భావనకు దగ్గరగా ఉంటుంది.

**మానసిక భావోద్వేగ ప్రభావాలు**

దీనిని నమ్మడం వల్ల మన మానసిక ఆరోగ్యంపై గణనీయమైన సానుకూల ప్రభావాలు ఉంటాయి.

**మానసిక స్థితిస్థాపకత:** కష్టాలను తట్టుకుని నిలబడటానికి, వాటి నుండి కోలుకోవడానికి ఈ భావన సహాయపడుతుంది. ఒక వైఫల్యం తర్వాత కుంగిపోకుండా, అది ఒక పాఠం లేదా ప్రగతికి సోపానం అని భావించడం ద్వారా, వ్యక్తి మరింత దృఢంగా మారతాడు.

**తగ్గిన ఒత్తిడి, ఆందోళన:** భవిష్యత్తు గురించి లేదా జరిగిన వాటి గురించి ఎక్కువగా ఆందోళన చెందకుండా, 'అంతా మంచి జరుగుతుంది' అనే నమ్మకం ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది.

ఇది వర్తమాన క్షణంపై దృష్టి పెట్టడానికి సహాయపడుతుంది.

**బాధను అర్థం చేసుకోవడం:** నష్టం లేదా వైఫల్యం బాధను తక్కువ చేయదు, కానీ ఆ బాధకు ఒక అర్థాన్ని, ఒక ప్రయోజనాన్ని ఆపాదించడానికి సహాయపడుతుంది. 'ఈ బాధ నన్ను బలపరుస్తుంది' లేదా 'దీని నుండి నేను నేర్చుకోవాలి' అనే ఆలోచన బాధను తట్టుకోవడాన్ని సులభతరం చేస్తుంది.

**కృతజ్ఞతా భావం:** కొన్నిసార్లు, ఒక చెడు సంఘటన జరిగిన తర్వాత, మనం ఇంతకు ముందు పట్టించుకోని విషయాలపై కృతజ్ఞతా భావాన్ని పెంపొందించవచ్చు. ఉదాహరణకు, అనారోగ్యం తర్వాత ఆరోగ్యం విలువ తెలుసుకోవడం.



**ప్రవర్తనాత్మక , కార్యాచరణ ప్రభావాలు**

కేవలం ఆలోచన స్థాయిలోనే కాకుండా, ఈ సూక్తి మన ప్రవర్తనను, మనం తీసుకునే నిర్ణయాలను కూడా ప్రభావితం చేస్తుంది.

**సమస్య-పరిష్కార వైఖరి:** ప్రతికూల పరిస్థితిని ఒక సమస్యగా కాకుండా, ఒక సవాలుగా లేదా పరిష్కరించాల్సిన పజిల్గా చూసేలా ప్రోత్సహిస్తుంది. ఇది నిస్సహాయత భావనను తగ్గించి, చురుకైన పరిష్కార మార్గాలను అన్వేషించడానికి దారితీస్తుంది.

**వినూత్న ఆలోచన :** కొన్నిసార్లు ఒక ప్రణాళిక విఫలమైనప్పుడు, అది మనల్ని కొత్త, వినూత్నమైన ఆలో చనలు చేయడానికి ప్రేరేపిస్తుంది. 'ప్రయత్నించి విఫల మవడమే ఉత్తమ మార్గం, ఎందుకంటే అది మీకు కొత్త మార్గాలను చూపిస్తుంది' అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది.

**పరిస్థితులకు అనుగుణంగా మారడం:** జీవితం నిరంతరం మారుతూ ఉంటుంది. 'ఏదైనా మన మంచికే' అనే భావన మనల్ని మార్పులకు మరింత సులభంగా అనుగుణంగా మారేలా చేస్తుంది, ఎందుకంటే మనం ఆ మార్పుల వెనుక ఒక ప్రయోజనం ఉంటుందని విశ్వసిస్తాం.

**పరిమితులు, అపోహలు:** ఈ సూక్తి శక్తివంతమైనదైనప్పటికీ,దానిని గుడ్డిగా అనుసరించడం కొన్నిసార్లు తప్పుదారి పట్టించవచ్చు.

**నిష్క్రియాత్మకతకు దారి తీయకూడదు:** 'ఏదైనా మన మంచికే' అంటే మనం ఏమీ చేయకుండా కూర్చోవడం లేదా కష్టాల కోసం ఎదురుచూడటం కాదు. ఇది జరిగిన తర్వాత దాని నుండి పాఠం నేర్చుకోవడానికి సంబంధించినది, కానీ నిష్క్రియాత్మకంగా ఉండటానికి కాదు. మనం ఎల్లప్పుడూ మన వంతు కృషి చేయాలి.

**బాధ్యతారాహిత్యం:** ఈ సామెతను మన తప్పులకు లేదా నిర్లక్ష్యానికి సాకుగా ఉపయోగించకూడదు. మన చర్యలకు మనం బాధ్యత వహించాలి. వాటి పర్యవసానాలను అంగీకరించాలి.

**అతిగా సరళీకరించడం:** కొన్ని తీవ్రమైన దురదృష్టాలు లేదా విషాద సంఘటనలను 'మంచికే' అని సరళీకరించడం బాధిత వ్యక్తికి అగౌరవంగా అనిపించవచ్చు. ప్రతీ సందర్భంలోనూ తక్షణమే సానుకూలతను చూడలేకపోవచ్చు. కొన్నింటిని జీర్ణించుకోవడానికి సమయం పడుతుంది.

'ఏదైనా మన మంచికే' అనేది జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సానుకూల దృక్పథంతో స్వీకరించడానికి, వాటి నుండి పాఠాలు నేర్చుకోవడానికి, మానసిక స్థితిస్థాపకతను పెంపొందించుకోవడానికి ఒక శక్తివంతమైన సాధనం. ఇది ఒక అంతర్గత శక్తిని, ఆశావాదాన్ని నింపుతుంది. అయితే, ఈ సూక్తిని సరైన సందర్భంలో, బాధ్యతాయుతంగా అర్థం చేసుకోవడం ముఖ్యం. ఇది నిష్క్రియాత్మకతకు లేదా బాధ్యతారాహిత్యానికి దారి తీయకూడదు, బదులుగా ప్రతికూలతలను ప్రగతికి సోపానాలుగా మార్చుకునే స్ఫూర్తిని అందించాలి.

- **జనక మోహన రావు దుంగ**
8247045230

### రూ.52 కోట్ల నిధుల విడుదలకు

# సీఎంకు మాజీ మంత్రి విజ్ఞప్తి

### సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి



**జగిత్యాల ఆగస్టు 05 ( మనం ప్రతినిధి):** జగిత్యాల పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదలకు 2008లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి కావలసిన స్థలాన్ని సేకరించి 4,000 మందికి ఇల్లు మంజూరు చేయగా, అందులో రెండు వేల ఇళ్లను తొలగించి గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే.వివిధ దశలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కావలసిన నిధుల మంజూరు కి గాను గతంలో సీఎం రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేయగా, కలెక్టర్ ను నివేదిక కోరగా,ఇళ్ల నిర్మాణానికి రూ.52 కోట్లు అవసరమవుతాయని నివేదిక సమర్పించగా, మాజీ మంత్రి జీవన్ రెడ్డి మరోసారి మంగళవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి 1611 ఇళ్ల నిర్మాణాల పూర్తి చేసేందుకు 52 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు.

# పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

- అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

**జగిత్యాల ఆగస్టు 05(మనం ప్రతినిధి):** నుల్లి పురుగుల నివారణకు 1 నుంచి 19ఏండ్ల లోపు పిల్లలందరికీ తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రం వేయిం చాలని అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత అధికారులను ఆదేశించారు. ఈనెల 11వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళ వారం కలెక్టరేట్లో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. జిల్లాలో 1 నుంచి19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు 2,22,950 మంది ఉన్నారన్నారు. వారికి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 2175 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పా రు. ఈనెల 11న అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధి లోని, ప్రభుత్వ/ ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ ప్రైవేటు కళా శాలలు, అంగన్వాడి కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు స్వయంగా వైద్య ఆరోగ్య సిబ్బంది వేస్తారన్నారు. నులి పురుగులలో ఎలిక పాములు, నులి పురుగులు, కొంకి పురుగులు ఉంటాయని ఇవి పిల్లలు ఆరుబయట మట్టితో ఆడుకున్నప్పుడు, చేతులు కడుక్కోకుండా ఆహారం భుజించినప్పుడు, బహిరంగ ప్రదేశంలో మలవిసర్జన చేయుట వలన, అపరిశుభ్ర పరిసరాల వలన ఇవి సంక్రమిస్తాయన్నారు. పిల్లల్లో నులి పురుగుల సంక్రమణ ప్రభావం వలన రక్తహీనత, చురుకుదనం లోపించడం, పోషకహార లోపం, ఆకలి లేకపోవడం, వంటి సమస్యలు ఉంటాయన్నారు. దాంతో బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి వికారం మరియు విరేచనాలు లాంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయన్నారు. దీనివలన పిల్లలు ఏకాగ్రత కోల్పో తారని, పని సామర్థ్యం తగ్గిపో తుందని, హాజరు శాతం తగ్గిపోవడం, పిల్లల్లో కడుపునొప్పి ఇలాంటి సమస్యలు ఏర్ప డతాయన్నారు. ఈ మాత్రల ద్వారా ఎటువంటి దుష్ప్ర భావా లు కలగవని, ఆగస్టు 11 వ తేదీ నాడు ఈ మాత్రలు తీసు కొనని పిల్లలకు ఆగస్టు 18 తేదీన మోప్ అప్ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బందితో పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం లో విద్యాశాఖ, జిల్లా సంక్షేమ శాఖ అధికారుల తోపాటు అన్ని శాఖలు సమన్వయంతో పాల్గొని అర్హులైన పిల్లలందరికీ ఆల్బెండజోలు మాత్రలు 100శాతం పంపిణీ జరిగే



విధంగా చూడాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా పర్యవేక్షించాలని డీఈవో, డిస్ట్రిక్ ఇంటర్మీడియట్ అధికారి , జిల్లా సంక్షేమ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరో గ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి అన్ని రకాలుగా వైద్య ఆరోగ్యశాఖ సిద్ధంగా ఉందని, క్షేత్రస్థాయిలోని సిబ్బందికి ట్రైనింగ్ నిర్వహించడం జరిగిందని, రాపిడ్ రెస్పాన్స్ టీమ్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎన్ శ్రీనివాస్, డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్ రెడ్డి, డాక్టర్ అర్చన , డీడబ్ల్యు ఓ డాక్టర్ నరేష్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యశాఖ అధికారి నారాయణ, సూపర్ ఇండియన్ డాక్టర్ సుమన్, డాక్టర్ చైతన్య సుధా, ఆరోగ్య విద్యా బోధకులు కటకం భూమేశ్వర్, తరాల శంకర్, హెచ్ ఈ ఓ రాజేశం, సూపర్వైజర్ శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం, దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం

- కోరుట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్

**జగిత్యాల, ఆగస్టు 05(మనం న్యూస్):** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ,అలాగే కేటీఆర్ ,హరీష్ రావులు చేస్తున్న ఆరోపణలు సరైనవి కావని, కేవలం వారి పార్టీ కొరకు మరియు వాళ్ళ యొక్క సొంత రాజకీయం కోసం ఈ యొక్క ప్రాజెక్టు అంశం ముందు పెట్టి ప్రాంతీయ వివాదాలు సృష్టించి తెలంగాణలో తెలుగుదేశం పార్టీ రాకూడదని దురుద్దేశంతో పనికట్టుకొని ప్రచారం చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. అలాగే ,ఈ సమావేశంలో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి గానీ, కెసిఆర్ కి గాని, కేటీఆర్ కి గాని ,హరీష్ రావుకి గాని ముక్కు సూటిగా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చి అప్పుడు బనకచర్ల గురించి మాట్లాడమని ప్రవీణ్ కుమార్ ఛాలెంజ్ చేసారు.

కేసీఆర్ గారు దళితులకు మూడెకరాల భూమి



ఇస్తా అంటివి ఇచ్చినవా, ఇయ్యలేదు లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చినారా, ఇయ్యలేదు. మీ హయాంలో కనీసం ఒక్క కొత్త రేషన్ కార్డు అని ఇచ్చినారా, ఇయ్యలేదు. అట్లాగే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా అని చెప్పేసి మాటిచ్చినవ్ చేసినవా చేయలేదు .అసెంబ్లీ సాక్షిగా ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తా అని చెప్పినవ్ ఇచ్చినవా, ఇవ్వలేదు. దొంగ మాటలు చెప్పి, ఏ ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వకుండా తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ జీవితాలతో ఆడుకొని ,అలాగే తెలంగాణ రాష్ట్రం ధనిక రాష్ట్రం అని తెలిసి కూడా పది సంవత్సరాలు మీరు పాలించిన రాష్ట్రంలో అప్పులను పెంచేసి ఈరోజు అప్పు యొక్క అంశం పక్కన పెట్టేసి ఈరోజు బనకచర్లపై అబద్ధం ప్రచారాన్ని మానుకోవాలని ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు తెలంగాణలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత తెలుగుదేశం పార్టీది అని అలాగే రెండు తెలుగు రాష్ట్రాల నుండి ప్రవహిస్తున్న కృష్ణా నదుల నుండి ప్రతి ఏట దాదాపు 300 టిఎంసి నీరు వృధాగా సముద్రం పాలవుతుందని ఆనాడు రీడిజైనింగ్ పేరుతో ఇంజనీరింగ్ అవతారం ఎత్తిన కేసీఆర్ నేటి ప్రజలకు ఏమని సమాధానం చెప్తారని ప్రవీణ్ కుమార్ అన్నారు. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు ముందంజలో ఉండాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు గారు పలు సందర్భాల్లో తన ఆకాంక్షను వెల్లడించిన మాట తెలంగాణ ప్రజలు మరిచిపోవద్దని, ఇలాంటి స్వార్థ రాజకీయ నాయకుల మాటలు తెలంగాణ ప్రజలు నమ్మవద్దని, అలాగే రెండు రాష్ట్రాల విజ్ఞప్తులను కేంద్రం పరిశీలించి తన నిర్ణయం వెల్లడించి ఎవరికి రావాల్సిన వాటి వారికి కేంద్ర ఇవ్వనప్పుడు మాట్లాడాలి తప్ప పని పట్టుకొని ప్రతిరోజు ఇదే అంశంపై పలుమార్లు అబద్ధం ప్రచారం చెబుతూ రాజకీయంగా వాడుకోవడం కేసిఆర్ కుటుంబం కి అలవాటుగా మారిందని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఇకనైనా అబద్దాలు మాట్లాడవద్దని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కొరకు కృషి చేయాలని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎండి రఫీ యుద్దీన్ ,బాలే మారుతి, మహాదేవ్ ,తెలుగు యువత నాయకులు సందీప్, సిద్ధు, జగదీష్, ఆసిఫ్ ,నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

### రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులలో

# మెరుగైన వైద్య సేవలు అందాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**సుల్తానాబాద్, ఆగస్టు 05 (మనం న్యూస్):** రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పెద్దపల్లి పట్టణం రంగంపల్లి లోని బస్తీ దావాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి కి వస్తున్న ఔట్ పేషెంట్ వివరాలు, ల్యాబ్ లో జరుగుతున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఫార్మసి విభాగంలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు, డెంగ్యూ కేసులు, పి.హెచ్.సి పరిధిలో జరుగుతున్న ప్రసవాల సంఖ్య మొదలగు అంశాలను కలెక్టర్ తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, బస్తీ దావాఖానాలో షుగర్ పరీక్షించేందుకు గ్లుకో మీటర్ మంజూరు చేస్తామని అన్నారు. ఎన్.సి.డి రోగులకు ప్రతి నెలా మందులు సరఫరా చేయాలని అన్నారు. గర్రెపల్లి పి.హెచ్.సి ఆసుపత్రిలో ఉన్న సి.బి.పి మెషిన్ మరమ్మత్తు 3 రోజులలో చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డెంగ్యూ ,మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధుల లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డాక్టర్లు రామకృష్ణ, స్వప్న, సింధూజ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాగు అవసరాలకు జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

- ఆర్.ఎఫ్.సి.ఎల్ ద్వారా ఆగస్టు 6న 3 వేల మెట్రిక్ టన్నులు యూరియా పెద్దపల్లి జిల్లాకు స్టాక్ తరలింపు
- వారం రోజులలో జిల్లాకు చేరుకొనున్నమరో 3 వేల మెట్రిప్ టన్నుల యూరియా కేటాయింపు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 05 (మనం ప్రతినిధి):** పెద్దపల్లి జిల్లాలో రైతుల సాగు అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి కొరత లెదని, రైతులు అనవసర ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 2270 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఆగస్టు 6న ఆర్.ఎఫ్.సి.ఎల్ నుంచి మనకు 3,000 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ వస్తుందని, వారం రోజులలో అదనంగా మరో 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరుకుంటుందని కలెక్టర్ తెలిపారు. రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందవద్దని, రైతులు ఆందోళనతో యూరియాను అదనంగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రస్తుతం రైతుల డోసు ఎంత కావాలో అంతే కొనుగోలు చేయాలని, ప్రతి రైతు ఈ విధానాన్ని పాటించాలని అప్పుడే యూరియా పంపిణీ సాఫీగా సాగుతుందని అన్నారు. నాలుగు నెలలకు అవసరమైన యూరియా ఒకేసారి కొనుగోలు చే చేయవద్దని, దీనివల్ల రైతులకు నష్టం కలుగుతుందని , పరిమితికి మించి యూరియా వాడవద్దని ఇది అత్యంత ప్రమాదకరమని అన్నారు. ప్రస్తుతం యూరియా కొనుగోలు చేసి నిల్వ ఉంచడం వలన దానిలో ఉన్న నత్రజని ఆవిరి చెందుతుందని, ప్రస్తుత డోస్ కి అవసరం మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాల్సిందిగా రైతులకు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

### ఆధార్ అప్‌డేషన్ ప్రత్యేక క్యాంపును

# ప్రజలు వినియోగించుకోవాలి

### ఆగస్టు 8 వరకు సమీకృత కలెక్టరేట్ లో ఆధార్ అప్ డేట్ ప్రత్యేక క్యాంపు నిర్వహణ



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ఆగస్టు 05 (మనం ప్రతినిధి):** ఆధార్ అప్ డేషన్ ప్రత్యేక క్యాంపు ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ఆధార్ అపడేషన్ ప్రత్యేక క్యాంపు ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆధార్ కార్డు వివరాలను అప్ డేట్ చేసుకునేందుకు ప్రత్యేక క్యాంపు కలెక్టరేట్ నందు ఏర్పాటు చేశామని , ఆగస్టు 8 వరకు జరిగే ఆధార్ అప్ డేట్ ప్రత్యేక క్యాంప్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఆధార్ అప్ డేషన్ కోసం వచ్చే ప్రజలకు అవసరమైన వసతులు త్రాగు నీరు అందుబాటులో పెట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రత్యేక క్యాంపులో నూతన ఆధార్ కార్డు ఎన్ రోల్ మెంట్ ఉచితంగా జరుగుతుందని అన్నారు. బయోమెట్రిక్ అప్ డేషన్ (ఫింగర్ ప్రింట్,ఐరిస్, ఫోటో) చేయడానికి 100 రూపాయల రుసుం, డేమోగ్రాఫిక్ అప్ డేషన్ బయోమెట్రిక్ అప్ డేట్ తో కలిసి చేస్తే ఉచితంగా ఉంటుందని, ప్రత్యేకంగా డేమోగ్రాఫిక్ అప్ డేషన్(అడ్రస్,మొబైల్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, పేరు...) 50 రూపాయల రుసుము చెల్లించాలని కలెక్టర్ అన్నారు. ఆధార్ అప్ డేషన్ కోసం నిర్ణిత రుసుము కంటే అధికంగా డిమాండ్ చేస్తే 1947 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్వో(యు.ఐ.డి.ఏ.ఐ) నరేష్ చంద్ర, ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్, ఈ.డి.ఎం. కవిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

**మల్లాపూర్, ఆగస్టు 05 ( మనం న్యూస్):** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మరియు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ పి.హెచ్.సి ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ లో జరుగుతున్న వైద్య పరీక్షల వివరాలను, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. రోగులకు కావలసిన మందులు (మెడిసిన్) అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యులకు ఆదేశించారు . ఆసుపత్రిలో ఎంత మంది ఇన్ - ఔట్ పేషెంట్ వస్తున్నారో ఆరా తీశారు.సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఔట్ పేషంట్ లలో వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని, రోగి లక్షణాలు రికార్డు చేయాలని తెలిపారు. ముందస్తుగా వ్యాధి నిర్ధారణ జరిగితే మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, సమయ పాలన పాటించాలని అన్నారు.



**తహసిల్దార్ కార్యాలయం ను ఆకస్మిక తనిఖీ**

మల్లాపూర్ మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తెలంగాణ ప్రభుత్వం గత నెల కిందట నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆగస్టు నెల 14 వరకు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు వేగవంతంగా అందించుటకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట మెట్ పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, మల్లాపూర్ తహసిల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట మెట్ పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఏం ఆర్ ఓ రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

### ఆగస్టు 9న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి




- ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చేయండి..
- ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు సిద్ధబోయిన శ్రీకాంత్

**కరకగూడెం, ఆగస్టు 5(మనం న్యూస్):** ఆగస్టు 9 సెలవుదినంగా ప్రకటించాలని తుడుం దెబ్బ మండల నాయకులు సిద్దబోయిన శ్రీకాంత్ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.కరకగూడెం మండలం బట్టుపల్లి వీరాపురం క్రాస్ రోడ్ కొమరం భీం సెంటర్లో ఆగస్టు 9వ తేదీన జరుగు ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని అన్ని ఆదివాసి సంఘాలతో కలిసి జయప్రదం చేయుటకు ప్రతి గ్రామం నుంచి యువత కదిలి రావాలని పిలుపునిచ్చారు.ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసుల దినోత్సవం పండగా వాతావరణంలో ఆదివాసి సంప్రదాయాలు సంస్కృతి అద్దం పట్టేలా నిర్వహిస్తున్నామని అన్నారు. ఆదివాసీల అస్తిత్వాన్ని హక్కులను పరిరక్షణకై పోరాటాలు చేయాలని అన్నారు.ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలకు ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహించాలని, ప్రత్యేక నిధులు కేటాయించాలని, హక్కులు, చట్టాలపై,సమీక్ష చేయాలని ఆయన కోరారు.ఆగస్టు 9న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల అభివృద్ధి కోసం ప్రత్యేక ఆర్థిక పాలసీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసి ఎమ్మెల్యేలు మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం చే అధికారికంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

- ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలి
- కళాశాల సమయంలో బస్సులు నడిపేలా చర్యలు
- తాత్కాలిక హాస్టల్ ఏర్పాటుకు కసరత్తులు
- సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి




**హుస్నాబాద్, ఆగస్టు 5(మనం న్యూస్):** ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. హుస్నాబాద్ పట్టణం గాంధీ నగర్ గ్రామ శివారులో గల పాలిటెక్నిక్ కళాశాల మొదటి అంతస్తులో కొనసాగుతున్న శాతవాహన ఇంజనీరింగ్ కళాశాలను జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. మొదటి విడత కౌన్సిలింగ్‌లో ఇంజనీరింగ్ కాలేజీలో 160 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారని డిపార్ట్మెంటల్ అటాచ్డ్ హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో చాలా మంది 2 వ విడత కౌన్సిలింగ్ లో వేరే కళాశాలకి వెళ్ళారనీ ఇప్పటివరకు మొదటి సంవత్సరం అన్ని బ్రాంచ్‌లలో 91 అడ్మిషన్ తీసుకున్నారని కాలేజ్ ప్రిన్సిపాల్ రవి కుమార్ జిల్లా కలెక్టర్‌కి తెలిపారు. 3వ విడత కౌన్సెలింగ్‌లో ఇంజనీరింగ్ కళాశాల, డిపార్ట్మెంటల్ అటాచ్డ్ హాస్టల్‌లని పెడితే అడ్మిషన్లు వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. అడ్మిషన్ మాత్రం పోకుండా చూడాలని అన్నారు. బాలుర, బాలికలకు వేరు వేరుగా తాత్కాలిక హాస్టల్ వసతి కొరకు అన్వేషణ చెయ్యాలని తహసీల్దార్ కి తెలిపారు. 250 పాలిటెక్నిక్ కళాశాల లో విద్యార్థులు,ఇంజనీర్ విద్యార్థులకు సరిపడా నీటి కొరత రాకుండా చూసుకోవాలని మిషన్ భగీరథ డీఈ తో ఫోన్ లో మాట్లాడి పరిష్కరించారు. ఐఓసి రోడ్ నుండి కళాశాల ప్రాంగణం వరకు సీసీ రోడ్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ శాఖ అధికారులు కొలతలు వేసి ఎస్టిమేట్ వెయ్యాలని తెలిపారు. కళాశాల ప్రాంగణం మొత్తం చెట్ల పొదలు తొలగించి శుభ్రం చేయించాలని డిపిఓ కి ఫోన్ ద్వారా తెలిపారు. హుస్నాబాద్ పట్టణం నుండి కళాశాల వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం కల్పిస్తామని అడ్మిషన్ పొందిన విద్యార్థులకు చదువు, మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి , పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక దందా

- తప్పుడు పత్రాలతో అక్రమ రవాణా
- ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

**కొండపాక, ఆగస్టు 5(మనం న్యూస్):** ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలిస్తున్నట్టు తప్పుడు పత్రాలను వాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే కొండపాక మండలం వెలికట్ట శివారులో పలువురు ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలించేందుకు అనుమతి తీసుకున్నట్టుగా పర్మిషన్ తేదీ అయిపోయిన పత్రాలను వాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ విషయం టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టాస్కోర్స్ సిఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి పరిశీలించగా అసలు విషయం తేటతెల్లమైంది. మే నెల తొమ్మిదో తేదీన ఇసుక పర్మిషన్ ఉన్న పత్రాలు వారి వద్ద లభించాయి. వాటిని చూపిస్తూ అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ముంపు సమస్యల పరిష్కారానికి కృషి



- రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్
- రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో ఓపెన్ డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభం

**రామచంద్రపురం, ఆగస్టు 5(మనం న్యూస్):** రామచంద్రపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అన్నారు. మంగళవారం 23 లక్షలతో కాలనీలో నిర్మించనున్న ఓపెన్ డ్రైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ పుష్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తేలికపాటి వర్షం పడితే రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో ఉన్న లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఓపెన్ డ్రైన్ కోసం సుమారు 23.00 లక్షల నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. ఈ డ్రైన్ పనులు పూర్తయితే ముంపు సమస్య పరిష్కారం అవుతదని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు జగన్నాథ్ రెడ్డి, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఈఈ సురేష్, ఏఈ దివ్య, చంద్రశేఖర్ గుప్తా, తిరుమల్ గౌడ్, శశికళ యాదవ రెడ్డి, వీర రెడ్డి, వాసుదేవ్, మాధవ రెడ్డి, రాజశేఖర్, యాదయ్య, సిఎం మల్లేష్, వెంకట్ రెడ్డి, విఠల్ రెడ్డి, భుజంగ రెడ్డి, నిరంజన్ రెడ్డి, సహదేవ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మీ దశను మార్చుకునే విద్యార్థి దశ చాలా కీలకం

- ఇష్టపడి చదివి ఉన్నత స్థానానికి వెళ్లాలి
- కుటుంబ సమస్యలను చదువుతో ముడి పెట్టొద్దు
- హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీను




**హుస్నాబాద్, ఆగస్టు 5(మనం న్యూస్):** విద్యార్థి దశ చాలా కీలకం మీ దశను మీరు మార్చుకునే అవకాశం మీ చేతుల్లోనే ఉంటుందని హుస్నాబాద్ సి.ఐ.కొండ్ర శ్రీను అన్నారు. అక్కన్నపేట ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ గర్ల్స్ విద్యార్థినులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవ్ టీజింగ్, నూతన చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీను మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూల్‌లో భాగంగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానానికి వెళ్లాలన్నారు. సమయం దొరికిన ప్పుడల్లా మంచి మంచి మహానుభావుల చరిత్ర చదువుతూ ఉండాలి అని సూచించారు. కుటుంబంలో ఒక మహిళా చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం బాగుపడుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను విద్య నేర్పిన గురువులను గౌరవిస్తూ ఉండాలన్నారు. తలదించు కొని చదివి తలెత్తుకుని బతకాలన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, వాట్సప్ స్టేటస్‌లో, మీకు మీ కుటుంబానికి సంబంధించిన ఫోటోలు పెట్టి ఇబ్బందులకు గురి కావద్దన్నారు. అవసరం మేరకు సోషల్ మీడియా వాడుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి చదువు చాలా ముఖ్యం, ఎవరికైనా, ఏదైనా జరిగితే మనకెందుకులే అని నిర్లక్ష్యం చేయకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి అన్నారు. కుటుంబ సమస్యలు చదువుకు ముడి పెట్టొద్దన్నారు. ఉపాధ్యాయులు గురువులు అంటే భయం భక్తి ఉన్న వారు జీవితంలో వారు అనుకున్న గోల్ సాధిస్తార న్నారు. ఉపాధ్యాయులు చెప్పేది శ్రద్ధగా వినడం చాలా ముఖ్యం. సైబర్ నేరాలు మన తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేయొద్దన్నారు. మీరు కానీ మీకు తెలిసిన వారు కానీ, మీ బంధువులు కానీ, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నం. 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మమత, అధ్యాపకులు, హుస్నాబాద్ షీ టీమ్ బృందం సదయ్య, మహిళా కానిస్టేబుల్ ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బైండోవర్ ఉల్లంఘన రూ. 30 వేల జరిమానా



- మళ్లీ పట్టుబడితే పీడీయాక్ట్
- హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్

**హుస్నాబాద్, ఆగస్టు 5(మనం న్యూస్):** సారా తయారు చేస్తూ పట్టుబడిన కేసులో పట్టుబడి బైండోవర్ ఉల్లంఘించిన ఓ వ్యక్తికి రూ.30 వేల జరిమానా వేసినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బెజ్జంకి మండలం చీలాపూర్ పల్లి (వడ్డెర కాలనీ) కి చెందిన దండు రేణుకకు గతంలో గుడుంబా కేసులో తహసీల్దార్ ముందు బైండోవర్ అయి ఇటీవల మరల గుడుంబా తయారీ చేస్తూ పట్టుబడిన బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు తహసీల్దార్ పంపరి చంద్రశేఖర్ ఆదేశానుసారం రూ. 30 వేలు జరిమానా విధించడం జరిగిందన్నారు. మరల గుడుంబా తయారీ చేసినా, అమ్మినా తదుపరి పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

# జీడీసీలో ఒక రోజు శిక్షణ తరగతులు

**గోదావరి ఖని, ఆగస్ట్ 05(మనం న్యూస్):** సోహం అకాడమీ సౌజన్యంతో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఆవరణలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై ఒక రోజు క్యాంప్ నిర్వహించారు. గోదావరిఖని, పెద్దపల్లి, మంథని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా, ఎంఏ శుకూర్ మాట్లాడారు. విద్యార్థులు పుస్తకాలలో ఉన్న జ్ఞానాన్ని కాకుండా విశ్లేషణ, అన్వయ, సామర్థ్యాలను పరిపూర్ణంగా పెంపొందించుకోవాలన్నారు. రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలు, హార్వర్డ్ అంశాలు, ప్రాజెక్టు డిజైన్-నిర్మాణం తదితర అంశాలపై సోహం అకాడమీ శిక్షకుడు సంతోష్ పూర్తి స్థాయిలో శిక్షణ విద్యార్థులకు అందించారు. మొత్తం 100 మంది విద్యార్థులు (69 మంది బాలికలు, 31 మంది బాలురు) ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఆగస్టు 7న సోహం అకాడమీ పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో రోబోటిక్స్ వర్క్షాప్లను నిర్వహించనుందని, శిక్షణ పొందిన గోదావరిఖని, మంథని, పెద్దపల్లి కళాశాలల విద్యార్థులు తాము నేర్చుకున్న రొబోటిక్స్ పరిజ్ఞానాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బోధించనున్నారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై






కిషన్ ఓఝా, టీఎస్‌కే సి కో-ఆర్డినేటర్ డాక్టర్ జి సుబ్బారావు, టీఎస్‌కేసీ మెంటర్ పి.ఉషారాణి తెలిపారు.

# కాళేశ్వరంతోనే సాగునీరు.. కాంగ్రెస్‌వన్నీ వొట్టి మాటలె...

- స్థానిక సంస్థల్లో అన్నిస్థానాలు మావే..: బీఆర్ఎస్ నేతలు



**సిద్దిపేట, ఆగస్టు 05(మనం ప్రతినిధి):** తెలంగాణ జీవనాడి కాళేశ్వరం ప్రాజెక్టు అని, కాళేశ్వరం ఫలితంగానే నేడు రైతులకు సాగునీరు అందుతోందని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. రెండేళ్లుగా అధికారంలో ఉన్నా, కాంగ్రెస్ మాటలు చెప్పడం తప్పితే చే లతల్లో చేసి చూపింది శూన్యమని, డైవర్షన్ పొలిటిక్స్ తో ప్రజల అటెన్షన్ ను డైవర్ట్ చేయడం తప్పితే కాంగ్రెస్ కు మరేమీ చేతకాదన్నారు. మంగళవారం నాడు రాష్ట్ర మాజీమంత్రి హరీష్ రావు హైదరాబాద్ లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయగా సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని ముఖ్య నాయకులంతా టీవీలో వీక్షించారు. వీక్షించిన వారిలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి ప్రతాప రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మాజీ శాసన సభ్యులు ఒడితల సతీష్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రదాత కేసీఆర్, అన్నీ తానై కాళేశ్వరం నిర్మాణాన్ని భుజాన వేసుకున్న హరీష్ రావులను కాంగ్రెస్ బదనాం చేయాలని చూస్తుందే తప్ప ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నన్ని రోజులు రాష్ట్రం సుభిక్షంగా ఉందని, రెండేళ్లుగా కాంగ్రెస్ హయాంలో ప్రజలు అరిగోస పడుతున్నారన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు దూరదృష్టితో చేసిన పనుల మూలంగా బిఆర్ఎస్ హయాంలో అమాంతంగా పెరిగిన భూముల రేట్లు రేవంత్ పాలనా వైఫల్యం మూలంగా భూముల రేట్లు ఒక్కసారిగా తగ్గాయన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును గత ప్రభుత్వం 90 శాతం పూర్తి చేస్తే మిగిలిన 10 శాతం పనులను చేయడానికి కూడా ఈ సర్కారు ఇబ్బందులు పడుతుందన్నారు. మంత్రి చిత్తమ్ కుమార్ రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇప్పటికైనా వ్యవహారం మానుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రజలకు సేవ చేయాలి తప్పితే బిఆర్ఎస్ నేతలను తిట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడన్నారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ పథకాల అమలులో విఫలమైందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా అధికార పార్టీ గెలవకుండా సమిష్టిగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# ఆస్పిరేషన్ నుంచి ఇన్‌స్పిరేషన్ జిల్లాగా మారాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 05(మనం ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆస్పిరేషన్ జిల్లాగా కాకుండా దేశానికే ఆదర్శంగా నిలిచే ఇన్స్పిరేషన్ జిల్లాగా రూపాంతరం చెందాలనే లక్ష్యంతో ప్రతి శాఖ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సూచించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్ జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రణాళిక అధికారి (సిపిఓ) సంజీవరావు అధ్యక్షత వహించగా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సిపిఓ సంజీవరావు మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో వివిధ శాఖలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు విశేష కృషి చేస్తున్న కలెక్టర్ ను అధికారులు సన్మానించారు అనంతరం, కలెక్టర్ మాట్లాడుతూ..

## రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలపాలి

ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్‌గా గుర్తింపు పొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం మరియు నీతి అయోగ్ సంయుక్తంగా వెనుకబడిన జిల్లాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ద్వారా జిల్లాలో అనేక రంగాల్లో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని, ప్రతి ఉద్యోగి సమర్థంగా పనిచేయడంతోనే జిల్లా ఈ స్థాయికి చేరుకుందని కలెక్టర్ తెలిపారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అన్ని విభాగాల సమన్వయంతో కార్యాచరణ చేపడుతున్నామని, దీని ద్వారా జిల్లా దేశవ్యాప్తంగా ఆదర్శ జిల్లాగా నిలవనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకుడు గుంతలు తవ్వాలి అనే పిలుపుతో జిల్లాలో చేపట్టిన సామూహిక కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల నుండి ప్రారంభమై జిల్లావ్యాప్తంగా విస్తరించి, దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

జిల్లా వ్యాప్తంగా పిల్లలలో పోషకాహార లోపం, ఎనీమియా వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మునగాకు వంటివి ఆహారంలో చేర్చడం ద్వారా ఎనీమియా రాకుండా నియంత్రించవచ్చని వివరించారు. వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో జిల్లాలో అవసరమైన శిక్షణా తరగతులు నిర్వహించి ఆహారపు అలవాట్లను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## అంగన్వాడీలతో పటిష్ఠతకు కృషి

విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి స్మార్ట్ అంగన్వాడీలు, డిజిటల్ తరగతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ వంటివి ఉపయోగపడుతున్నాయని, సిడిపిఓ, సూపర్వైజర్లు మరియు అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. రేగళ్ల అంగన్వాడీ కేంద్రంలో గతంలో చీకటి, ఉక్క పోత వల్ల పిల్లలు రావడం తగ్గిపోయిందని, ఇప్పుడు విద్యుత్, ఫ్యాన్ వంటివి ఏర్పాటు చేయడం వల్ల పిల్లల హాజరు పెరిగిందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి అంగన్వాడీ కేంద్రం మరియు ప్రతి పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ఉన్నటువంటి సమస్యలు మరియు వాటి పరిష్కారాలను నివేదికల సమర్పించడం ద్వారా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని అన్నారు. దీని ద్వారా విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు.జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి శాఖలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో సమన్వయంగా ముందుకు సాగాలని, ప్రతి కార్యక్రమాన్ని లక్ష్య ప్రాతిపదికన అమలు చేయాలని సూచించారు. భవిష్యత్తులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరు దేశవ్యాప్తంగా ఆదర్శ అభివృద్ధి జిల్లాగా వినిపించేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆకాంక్షిత అభివృద్ధి లక్ష్యాల్లో విశేష కృషి చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి స్వర్ణలత లేనినా, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి ( రిటైర్డ్) మరియు ఉద్యోగులకు, సిబ్బందికి 133 మందికి మెడల్స్, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. వారి సేవలను గుర్తించి మెచ్చుకోవడం ద్వారా మరింత ఉత్సాహంతో సేవలందించేందుకు ప్రతి ఉద్యోగి ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమ మరియు ప్రణాళిక శాఖ తదితరులు శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షానికి కూలిన పేదోడి ఇల్లు

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాట సుధా
- ఆర్థిక సాయం అందజేసిన మహిళా కాంగ్రెస్ నేత



**రామచంద్రాపురం, ఆగస్టు 5(మనం న్యూస్):** సోమవారం కురిసిన భారీ వర్షానికి పాత రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన డప్పు సురేష్ నివసిస్తున్న ఇల్లు కూలిపోయింది. ఈ ఘటనలో ఆయన తల్లి, కూతురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ బాధితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయం అందించి మంచి మనసు చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇలాంటి కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం మన బాధ్యత అన్నారు. అదేవిదంగా ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా చూస్తామని, సంబంధిత అధికారులను కూడా అప్రమత్తం చేస్తామని కాట సుధా శ్రీనివాస్ గౌడ్ బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హబీబ్ జానీ తదితరులు పాల్గొన్నారు.

# బదనాం చేయడానికే బరాజ్లను ఎండబెడుతండ్రు

- కక్షకట్టి చుక్క నీళ్లు ఆగకుండా గేట్లు తెరిచి పెట్టిండ్లు
- కళ్ల ముందు నీళ్ళు వృథా పోతుంటే గుండె అవిసిపోతాంది
- పెద్దపల్లి జిల్లా బిడ్డలకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అవగాహన ఉండాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**రామగిరి, ఆగస్టు 5(మనం న్యూస్):** బీఆర్ఎస్ పార్టీని, మాజీ సీఎం కేసీఆర్ను బదనాం చేయడానికే బరాజ్లను బంద్పెట్టి ఎండబెడుతాండ్లని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని భీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మాజీ మంత్రి హరీష్ రావు కాళేశ్వరం ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ లతో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎనకట చెరువు మత్తడి తెగితే ఇసుక బస్తాలు వేసి నీళ్లు ఆపుకునేటోళ్లం కానీ మేడిగడ్డ బరాజ్లో రెండు పిల్లర్లు కుంగిపోతే తాత్కాలికంగా మరమ్మత్తులు చేసి నీళ్లు ఆపాల్సి ఉండగా కేవలం భీఆర్ఎస్ పార్టీ ని, కేసీఆర్ను సమాజంలో చులకన చేయాలనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయని, అర్థరహితమైన ఆరోపణలతో కాలం వెళ్లదీస్తూ ప్రజలను, రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు.

సోమవారం కన్నెపల్లి పంపుహౌజ్ సందర్శనలో అక్కడి వెళ్లిన తాము గోదావరినది నిండా నీళ్లు వృధాగా పోతుంటే గుండెలు పగిలి పోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్ని బరాజ్ల గేట్లు ఎత్తి వేశారని, కనీసం వర్షాలకు వచ్చే నీళ్లు కూడా ఆగకుండా గేట్లు ఎత్తి రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్, ముంబై నుంచి వచ్చిన ఇంజనీర్లు సైతం అన్నారం బరాజ్ను పరిశీలించి ఇక్కడ ఏమీ కాలేదని నిర్ధారించినా ప్రభుత్వం మాత్రం నీళ్లు ఆపడం లేదని, అన్నారం ప్రజలు కూడా ఇదంతా చెప్తున్నారని, సామాన్యులకు తెలిసిన విషయం కూడా పాలకులకు తెలియకపోవడం విడ్డూరమని అన్నారు. పెద్దపల్లి జిల్లా బిడ్డలు కాళేశ్వరం ప్రాజక్టుపై పూర్తి అవగాహన పెంచుకోవాల ని, అవసరమైతే బరాజ్లను సందర్శించి రావాలన్నారు. కక్ష్యకట్టి సమాజాన్ని ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రకృతి శిక్షిస్తుందని, ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఖతమైనట్లేనని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# విద్యా ప్రమాణాలు పెంచేందుకు పటిష్ట చర్యలు

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**8వ తరగతి చదివే ఆడపిల్లలకు సైకిల్స్ పంపిణీ**

**ఏదులాపురంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి 110 కోట్లు మంజూరు**

**ఏదులాపురం మున్సిపల్ ప్రాంతంలో పర్యటించిన మంత్రి**

**పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిల్ లను పంపిణీ**





ఖమ్మం, ఆగస్టు 5(మనం బ్యూరో): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంగళవారం ఏదులాపురం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మం రూరల్, ఏదులాపురం మునిసిపల్ పరిధిలో 1వ, 59వ, 60వ డివిజన్ లలో 8వ తరగతి చదివే ఆడ పిల్లలకు మంత్రి పొంగులేటి సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది పాలేరు నియోజక వర్గంలోని 8 నుంచి 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు సైకిల్స్ పంపిణీ చేశామని మంత్రి గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ సంవత్సరం 8వ తరగతి వచ్చిన బాలికలకు, ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లో కొత్తగా చేరిన బాలికలకు సైకిల్స్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. నేడు ఏదులాపురం మున్సిపాలిటీలో, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 3 డివిజన్ కలుపుకుని 191 సైకిల్స్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. డ్రాప్ ఔట్ తగ్గాలని, బాలికల విద్య ప్రోత్సహించాలని వ్యక్తిగతంగా ట్రస్ట్ నుంచి అందిస్తున్నామని అన్నారు. పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు కొవ్వొత్తుల కరిగి పోతూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మనల్ని చదివిస్తున్న అమ్మా, నాన్నలను గుర్తు చేసుకుంటూ మనం పెట్టుకున్న లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు కృషి చేయాలని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని అన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. గతంలో గురుకులాల్లో పిల్లలకు సరైన ఆహారం పెట్టలేదని అన్నారు. ఎన్నికల సమయంలో హామి ఇవ్వకపోయినా గురుకులాల దుస్థితి చూసి 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జిలను పెంచామని అన్నారు. విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను బయటకు తీసి జీవనోపాధి కల్పించేలా స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసామని తెలిపారు. పాలేరు నియోజక వర్గంలో 46 కోట్లతో ఐటిఐ మంజూరు చేయడం జరిగిందని, త్వరలో తిరుమలాయ పాలెం లో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఏదులాపురంలో గత ప్రభుత్వం పేరుకు జేఎన్టియూ కళాశాల మంజూరు చేస్తే మన ప్రభుత్వం రాగానే మొదటి విడత 110 కోట్లు మంజూరు చేసామని, త్వరలో ఈ పనులు పూర్తి చేస్తామని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 200 కోట్లతో 3 వేలకు పైగా పిల్లలు చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు చేసుకున్నామని అన్నారు.గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన విద్యా రంగాన్ని బలోపేతం చేస్తూ, నూతనంగా మెగా డి.ఎస్సీ ద్వారా 11 వేల ఉపాధ్యాయులను ఇందిరమ్మ ప్రభుత్వం నియమించిందని, అంతేకాకుండా 30 వేలమంది టీచర్ల పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా పూర్తి చేసామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నేడు 191 సైకిల్స్ మంత్రి చేతుల మీదుగా అందుకుంటున్న విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత అందిస్తుందని అన్నారు. మన ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ల్యాబ్ లను అన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ప్రఖ్యాత కంపెనీలతో టై అప్ చేసుకొని ల్యాబ్స్ ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. మధ్యాహ్నం భోజనం నాణ్యత ఉండే విధంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం వండే సమయంలో పొగ రాకుండా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా వంట జరిగేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. జూన్ 12న పాఠ్యాంశాలు వరకు బుక్స్ సంబంధించిన పుస్తకాలు పూర్తి స్థాయిలో అందించామని అన్నారు. ప్రైవేట్ కు దీటుగా మెరుగైన విద్య ప్రభుత్వ పాఠశాలలో అందే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. పిల్లలు బాగా చదువుకుని పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ విద్యాధికారి నాగ పద్మజ, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, ఎంఇఓ శ్రీనివాసరావు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు డబల్ బెడ్రూమ్ ఇండ్లను అందిస్తాం

- **కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **ఇండ్ల నిర్మాణంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**



ఖమ్మం, ఆగస్టు 5(మనం బ్యూరో): ఖమ్మం జిల్లాలో పెండింగ్ ఉన్న 1132 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని తన చాంబర్ లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంపై సంబంధిత అధికారులతో మంగళవారం చర్చించి పలు సూచనలు చేశారు. ఖమ్మం జిల్లాలో 7229 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు కాగా 6107 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయ్యాయని, 655 ఇండ్లు పురోగతిలో ఉన్నాయని, 467 ఇండ్ల నిర్మాణం ప్రారంభించలేదని అధికారులు కలెక్టర్ కు నివేదిక అందించారు. ఈ సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రారంభం కాని 467 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మినహాయిస్తే ఖమ్మం జిల్లాలో 6762 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఉంటాయని, వీటిలో 5630 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పటికే పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేశామని, మిగిలిన 1132 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు పంపిణీ చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 260 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, 217 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయి మౌళిక వసతుల కల్పన పెండింగ్ ఉన్నాయని, 655 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం వివిధ దశలలో ఉన్నాయని అన్నారు. రెవెన్యూ శాఖ పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. 217 ఇండ్ల వద్ద పెండింగ్ ఉన్న ఇన్ ఫ్రా పనులు యుద్ధ ప్రాతిపదికన ఆగస్టు నెలాఖరు వరకు పూర్తయ్యేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయింపు జరగాలన్నారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న 655 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఇండిపెండెంట్ గా ఉన్న 383 ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల నమూనాలో లబ్దిదారులే నిర్మించుకునేలా చూడాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రస్తుత స్థితిగతుల ఆధారంగా లబ్ధిదారుడికి ప్రభుత్వ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.జి+1, జి+2 మోడల్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు ప్రత్యేకంగా ప్రభుత్వం మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ట్రైబల్ వెల్ఫేర్, ఎన్.పి.డి.సి.ఎల్., పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అనుకున్నది సాధించే వరకు చదవాలి

**పీఎంహెచ్ హాస్టల్‌ను సందర్శించిన ఐటిడిఏ పిఓ**



ఖమ్మం,ఆగస్టు 5(మనం న్యూస్): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న పీఎంహెచ్ హాస్టల్ లో చదువుతున్న విద్యార్థులు చదువుతోపాటు భవిష్యత్తులో స్థిరపడటానికి ఒక గోల్ ఏర్పాటు చేసుకొని అనుకున్నది సాధించే వరకు పోరాడుతూనే ఉండాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం ఖమ్మం పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ పిఎంహెచ్ వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టానుసారంగా బయట తిరగకుండా దృష్టి ఎప్పుడూ చదువుపై పెట్టాలని, తీరిక సమయంలో లైబ్రరీలో ఉన్న పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి మనసులో ఏదో ఒక కోరిక ఉంటుందని జిల్లా కలెక్టర్గా, డాక్టర్ గా, ఉపాధ్యాయుడిగా ఏదో ఒక రంగంలో స్థిరపడి ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం ఉంటుందని అందుకు ఇప్పటినుండే దానికి సంబంధించిన శిక్షణలు తీసుకొని అనుకున్నది సాధించాలని అన్నారు. ఈ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. విద్యార్థుల కోరిక మేరకు ఉన్నత ఉద్యోగాల కోసం ప్రేరణ పొందడానికి కోచింగ్ సెంటర్, లైబ్రరీలో విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు సమకూరుస్తామని అన్నారు. అనంతరం గిరిజన భవనం సందర్శించి ప్రస్తుతం ఉన్న నిధులతో గిరిజన భవనంలో టాయిలెట్, బాత్రూమ్స్, మంచినీటి సౌకర్యం ఏవైనా శుభకార్యాలు చేసుకోవడానికి అనువుగా ఉండేలా సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం ఖమ్మం పట్టణంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలు నెలకొల్పిన మహిళా మార్ట్ సందర్శించి మహిళా మార్ట్ లో అమ్మకాలు జరుపుతున్న వస్తువుల వివరాలు, గ్రూప్ మహిళలకు ఆదాయ మార్గాలు ఏ విధంగా వస్తున్నవి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఖమ్మం డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని విజయలక్ష్మి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నారాయణరెడ్డి, వైరా ఏటీడీవో భారతీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఖతీజాబేగంపై చర్యలు తీసుకోవాలి

**సంస్థకు ఎన్నికలు నిర్వహించాలి**

**ది గాడ్ థెరిస్సా మహిళా మండలి సభ్యురాలు నాగరాణి, ఉమ**



ఖమ్మం, ఆగస్టు 5(మనం న్యూస్) : ఎగ్జిక్యూటీవ్ కమిటీకి సంబంధం లేని వ్యక్తిని సంస్థ ట్రెజరర్‌గా నియమించి ఖాతాను ఓపెన్ చేసి ఐదేళ్లుగా మోసం చేస్తున్న ది గాడ్ థెరిస్సా మహిళా మండలి అధ్యక్షురాలు ప్రెసిడెంట్ ఖతీజాబేగంపై చర్యలు తీసుకోవాలని మహిళా మండలి సభ్యురాలు నాగరాణి, ఉమ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సంస్థలో జరుగుతున్న మోసాలపై తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి, జిల్లాలోని డిఏపిసియుకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఈ కేసును ఇల్లందు సిఐకి బదిలీ చేశారని తెలిపారు. కేసు దర్యాప్తు జరుగుతున్న సమయంలో ఇప్పుడు సంస్థకు ఎన్నికలు నిర్వహిస్తామంటూ కార్యవర్గ సభ్యులకు తెలియకుండా ప్రెసిడెంట్ ఏకపక్ష నిర్ణయంతో ఎన్నికల నోటీసులను జారీ చేశారని పేర్కొన్నారు. సంస్థలో జరుగుతున్న అన్యాయాలు, ఆర్థిక లావాదేవీలకు మణుగూరు ప్రాజెక్టు మేనేజర్ సాగర్ రెడ్డి, ఖమ్మం డిపిఎం సత్యకుమార్ అండదండలున్నట్లు ఆరోపించారు. ఫోర్జరీ సంతకం చేశానని తప్పును అంగీకరించి లెటర్ రాసి ఇచ్చి ఖతీజాబేగం ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హురాలని తెలిపారు. వెంటనే ఆమెపైనా, ఆమెకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో సంస్థ సభ్యులు పద్మ, రాణి, రమ, లక్ష్మీ , సంజన తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం సబబు కాదు

- **సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడాన్ని ఖండిస్తున్నాం**
- **గిరిజన తెగల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టొద్దు**



ఖమ్మం, ఆగస్టు 5 (మనం న్యూస్): ఎస్‌టి జాబితా నుండి లంబాడీలను తొలగించాలని భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావ్, ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపురావుతో పాటు మరికొంతమంది కలిసి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాన్ని ఖండిస్తున్నామని బంజారా అడ్వకేట్ జెఏసి నాయకులు హరినాయక్ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మరోసారి గిరిజన తెగల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి వైరాన్ని పెంచే విధంగా పాలకులు చేస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన భద్రాచలం ఎంఎల్‌ఏపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని మంత్రులకు, ముఖ్యమంత్రికి, రాజకీయ గురువు అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలియకుండా తెల్లం వెంకట్రావ్ పిటిషన్ వేయగలడా అని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం స్పందించి వెంకట్రావ్ మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రావడానికి బంజారాల మద్దతు తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత వారిని విస్మరిస్తోందన్నారు. బంజారాలకు మంత్రి పదవి ఇవ్వకుండా నామమాత్రపు పదవులిచ్చి అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. లగచర్ల ఘటనను మనసులో పెట్టుకుని రేవంత్‌రెడ్డి కావాలనే లంబాడీలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. వెంటనే తెల్లం వెంకట్రావ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బంజారా సీనియర్ నాయకులు బాణోత్ కిషన్ నాయక్, అడ్వకేట్ జెఏసి నాయకులు ధరావత్ వీరన్న నాయక్, ధరావత్ ప్రసాద్ నాయక్, జర్పుల బాలకృష్ణ నాయక్, బాణోత్ శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ భూములను పరిరక్షించాలి: నజ్నీన్



ఖమ్మం, ఆగస్టు 5(మనం న్యూస్): ఖమ్మంలోని వెలుగుమట్ల శివారు గొల్లగూడెం గ్రామ పరిధిలో ఈద్గా, ఖబరస్తాన్‌తో పాటు వీటిపక్కనున్న సర్వే నెంబర్ 431, 432, 425 సర్వే నెంబర్లలోని సుమారు 350 కోట్ల విలువ చేసే వక్ఫ్ భూమిని కొంతమంది ప్రయివేట్ భూమిగా చూపిస్తూ జిల్లా అధికారుల అండతో కాజేస్తున్నారని ఖమ్మం జిల్లా వక్ఫ్ భూముల పరిరక్షణ కొరకు ముస్లిం మహిళల అడహక్ కమిటీ కార్యదర్శి నజ్నీన్, కోశాధికారి నస్రీన్ ఆరోపించారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్తాఫానగర్‌లో సర్వే నెంబర్ 481, 482, 483, 484, 485లలో సుమారు 15 ఎకరాల 24 కుంటల భూమి ఉందని, వీటికి సంబంధించిన ముతవల్లీలు, వారి వంశీకులు కలిసి అక్రమంగా అమ్ముకున్నారని తెలిపారు. అలాగే వెలుగుమట్ల రెవెన్యూ గొల్లగూడెం పరిధిలో మొత్తం 72.29 కుంటల భూమి ఉందని తెలిపారు. ఈ భూములలో ముస్లింల ప్రార్థనా స్థలం, ఖబరస్తాన్ ఉఆన్నయని, వీటికి ఎలాంటి నష్టం జరిగినా ముస్లింల మనోభావాలు దెబ్బతింటాయని తెలిపారు.వక్ఫ్ ఇన్స్‌పెక్టర్ కనుసైగలతో సర్వే నెంబర్ 425లో ఓ బిల్డర్ భవనాన్ని నిర్మించారని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌కు, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు ఆధారాలు సమర్పించామని తెలిపారు. వెంటనే ఈ భూమిని ఆక్రమణ దారుల నుండి కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో నసీమా ఆర్సి, తరుణం ఫాతిమా, రఫియా, జరీనా, అనీఫా, ఆఫ్రిన్, మెహ్రాజ్, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు క్యాష్ రివార్డు



ఖమ్మం, ఆగస్టు 5(మనం న్యూస్): ఉత్సాహంతో పనిచేసే పోలీస్ సిబ్బందిని మరింత ప్రోత్సహిస్తామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఇటీవల జిల్లాలో గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో కష్టపడి పనిచేసిన టాస్క్ ఫోర్స్ పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఎస్ కె. ఖాసీంఅలీ, కానిస్టేబుల్ వి.గోపి, యం.సతీష్ లను పోలీస్ కమిషనర్ అభినందించి, క్యాష్ రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... 33 గంజాయి కేసుల్లో 120 మంది నిందుతులను అరెస్ట్ చేయడంలో,192 కేజీల గంజాయి పట్టుకోవడంలో ఈ సిబ్బంది కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఇదే స్పూర్తితో ప్రతి ఒక్కరూ.. సమాజ రక్షణ కోసం అంకితభావంతో భాద్యతలు నిర్వహిస్తూ మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్ ఉదయ్ కుమార్, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు

# రైతులకు వరప్రదాయని 'కాళేశ్వరం'

- **పినాకీ ఘోష్ రిపోర్ట్ ముమ్మాటికీ కాంగ్రెస్ కమిషన్ రిపోర్టే**
- **డైవర్షన్ పాలిటిక్స్ తో టైంపాస్ చేస్తున్నప్రభుత్వం**
- **రెండేళ్ళలో రెండులక్షల కోట్ల అప్పులు చేసిన కాంగ్రెస్**
- **మళ్ళీ వచ్చేది, ప్రజలు కోరుకునేది బీ ఆర్ ఎస్సే**
- **బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు**



కొత్తగూడెం, ఆగష్టు 4(మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర రైతులకు వరప్రదాయని' కాళేశ్వరం ' ప్రాజెక్టు అని, కరువు కాటకాలతో అల్లాడిన రాష్ట్ర ప్రజానీకానికి ముందుచూపుతో, మాజీ సీఎం కేసీఆర్ దార్శనికతతో నిర్మించుకున్న ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల, ప్రజల ఉసురుపోసుకుంటుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్ లోని బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి హరీష్ రావు ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రత్యక్షప్రసారం చేయగా.. ఈ కార్యాక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు హాజరై సావధానంగా విన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రేగా కాంతారావు మాట్లాడుతూ... కాళేశ్వరంపై వేసిన పినాకీ ఘోష్ కమిషన్ పూర్తిగా కాంగ్రెస్ కమిషన్ గా పనిచేసిందని, అది పూర్తిగా కాంగ్రెస్ పార్టీ కమిషన్ రిపోర్టు మాత్రమేనని ఎద్దేవా చేశారు. కరువు, కాటకాలతో అల్లాడిన తెలంగాణ రాష్ట్రాన్ని సుభిక్షంగా చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బతుకుదెరువు కోసం వలస పోయిన తెలంగాణ ప్రజలు రాష్ట్రం ఏర్పడ్డాక తిరిగి వచ్చి వ్యవసాయం చేసుకొని గౌరవంగా బ్రతుకుతున్నారని, అదే విధంగా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది వచ్చి ఇక్కడ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రాష్ట్రాన్ని నవ్వులపాలు చేయాలనుకొని కుట్రలకు తెరలేపిందని కానీ వాళ్ళు చేస్తున్న పనుల వల్లే ప్రజల ముందు నవ్వులపాలవుతున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడటం కాంగ్రెస్ కు ఇష్టం లేదని, అందుకే అధికారంలోకి వచ్చిన సుమారు రెండేళ్ళలో రెండులక్షల కోట్ల అప్పులు చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, ఇచ్చిన ఏ హామీని కూడా సక్రమంగా అమలు చేయక కప్పదాటు వైఖరిని అవలంభిస్తోందని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రాన్ని ఎడారిగా మార్చాలనుకుంటుందని, డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని అబద్దాలు చెబుతూ పబ్బం గడుపుకుటుందన్నారు.

ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంతో విసుగుచెందారని, రెండేళ్ళు కూడా కాకుండానే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, అసహనం పెరిగిపోయాయని, మళ్ళీ అందరి చూపు కేసీఆర్ పైనే పడిందని, అందుకే ఎక్కడ సమావేశం పెట్టినా కేసీఆర్ ను తలుచుకుంటున్నారని, ఈ బాధలు పడలేకపోతున్నామని బహిరంగంగానే చెబుతున్నారని వివరించారు. మూడేళ్ళ తర్వాత వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని, అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన రెండుపిల్లర్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, భద్రాచలం పార్టీ ఇన్చార్జ్ మానె రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంతపురి రాజుగౌడ్, కొట్టి వెంకటేశ్వర్లు, టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు సంకుబాపన అనుదీప్, సిలివేరు సత్యనారాయణ, జయరాం, కాంపెల్లి కనకేష్, సింధు తపస్విని, పోతురాజు రవి, వి. పూజిత, భూపతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌కో ఏఈ సస్పెండ్

ఖమ్మం, ఆగస్టు 05(మనం న్యూస్): ఖమ్మం సర్కిల్ లోని తిరుమలాయపాలెంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్. భాస్కరరావు, ఏ. ఎల్.ఎం.యు. జగత్ జీవన్ అవినీతికి పాల్పడడంతో సస్పెండ్ చేసినట్లు టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం తెలిపింది. చింతల్ తండా రైతులు కొత్త వ్యవసాయ సర్వీసుకు దరఖాస్తు చేసుకోగా, మంజూరు చేసే విషయంలో లక్ష రూపాయలు డిమాండ్ చేసి రూపాయలు 90,000 తీసుకున్నట్లు విజిలెన్స్ ఎంక్వయిరీ లో వెల్లడైందని పేర్కొన్నారు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించే విషయంలో ఎటువంటి అవినీతి ఆరోపణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు ఉంటాయని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం తెలిపింది. అర్. భాస్కర్ రావు, యు. జగత్ జీవన్ పై డిపార్ట్మెంటల్ ఎంక్వయిరీ చేపడుతున్నామని స్పష్టం చేసింది. ఎవరైనా అవినీతికి పాల్పడితే ఫోన్ నెంబర్ 9281033233 లో సంప్రదించాలని తెలిపింది.

## నుల్లి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 05(మనం న్యూస్): జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వాహణ పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ, వివిధ అన్ని విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు, జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఆగష్టు 11 నాడు అల్బెండజోల్ మాత్రలు అందచేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఏ.ఎన్.ఎం.లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, వర్కర్ల ద్వారా ఆగష్టు 11 రోజున స్కూల్, కాలేజీ, ఇంటింటికి వెళ్లి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలను వంద శాతం వేయాలని, ఒక వేళ ఈ రోజున మిస్ అయిన పిల్లలకు ఆగష్టు 18 నాడు మాప్ అప్ డే నాడు తప్పక అందించాలని అన్నారు.

ఈ కార్యక్రమాన్ని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరి చొప్పున అంగన్వాడీ సూపర్వైజర్లు, సి.డి.పి.వో. లు, మెప్మా సిబ్బంది పర్యవేక్షణాధికారులుగా విధులు నిర్వహించాలని, అవగాహన ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు సిబ్బంది అందరూ భాగస్వామ్యులు కావాలని, ఈ మాత్రల వలన సైడ్ ఎఫ్ఫెక్టులు ఏమి ఉండవువని ప్రజల్లో,తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి రజిత మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో అల్బెండజోల్ మాత్రలను 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి వేయాలని, గ్రామాల్లో పట్టణంలో ముందుగా చాటింపు చేయాలని సూచించారు. 1 నుండి 2 సంవత్సరాల లోపు పిల్లలందరికి సగము మాత్రను పొడి చేసి నీటితో కలిపి ఇవ్వాలని అన్నారు. 2 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఒక మాత్ర చొప్పున వేసి పూర్తిగా నమలమని చెప్పాలని, మాత్రలను ఇచ్చే సమయంలో త్రాగు నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశం లో డి.ఎం.హెచ్.ఓ. డా. రజిత, వేములవాడ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. పెంచాలయ్య, జిల్లా విద్యా శాఖ అధికారి వినోద్ కుమార్ డి.డబ్ల్యూ.ఓ, లక్ష్మి రాజం, డిపిఆర్ఓ, వి.శ్రీధర్, డి.పి.ఓ షరీఫ్దీన్ మున్సిపల్ కమిషనర్లు ,ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆయిల్ ఫామ్ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- భూత్పూర్ మండలం తాటికొండ గ్రామంలో ఆయిల్ ఫాం తోటల సందర్శన



మహబూబ్ నగర్ 05ఆగస్టు, (మనం బ్యూరో): రైతులు ఆయిల్ ఫామ్ సాగుకు ప్రాధాన్యత ఇస్తూ ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం భూత్పూర్ మండలం తాటికొండ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆయిల్ ఫాం తోటలను సందర్శించారు.గ్రామంలో 4.5 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుచేస్తున్న మహిళా రైతు అర్.మంజుల తోటలో గెలలు కోతకు వచ్చిన సందర్భంగా కత్తిరింపులు ద్వారా వస్తున్న దిగుబడి పరిశీలించారు. ఇప్పటి వరకు 29 మెట్రిక్ టన్నుల తాజా ఆయిల్ ఫాం గెలలను కోసి కంపెనీకి విక్రయించినట్లు,తద్వారా 4 లక్షల 32 వేల ఆదాయం లభించిందని కలెక్టర్ కు రైతు తెలిపారు.ఫ్రీ యూనిట్ కంపెనీ వారు ఈ గెల లను ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం కొనుగోలు చేసి రైతులకు పేమెంట్ చేస్తారు.అక్కడే సందర్శనకు వచ్చిన హస్నాపూర్ గ్రామానికి సంబంధించిన ముగ్గురు , లేత ఆయిల్ పామ్ తోటల కలిగిన రైతులతో సాగు వివరముల గురించి కలెక్టర్ చర్చించారు. శేఖర్ రెడ్డి, నరసింహ రెడ్డి , చంద్ర శేఖర్ రెడ్డి ముగ్గురు రైతులతో కలెక్టర్ ఆయిల్ ఫాం సాగు పై చర్చించారు.ఇదే గ్రామంలోని ఆయిల్ ఫాం సాగు మూడో సంవత్సరం సాగు చేస్తున్న ఎగ్గని నరసింహులు 25 ఎకరాలు ఆయిల్ ఫామ్ చేస్తున్న రైతు తోటను, కొత్త ములగర గ్రామంలో 2.25 ఎకరాలు ఆయిల్ ఫాం సాగు చేస్తున్న చింతకాయల రాములు తోటను సందర్శించారు. తోటలో మొక్కల మధ్య మొదటి 4 సంవత్సరాలు అంతర పంటల సాగు, మెయింటెనెన్స్ నిధుల విడుదల, యంత్ర పరికరాల అవసరము, డ్రిప్ ఇరిగేషన్ లో తోడ్పాటు, ఫారం పాండ్ ల వాడకం, కలెక్షన్ సెంటర్ ల ఏర్పాటు గురించి రైతులను వివరంగా అడిగి తెలుసు కున్నారు. ఆయిల్ పామ్ తోటలు నాటుటకు ప్రోత్సాహంగా, ప్రభుత్వం నుండి ఎకరాకు 50 వేల రూపాయలు మొదటి నాలుగు సంవత్సరంలో మొక్కలపై ఖరీదు, మొక్కల ఖరీదు పై మరియు డ్రిప్ ఇరిగేషన్ సిస్టం కొరకు సబ్సిడీ అందించబడుతుందని కలెక్టర్ తెలిపారుమొక్కలకై 11 వేల రూపాయలు, డ్రిప్పు కొరకై 21 వేల రూపాయలు, మెయింటెనెన్స్ కొరకై 16,800 రూపాయలు ఒక ఎకరాకు సబ్సిడీ ప్రభుత్వ తరఫున రైతులకు అందించడం జరుగుతుంధని, రైతులు ప్రభుత్వ రాయితీ సద్వినియోగం చేసుకుని లాభదాయక ఆయిల్ ఫాం సాగు చేయాలని కోరారు.మహబూబ్ నగర్ జిల్లాలో,4298 ఎకరాల విస్తీర్ణం లో ఆయిల్ పాం తోటలు సాగు చేసి నట్లు తెలిపారు ఇట్టి తోటల్లో 39 రైతులకు చెందిన 255 ఎకరాల నుండి, 500 మెట్రిక్ టన్నుల ఆయిల్ పామ్ తాజా గెల ల ఉత్పత్తి జరిగిందని ఉద్యాన శాఖ అధికారి వేణు గోపాల్ వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి శ్రీ వేణుగోపాల్, ఉద్యాన అధికారులు అనిల్ కుమార్, స్వప్న ఫ్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆయిల్ ఫామ్ కంపెనీ తరఫున జోనల్ మేనేజర్ రాకేష్, జిల్లా ఏరియా మేనేజర్ బాలరాజ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- యూఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకుడు కె.జంగయ్య
- కలెక్టరేట్ ముందు ఉద్యోగ, ఉపాధ్యాయుల ధర్నా



నాగర్ కర్నూల్, ఆగష్టు 05(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుఎస్పిసి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకుడు కే.జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నిర్వహించిన ధర్నాలో కే.జంగయ్య పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా విషయాలను పెంపొందించడంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే ఒకరు విద్య, మరొకరు పాఠశాల నిర్వహణ బాధ్యతల్ని చూసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీని వల్ల విద్యార్థులకు విద్యాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఉన్నత పాఠశాలలో చాలా పాఠశాలల్లో ఇప్పటికీ సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయుల కొరత ఉందని, వారిని భర్తీ చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల ఆన్లైన్ పనులు చేయడానికి సరిపోతుందన్నారు. పాఠశాలలో స్కావెంజర్లు, స్వీపర్లను వాచ్మెన్లను నియమించాలని కోరారు. చాలా పాఠశాలల్లో బాల బాలికలకు సరిపడ మరుగుదొడ్లు లేవని, వాటిని తక్షణమే నిర్మిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకి పెండింగ్లో ఉన్న డిఎలను వెంటనే ప్రకటించాలని కోరారు. రిటైరైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు వచ్చే బెనిఫిట్లను, జిపిఎఫ్ అమౌంట్లను, టిఎస్జిఎల్ఐ అమౌంట్ ను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు, ఉద్యోగస్తులకు మధ్య దూరాన్ని పెంచడానికి ప్రయత్నిస్తున్నదన్నారు. ఈ సమస్యల్ని పరిష్కరించకుంటే ఈనెల 23వ తేదీన హైదరాబాద్లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవో చంద్రశేఖర్ కు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూఎస్పిసి స్టీరింగ్ కమిటీ నాయకులు రామస్వామి, రామావత్ కృష్ణ, గోవర్ధన్, వెంకట్, కోర్ర శంకర్, చిన్నయ్య, యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు వహీద్ ఖాన్, రాములు, సి.తిరుపతయ్య, బాలరాజు, బాబు రావు, లలితా బాయ్, మోతిరాం, కురుమయ్య, చంద్రశేఖర్, రాజీ బాయి, సువర్ణ, సరోజినీ, సలీం, గౌస్, మల్లయ్య, జంగయ్య, లింగమయ్య, రవి, ఘన్సిరామ్, కోటేశ్ పాల్గొన్నారు.




## శ్రీ చైతన్యపై చీటింగ్ కేసులు నమోదు చేయాలి

- జగిత్యాలలో అనుమతులు ఇస్తే ఉద్యమిస్తాం

జగిత్యాల ఆగష్టు 05 ( మనం ప్రతినిధి): స్థానిక జగిత్యాల జిల్లాలో ఏఐఎస్ఎఫ్ నేతల ఫిర్యాదు నేపథ్యంలో ఎంఇఓ చంద్ర కళ పాఠశాల సీజ్ చేయించడం యావత్ విద్యార్థుల తల్లితండ్రులు కనువిప్పు కలిగిస్తుందని అట్లాగే శ్రీ చైతన్య యాజమాన్యానికి చెంప పెట్టు అని భవిష్యత్ లో పేద విద్యార్థుల తల్లిదండ్రులను మోసపోకుండా ఎలాంటి అనుమతులు ఇవ్వదు ఎందుకనగా విద్యార్థులకు సరిపడ గదులు గ్రౌండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేదు లిఫ్ట్ పని చేయడం లేదు ఆటస్థలం లేదు పక్కనే మజీద్ కూడా ఉంది ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయి బరువెక్కిన బ్యాగులతో₹ విద్యార్థులు 4 ఫ్లోరులు పైకి ఎక్కాలంటే ఎలా తల్లితండ్రుల కమిటీలు ఉండాలన్న నిబంధన ఉన్నపటికీ ఇవేవీ పట్టించుకోకుండా బేషరతుగా ఎటువంటి అనుమతులు లేకుండా 1 సంవత్సరం నుండి నడిచి పేద విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ వస్తున్నారనీ తక్షణమే స్పందించి చీటింగ్ కేసులు నమోదు చేయాలి అని జిల్లా విద్యశాఖ అధికారీ కె రాము కి ఫిర్యాదు చేశారు. తమరు అనుమతులు అందిస్తే మేము మిగతా విద్యార్థి సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు భరత్ రామచంద్ర సంజయ్ ప్రేమ్ కుమార్ అసిఫ్ నరేష్ పార్థు పాల్గొన్నారు

# ప్రజలు ఊరుకోరు..

## కాళేశ్వరంపై తప్పుడు ప్రచారాలు చేయొద్దు

## కేసీఆర్ ముందు చూపుతో తెలంగాణ సస్యశామలం

## నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి



నాగర్ కర్నూల్, ఆగష్టు 05 (మనం ప్రతినిధి) :కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు ఊరుకోరని నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి అన్నారు. హైదరాబాదు నుంచి మాజీ మంత్రి హరీష్ రావు కాళేశ్వరంపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ను జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బిగ్ స్క్రీన్ పై ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను జిల్లాలోని పార్టీ కార్యకర్తలతో కలిసి జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి తిలకించారు. అనంతరం మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి నదిపై అడ్డగోలుగా ప్రాజెక్టులు కట్టి తెలంగాణాకు నీళ్లు రానీయని పరిస్థితులు ఉన్నపుడు కేసీఆర్ ముందు చూపుతో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి తెస్తే తెలంగాణా సస్యాశ్యామలమయ్యిందన్నారు. అలాంటి ఈ కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. గాలి మోటార్లు ఎక్కి తిరగడానికి, గాలి ముచ్చట్లు చెప్పడానికే రేవంత్ రెడ్డి రెండేండ్ల పాలన సరిపోయిందని విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా చేసుకుని అబద్దపు మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పాలన పక్కకు పెట్టి రాజకీయ కక్ష్య సాధింపులే లక్ష్యంగా పని చేస్తున్నదన్నారు. పోలవరం 3 సార్లు కూలితే ఒక్కసారి కూడా ఎన్ఎస్డీఏ రిపోర్ట్ లేదనీ, ఇంత పెద్ద కాళేశ్వరంలో ఒక్క మేడి గడ్డ బ్యారేజిలో 2 పిల్లర్లు కుంగితే, రిపేర్ చేసే అవకాశం ఉన్నా, స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది కోసం రాద్దాంతం చేస్తున్నారన్నారు. రేవంత్ పాలనంతా ఒక టీవీ సీరియల్ లా నడుస్తోందని ఎద్దేవా చేశారు. మొన్నటి వరకు ఫార్ములా 1 కేసు అన్నారని, నిన్న ఫోన్ ట్యాపింగ్, అందులో ఏం చేయలేకపోయే సరికి నేడు కాళేశ్వరం మీద పడ్డరన్నారు. తమ్మిడి హెట్టి నుంచి మేడి గడ్డకు ఎందుకు మార్చారోనన్నది హరీష్ రావు చాలా చక్కగా వివరించారని తెలిపారు. ఈ పోగ్రామ్ ముఖ్య ఉద్దేశ్యం కాళేశ్వరంపై ఈ కాంగ్రెస్ పన్నుతున్న కుట్రలను, వాస్తావాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళుటమేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## నిర్వాసిత కుటుంబాలకు పాట్ల పనులను వేగవంతం చేయాలి

- అధికారులను ఆదేశించించిన జిల్లా కలెక్టర్



మహబూబ్ నగర్, 05 ఆగస్టు, (మనం బ్యూరో): ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించే ప్లాట్ల పనులను వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టి తండా, చిన్నగుట్ట తండా, శామగడ్డ తండా, ఒంటిగుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రం లో ఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం, వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ భవనం, పార్కులను, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, ఓవర్ హెడ్ ట్యాంక్, మిషన్ భగీరథ పైపులు వంటి మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తయ్యేలా పనులను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు కేటాయించే స్థలాలను అన్ని రకాల పనులను వేగవంతంగా పూర్తి చేసి వారికి కేటాయించాలని కలెక్టర్ అన్నారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ఎ. నరసింహ్ రెడ్డి, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వే లాండ్ రికార్డు, పంచాయతీరాజ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ఉద్యోగుల న్యాయమైన హక్కులపై విస్తృతంగా చర్చ




మంచిర్యాల, ఆగష్టు 5(మనం న్యూస్): శ్రీరాంపూర్ బ్రాంచ్ సింగరేణి కాలరీస్ ఈసీ అండ్ ఓబీసీ సమావేశాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు ముస్కె సమ్మయ్య , పేరం రమేష్ లు హాజరయ్యారు. బీసీ ఉద్యోగులకు రావలసిన న్యాయమైన హక్కులపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో, యాక్టింగ్ బేస్డ్ ప్రమోషన్లలో బీసీ ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయం గురించి వివరంగా చర్చించి, వారికి రావలసిన న్యాయమైన ప్రమోషన్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, ఉద్యోగుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లో బ్యాక్లాగ్ పోస్టులను మళ్లీ రీ-నోటిఫికేషన్ చేసి బీసీలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. పూలే విగ్రహాన్ని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయము ఆవరణలో స్థాపించడం,సభ్యత్వ నమోదు, ప్రగతి స్టేడియం పేరును మహాత్మ జ్యోతిరావు పూలే గా నామకరణం చేయాలని తీర్మానించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని మైన్స్, విభాగాలలో బీసీ సంఘాన్ని బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా చర్చించారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శులు బారుపాటి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ట్రెజరర్ మల్లేష్, ఫిట్ సెక్రటరీలు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు, కన్వీనర్లు, కో-కన్వీనర్లు, మనోజ్, మదన్, రాజ్ కుమార్, అజయ్, శ్రీనివాస్, పవన్, వినోద్, బీసీ సోదరులు సత్యం, కందుల శంకరయ్య, సదయ్య, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల్లో తల్లిపాల వారోత్సవాలు



- ముర్రుపాల విశిష్టతపై అవగాహన
- ఐ సి డి ఎస్ సూపర్వైజర్ శైలజ

జగిత్యాల/ బీర్పూర్ ఆగష్టు 05 (మనం ప్రతినిధి): ప్రపంచ తల్లిపాల వారోత్సవంలో భాగంగా బీర్పూర్ మండలంలోని కోమన్పల్లి , రంగసాగర్ గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో మంగళవారం ఐ సి డి ఎస్ సూపర్వైజర్ శైలజ ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు, ఆశాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రు పాలు తాగించాలి. అవి ఒక టీకా లాగా పనిచేస్తాయని అన్నారు. ముర్రుపాలు కచ్చితంగా పిల్లలకు ఇవ్వాలని వాటిలోని ప్రాముఖ్యత రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని అది కచ్చితంగా ఆరు నెలలు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని వాటిలో నీటి శాతం పాలలో గల విశిష్టత గురించి తల్లులకు గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు. పోషక విలువలతో కూడిన అదనపు ఆహారం పిల్లలకు ఇవ్వాలి అని వివరించారు. డెలివరీ అయిన తల్లులకు పాలు పట్టే విధానము , తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ఆరు నెలలు దాటిన పిల్లలకు అన్నప్రాసనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ లక్ష్మీ ,వనిత , ఆశలూ, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రిజర్వేషన్‌పై ప్లేట్ ఫిరాయించిన కాంగ్రెస్

## బీసీల రిజర్వేషన్ల అంశంతో కాంగ్రెస్ కుటిల రాజకీయాలు చేస్తుంది

## కాంగ్రెస్ ఢిల్లీ బాట పట్టిన బీసీలు.. నమ్మే పరిస్థితి లేదు

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



కరీంనగర్, ఆగష్టు 5(మనంప్రతినిధి)ః అధికారం కోసం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలో వచ్చాక మాత్రం ప్లేట్ ఫిరాయించి బీసీలను మోసం చేసిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. ఇంటింటికి బిజెపి కార్యక్రమం పై బిజెపి ముఖ్య నేతలు , ప్రోగ్రాం ఇన్చార్జిలతో మంగళవారం కరీంనగర్ రేకుర్తిలోని శ్రీ మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ బిజెపి ప్రోగ్రాంలో విజయవంతంగా పూర్తిచేయాలని సూచించారు. మోడీ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను, పథకాలను , కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయడం అలవాటుగా మారిందన్నారు. అధికారం కోసం అడ్డగోలుగా , 420 హామీలు , 6 గ్యారంటీలతో ప్రజానీకాన్ని మోసం చేయడమే కాకుండా, డిక్లరేషన్ల పేరిట అన్ని వర్గాలను నిలువునా మోసం చేసిన ఘనత కాంగ్రెస్ కి దక్కిందన్నారు. ఔ కాంగ్రెస్ ఢిల్లీ బాట పట్టి రాజకీయ నాటకాలు మొదలుపెట్టిందని ఆయన ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకినిజంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే చిత్తశుద్ధి లేకనే ఆర్డినెన్స్ తెచ్చి రాజకీయ డ్రామాలు స్టార్ట్ చేసిందన్నారు. ముఖ్యంగా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే అంశంపై అసెంబ్లీలో కాంగ్రెస్ బిల్లుకు బిజెపి మద్దతు తెలిపింది. రాజ్యాంగ విరుద్ధమైన మత ప్రాతిపదికన రిజర్వేషన్ల కు వ్యతిరేకమని స్పష్టమైన అభిప్రాయాన్ని బిజెపి తెలియజేసిందని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టో లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని హామీ ఇచ్చారే తప్పా, కేంద్ర ప్రభుత్వం ఇస్తేనే రిజర్వేషన్లు ఇస్తామని చెప్పలేదన్నారు. 50 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా, 12 శాతం ఉన్న ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లను బీసీల్లో కలపడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి బీసీల పట్ల ఉన్న ప్రేమ ఏంటో స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పించండి. కేవలం 12 శాతం ఉన్న ముస్లింలను బీసీల్లో కలపకండి అని బిజెపి నిలదీస్తే, బిజెపి అడ్డుపడుతుందని అబాండాలు వేస్తూ కాంగ్రెస్ పనికిమాలిన రాజకీయాలు చేస్తుందని విమర్శించారు . కాంగ్రెస్ బీసీలకు చేస్తున్న ద్రోహానికి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితం లభిస్తుందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ అంశంపై బిజెపిని బద్నాం చేస్తామని నాటకాలు ఆడుతున్న కాంగ్రెస్ కు బిసి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సునీల్ రావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేష్, కోమల ఆంజనేయులు , బంగారు రాజేంద్రప్రసాద్, మేకల ప్రభాకర్ యాదవ్ , మాజీ ఎంపీపీ వాసాల రమేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బత్తుల లక్ష్మీనారాయణ , మాడ వెంకటరెడ్డి , పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి , కళ్లెం వాసుదేవ రెడ్డి , దండు కొమరయ్య , జిల్లా కోశాధికారి వైద రామానుజం, గుజ్జ శ్రీనివాస్ , జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర , కోలగని శ్రీనివాస్, జాడి బాల్ రెడ్డి, సొల్లు అజయ్ వర్మ, నరహరి లక్ష్మారెడ్డి , సుధాకర్ , రాజు లతోపాటు వివిధ మండలాల అధ్యక్షులు , కరీంనగర్ జోన్ అధ్యక్షులు , వివిధ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుర్నాపల్లిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- ఫాగింగ్ చేయించడంలో నిర్లక్ష్యం వహించిన కార్యదర్శిపై ఆగ్రహం
- ఫ్రై డే - డ్రై డే పక్కాగా అమలు కావాలని ఆదేశం
- ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిపై ఆరా



**నిజామాబాద్, ఆగస్టు 05 (మనం బ్యూరో):** ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. స్థానికంగా గల పల్లె దవాఖానాను, సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను సందర్శించారు. ముందుగా పల్లె దవాఖానాను కలెక్టర్ తనిఖీ చేసి, నిర్వహణ తీరును పరిశీలించారు. సిబ్బంది హాజరు, అవుట్ పేషంట్ల రిజిస్టర్లను తనిఖీ చేశారు. టీ.బీ ముక్త్ భారత్ అభియాన్ అమలుతో పాటు సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యల గురించి ఆరా తీశారు. గ్రామంలో ఇతర ప్రాంతం నుండి వచ్చిన ఒకరికి డెంగ్యూ వచ్చిందని ఆరోగ్య కార్యకర్త శైలజ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో దోమల నియంత్రణ కోసం చేపడుతున్న చర్యల గురించి సమీక్షించిన సందర్భంగా, స్ప్రే, ఫాగింగ్ చేయించడం లేదని వెల్లడి కావడంతో గ్రామ కార్యదర్శి సురేష్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన నెలన్నర రోజుల నుండి పదేపదే చెబుతున్నప్పటికీ, ఇంతవరకు స్ప్రే ఎందుకు చేయించలేదని నిలదీశారు. అక్కడినుండే జిల్లా పంచాయతీ అధికారికి ఫోన్ చేసి, అన్ని జీ.పీలలో పక్కాగా ఫాగింగ్ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక్కో గ్రామం వారీగా పరిశీలన జరిపించి, నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రతి పక్షం రోజులకు ఒకసారి తప్పనిసరిగా అన్ని నివాస ప్రదేశాలలో ఫాగింగ్ చేయించాలని, ఫ్రైడే - డ్రైడే పక్కాగా అమలయ్యేలా చూడాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాల పరిరక్షణ విషయంలో అలసత్వానికి తావు లేకుండా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరీలు పొందిన లబ్దిదారులు అందరూ ఇంటి నిర్మాణం చేపట్టేలా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఆర్థిక స్థోమత లేని లబ్దిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో ఇందిరమ్మ లబ్దిదారులకు ఇప్పటికే రూ. 30 కోట్ల పైచిలుకు రుణ సదుపాయం అందించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఇంకనూ అవసరం అయిన వారికి రుణ వసతి సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం అందిస్తుండగా, ఉచిత ఇసుకను సమకూరుస్తున్నామని గుర్తు చేశారు.

అయినప్పటికీ లబ్దిదారులు ఎవరైనా ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాకపోతే, అలాంటి వారి నుండి రాతపూర్వకంగా లేఖలు తీసుకుని లబ్దిదారుల జాబితా నుండి పేర్లను తొలగించాలని, వారి స్థానంలో అర్హత కలిగిన ఇతరులకు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నూటికి నూరు శాతం ఇందిరమ్మ ఇళ్ళ పనులు ప్రారంభం అయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపుతూ, ఇంటి నిర్మాణం చేపట్టేలా లబ్దిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన రెండు పడక గదుల ఇళ్ళను అర్హులైన వారికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓ ఆఫీసులో ప్రజాపాలన సేవా కేంద్రం కొనసాగుతున్న విషయం ప్రజలందరికి తెలిసేలా కార్యాలయం వద్ద ఫ్లెక్సిని ఏర్పాటు చేయించాలని సూచించారు. కాగా, ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. అక్కడికి వచ్చిన స్థానిక రైతులను పలుకరించి, ఎరువులు సరిపడా అందుతున్నాయా అని ఆరా తీశారు. ఎరువుల పంపిణీ సంతృప్తికరంగా ఉందని, తమ అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, జిల్లాలో ఎప్పుడు కూడా 11 వేల మెట్రిక్ టన్నుల వరకు ఎరువుల నిల్వలు మిగిలి ఉండగానే, కొత్తగా ఎరువుల స్టాక్ తెప్పించుకోవడం జరుగుతోందని అన్నారు. అన్ని ప్రాంతాలలో ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్న ఫలితంగా ఎక్కడ కూడా కొరత ఏర్పడలేదని, రైతులు కూడా ఒకేసారి కాకుండా తమ అవసరాలకు అనుగుణంగా ఎరువులను తీసుకువెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఈ వానాకాలం సీజన్ పంటకు సంబంధించి ఇప్పటికే రెండు దఫాలుగా ఎరువుల వాడకం పూర్తయ్యిందని, చివరిదైన మూడవ దఫా వినియోగం సజావుగా సాగుతోందని గుర్తు చేశారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీసీ ద్వారా సమీక్ష జరిపిన కలెక్టర్




**నిజామాబాద్, ఆగస్టు 05(మనం బ్యూరో):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా వెంటదివెంట అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఆర్.ఐలు, సర్వేయర్లతో భూభారతిపై సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ డిచ్పల్లి నుండి వీ.సీలో పాల్గొన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో మండలం వారీగా తహసిల్దార్, ఇతర సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓలు ప్రతిరోజు ఒక మండలాన్ని తప్పనిసరిగా సందర్శిస్తూ, భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలన జరపాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగుతున్న మండలాల తహసీల్దార్లను, జాప్యానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పదేపదే చెబుతున్నప్పటికీ, అర్జీల సత్వర పరిష్కారానికి ఎందుకు చొరవ చూపడం లేదని పలువురు తహశీల్దార్ల పని తీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఆమోదించిన దరఖాస్తులను 24 గంటల లోపు ఆర్డీఓల ఆమోదం కోసం పంపించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులతో పాటు మీ-సేవ కేంద్రాల ద్వారా ఆన్లైన్ లో వచ్చిన భూభారతి అర్జీలను కూడా వెంటదివెంట పరిష్కరించాలని అన్నారు. సాదా బైనామా కు సంబంధించిన అప్లికేషన్ లను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, ప్రభుత్వం నుండి మార్గదర్శకాలు అందిన వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించేందుకు వీలుగా నోటీసులు రూపొందించుకుని అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉండాలని కలెక్టర్ సూచించారు. స్పష్టమైన కార్యాచరణను రూపొందించుకుని భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓలు, అన్ని మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## నేడు మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నా




**మంచిర్యాల, 5, ఆగస్టు (మనం న్యూస్):** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం విద్యశాఖ కమిషనర్ కార్యాలయం ధర్నాకు వెళ్తున్నామని తెలియచేస్తూ మంచిర్యాల జిల్లా డిఈఓ కార్యాలయ సూపర్డెంట్ సత్యనారాయణ కు వినతిపత్రం ఇచ్చినట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ తెలిపారు.మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ( సీఐటీయూ) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆగస్టు 6న హైదరాబాదు విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంకు వెళ్తున్నామని వంట బందు చేస్తున్నామని తెలియజేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం సూపర్డెంట్ గారికి వినతి పత్రం ఇచ్చామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వహకుల సమస్యలు పరిష్కరించాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులు యూకేబర్ తో సంబంధం లేకుండా బిల్లులు చెల్లించాలని,కొత్త మెనూకు బడ్జెట్ ను పెంచాలని, ఎన్నికల్లో ప్రభుత్వ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కార్మికురాలికి నెలకు 10 వేల రూపాయల వేతనం చెల్లించాలన్నారు. స్వీపర్ల వేతనాలు వారి వ్యక్తిగత అకౌంట్లో జమ చేయాలని, గత సంవత్సరంలో పెట్టిన టిఫిన్ డబ్బులు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో వంటగది నిర్మించాలని, కార్మికులకు యూనిఫామ్ లు, ఐడి కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమాచారం జిల్లలోని అన్ని మండలాల ఎం. ఈ. ఒ లకు, పాఠశాలల ఎచ్. ఎం.లకు కూడా పంపించాలని కోరారు.నేడు హైదరాబాదు విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోండి

- వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి



**వేములవాడ, ఆగస్టు 5(మనం న్యూస్):** క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏఎస్పి మాట్లాడారు.ఈ సందర్భంగా ఏఎస్పి మాట్లాడుతూ..నేరాలపై వేగవంతమైన విచారణ, న్యాయపరమైన ఆధారాలతో నేర నిరూపణ జరిగితేనే నిందితులకు శిక్ష పడే అవకాశముంటుందన్నారు. సుదీర్ఘంగా పెండింగ్లో ఉన్న కేసులపై సబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు తరచూ సమీక్ష జరిపి, వాటిని త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.సబ్ డివిజన్ పరిధిలో నేరాలకు పాల్పడే వారిపై రౌడీషీట్లు తెరవాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీల కదలికలపై నిఘా పెట్టి తరచూ తనిఖీలు జరపాలని అన్నారు. నిషేధిత గంజాయి రవాణా, అక్రమ ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, జూదం లాంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామాల్లో పోలీస్ అధికారులు తరచూ పర్యటించి ప్రజలతో సంబంధాలను మెరుగుపర్చాలని, సైబర్ నేరాలు, మత్తుపదార్థాల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించే విధంగా కమ్యూనిటీ పోలీసింగ్ను ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో సిఐలుగా వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు మరియు ఇతర సబ్డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**తంగళ్ళపల్లి, ఆగస్టు 5(మనం న్యూస్):** భారతీయ జనతా పార్టీ తంగళ్ళపల్లి మండల అధ్యక్షులు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ తంగళ్ళపల్లి పాఠశాలలో బండి సంజయ్ కుమార్ గారి జన్మదిన సందర్భంగా మోదీ గిఫ్ట్ గా సైకిల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిలుముల శంకర స్వామి,ఎంఈఓ రాజు నాయక్,వెంకటస్వామి,బిజెపి ప్రధాన కార్యదర్శిలు ఇటికల రాజు,కోస్నె వినయ్ యాదవ్,ఉపాధ్యక్షులు రెడ్డిమల్ల ఆశీర్వాద్,కోడం భవిత,సిలివేరి ప్రశాంత్,కలికోట చరణ్,ఇటికల మహేందర్,జలపతి,కృష్ణ,నందగిరి నవీన్,నుల్గొండ శ్రీనివాస్,అమరగొండ రాజు,గోనపల్లి శ్రీనివాస్,రేగుల రాజు,బాల మల్లేశం,కట్ట తిరుపతి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు రావటం లేదని మనస్తాపంతో దంపతుల ఆత్మహత్యాయత్నం

- అనర్హులకు ఇండ్లను మంజూరి చేస్తున్నరని అవేదన..
- ఇల్లు మంజూరి చేయాలని రోడ్డు బైఠాయించిందోళన దంపతులు..



**చిగురుమామిడి: ఆగస్టు 5 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పక్కదారి పట్టిస్తూ భూములున్న అనర్హలకు మంజూరి చేస్తూ పేదల పొట్టకోడుతున్నారని అవేదన వ్యక్తం చేస్తూ పెట్రోల్ పోసుకోని బార్యభర్తలు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరిలో మంగళవారం చోటు చేసుకుంది.వివారాల్లోకి వెళ్లితే సుందరగిరి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన వంతడుపుల శ్రీనివాస్ సృజన అనే దంపతులు ఇందిరమ్మఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాప్పటికి తమకు రెండవ లిస్టులో సైతం తమ పేరు రాలేదని అవేదన వ్యక్తం చేశారు.ఫాస్ట్ లిస్ట్ లో సైతం వారి పేరు రాకపోవటం అనర్హులకు మంజూరి చేయటంతో గతంలోను గ్రామపంచాయితి ముందు సైతం ధర్నా నిర్వహించారు. 2వలిస్ట్ లో తప్పకుండా ఇల్లు మంజూరి చేస్తామని నచ్చజేప్పటంతో తీరా 2వ లిస్ట్ లో తమ పేరు కనిపించకపోవటంతో మనసికంగా కృంగిపోయిన దంపతులు రోడ్డు పైకె వచ్చి బైఠాయించి అందోళన చేశారు. ఎవ్వరు స్పందించకపోవటంతో పెట్రోల్ తాగి,మీద పోసుకోని ఇద్దరు ఆత్మహత్యయత్నానికి యత్నించారు.పోలీసులు అక్కడకు చేరుకోని వెంటనే 108లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.తనకు వెంటనే ఇల్లును మంజూరి చేయాలని లేని పక్షంలో తమకు ఆత్మహత్య తప్పదని దంపతులు స్పష్టం చేశారు. ఆ త్మహత్యయత్నం జరిగిన సంఘటనపై రాత్రి వరకు అధికారులు ఎవ్వరు స్పందించకపోవటంపై మండల ప్రజలు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైన ఆనర్హులకు కేటాయించిన ఇండ్లను వెంటనే రద్దు చేసి పేదలకు ఇవ్వాలని దర్మసామాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు తాళ్ల నరేష్ అధికారులను హెచ్చారించారు. అధికారుల ఆసమర్థతతోపాటు, మాముళ్లకు ఆశపడి పేదలకు రావాల్సిన ఇండ్లను ధనికులకు మంజూరి చేస్తు పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని నరేష్ గ్రహం వ్యక్తం చేశారు.

### జాతీయం- అంతర్జాతీయం

## ‘రాహుల్ వ్యాఖ్యలు సరైనవే..’ ఇండియా కూటమి పార్టీల నేతలు!



**ఢిల్లీ, ఆగస్టు 5:** భారత్ జోడో యాత్ర సమయంలో దేశ సైన్యంపై అనుచిత వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని సుప్రీంకోర్టు నిన్న మందలించిన సంగతి తెలిసిందే. రాహుల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు నిరాధారణమైనవని, రాహుల్ వ్యాఖ్యలు సరైనవేనంటూ ఇండియా కూటమిలోని పలు పార్టీలు అభిప్రాయపడ్డాయి. జాతీయ అంశాలను ప్రశ్నించే బాధ్యత రాజకీయ పార్టీలకు ఉంటుందని నొక్కి చెప్పాయి. ఈ అంశంపై ఇండియా కూటమిలోని పలు పార్టీలకు చెందిన సభాపక్ష నేతలు సమావేశమై చర్చించారు. ‘‘రాజకీయ పార్టీల ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా న్యాయస్థానం అసాధారణమైన వ్యాఖ్యలు చేసింది. దీన్ని అన్ని పార్టీల నేతలూ అంగీకరించారు‘ అని కాంగ్రెస్ ఓ ప్రకటనలో తెలిపింది. రాజకీయ పార్టీలకు మరీ ముఖ్యంగా ప్రతిపక్ష నేతలకు జాతీయ సమస్యలపై ప్రశ్నించే బాధ్యత ఉంటుందని ఆ పార్టీ పేర్కొంది. రాహుల్ గాంధీ భారత భద్రతా దళాలను ఎంతో గౌరవిస్తారని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఆయనకు ఉందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ నిజమైన భారతీయుడు ఎవరు అనేది వారు నిర్ణయించలేరు. ప్రభుత్వాన్నికి ప్రశ్నలు సంధించడం ప్రతిపక్ష నేతగా రాహుల్ బాధ్యత’’ అని అన్నారు. రాహుల్ ఎప్పుడూ సైన్యానికి వ్యతిరేకంగా మాట్లాడరు, ఆర్మీని గౌరవిస్తారని ప్రియాంక గాంధీ తెలిపారు.

## ఆహారం కోసం తొక్కిసలాట

### పలువురు పాలస్తీనీయుల మృతి



**డెయిర్ అల్ బలా, ఆగస్టు 5 :** ఆహార పంపిణీ కేంద్రాలవైపు, ఆకాశం నుంచి జారవిడిచిన ఆహార పొట్లాల వైపు ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులు పరుగులు తీస్తుండగా జరిగిన తొక్కిసలాటలో సోమవారం పలువురు పాలస్తీనీయులు మరణించారని ప్రత్యక్ష సాక్షులు, ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. గడచిన 22 నెలలుగా ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దిగ్బంధనం కారణంగా గాజాలో తీవ్ర క్షామ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో సురక్షిత ఆహార పంపిణీ పెనుసవాలుగా మారింది. గాజాలో ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్న జికిం క్రాసింగ్ ప్రాంతంలో అన్నార్తుల మధ్య ఆహారం కోసం సాగిన హోరాహోరీలో 16 మంది మరణించారని షిఫా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మరణాలకు దారితీసిన కచ్చితమైన కారణాలేమిటన్నది వెంటనే తెలియలేదు. ఇజ్రాయెల్ గాజా ప్రాంతంలోకి తగినంత ఆహారం ప్రవేశించకుండా నిరోధిస్తోందని సహాయక సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఆహార పంపిణీ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ బలగాలు జరిపిన కాల్పుల్లో వందలాది మంది పాలస్తీనీయులు మరణించారు.

## జెలెన్‌స్కీ సతీమణి విమానం భారత్‌లో ల్యాండింగ్?



**జైపూర్, ఆగస్టు 5:** ఉక్రెయిన్-రష్యా యుద్ధం కొనసాగుతోన్నవేళ ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సతీమణి ఒలెనా జెలెన్‌స్కీ ప్రయాణిస్తున్న విమానం ఉన్నట్టుండి భారత్లో ల్యాండ్ అయ్యింది. జపాన్ పర్యటనకు వెళ్తుండగా ఆమె విమానం జైపూర్‌లో దిగింది. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఒలెనా జెలెన్‌స్కీ, ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సిబిహా, ఇతర సీనియర్ అధికారులు ఇటీవల టోక్యో పర్యటనకు బయల్దేరారు. మార్గమధ్యంలో వీరి విమానం జైపూర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. ఇంధనం నింపుకోవడం కోసమే వీరి విమానం ల్యాండ్ అయినట్లు విదేశీ మంత్రిత్వశాఖ అధికారులు వెల్లడించారు. ఇందుకోసం ఉక్రెయిన్ అధికారులు ముందస్తు అనుమతి కూడా తీసుకున్నట్లు తెలిపారు. ఈక్రమంలోనే ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఒలెనా జెలెన్‌స్కీ విమానం జైపూర్‌లో దిగింది. భారత విదేశాంగశాఖ ఆదేశాల మేరకు.. పౌర విమానయాన భద్రతా సంస్థ ఉక్రెయిన్ ప్రతినిధులకు తగిన భద్రతా సౌకర్యాలు కల్పించింది. ప్రొటోకాల్ ప్రకారం వారికి ఎలాంటి ఇమిగ్రేషన్ తనిఖీలు చేయలేదని, ఇంధనం నింపే సమయంలో ఒలెనా జెలెన్‌స్కీ సహా మిగతా ప్రతినిధులంతా వీఐపీ ఏరియాలో వెయిట్ చేశారని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఆ సమయంలో భారత్లోని ఉక్రెయిన్ దౌత్య కార్యాలయ అధికారులతో ఆమె సమావేశమైనట్లు తెలిపారు. అనంతరం ఉదయం 8.15 గంటల సమయంలో వారి విమానం టోక్యోకు టేకాఫ్ అయినట్లు పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలకు పైగా కీవ్పై రష్యా యుద్ధం సాగిస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో మాస్కోను నిలువరించేలా జెలెన్స్కీ ప్రభుత్వం అంతర్జాతీయ సమాజం నుంచి సాయం కోరుతోంది. ఈ క్రమంలోనే అధ్యక్షుడి సతీమణి జపాన్ పర్యటన చేపట్టారు. రష్యాపై ఆంక్షలు విధించడంతో పాటు ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి సాయం చేయాలని ఆమె టోక్యోను కోరారు.

## పీఎం కిసాన్ సాయం పెంపు లేనట్లే...

- స్పష్టం చేసిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్




**ఢిల్లీ, ఆగస్టు 5 :** పీఎం-కిసాన్ పథకం పరిధిని విస్తరించడం, అందించే ఆర్థిక సాయం పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనా ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని కేంద్రం పార్లమెంట్కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. రైతులకు ఏటా ఒక్కో విడత రూ.2 వేలు చొప్పున మూడు విడతల్లో రూ.6 వేల సాయం అందించే పీఎం కిసాన్ పథకాన్ని కేంద్రం 2019లో ప్రారంభించింది. ఈ మొత్తాన్ని నగదు బదిలీ కింద అందిస్తోంది. ఇప్పటివరకు రైతులకు 20 వాయిదాల్లో రూ.3.9 లక్షల కోట్లకు పైగా అందజేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం పీఎం-కిసాన్ పథకం పరిధిని విస్తరించడం గానీ, లేదా అందించే సాయాన్ని పెంచే అంశంపై ఎలాంటి ప్రతిపాదనా పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కౌలు రైతులు, భాగస్వామ్య సాగు రైతులను ఈ పథకంలో చేర్చే అంశంపై వచ్చిన మరో ప్రశ్నకూ సమాధానం ఇచ్చారు. ఈ పథకం ప్రయోజనాలు పొందాలంటే రైతులు సాగు భూమి కలిగి ఉండడమే ప్రధాన అర్హత అని మంత్రి తెలిపారు. తమిళనాడులో అమలవుతున్న తరహాలో రైతులకు వాతావరణ సమాచారం, మార్కెట్ వివరాలు, సలహాలు అందించే విధంగా కేంద్రం ఏదైనా యాప్‌ను ప్రవేశపెట్టనుందా? అని అడిగిన ప్రశ్నకు.. ప్రస్తుతం అటువంటి ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదన్నారు. అయితే, వ్యవసాయానికి సంబంధించిన సందేహాలు, సలహాలకు ‘కిసాన్ కాల్ సెంటర్’ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సేవల కోసం రైతులు 1800-180-1551 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చెయొచ్చని, ప్రాంతీయ భాషల్లోనే సమాధానాలు లభిస్తాయని పేర్కొన్నారు.

# హుజూర్‌నగర్ కోదాడ సెగ్మెంట్ అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలుపుతాం

## లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణ పనుల్లో నాణ్యత పై రాజీ లేదు

## చెరువుల్లో అక్రమాలు తొలగించి ఎఫ్ డి ఎల్ కు ప్రతిష్టం

## అధికారుల సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్



**సూర్యాపేట ఆగస్టు 05 (మనం ప్రతినిధి):** కోదాడ హుజూర్నగర్ నియోజకవర్గ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే రోల్ మోడల్ గా ఉండే విధంగా చేస్తామని రాష్ట్ర ఇరిగేషన్ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హైద్రాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ....రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4460 ఎకరాలకు 47.64 కోట్ల రూపాయలతో పాలేరు వాగు పై నిర్మించటంజరుగుతుందని రాజీవ్ శాంతి నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ని 54.03 కోట్ల రూపాయలతో 5000 ఎకరాలకి పాలేరు వాగు ద్వారా అందిస్తామని తెలిపారు. ఖ9 లిఫ్ట్ ఇరిగేషన్ మునగాల, నడిగూడెం మండలాలకి చెందిన 3500 ఎకరాలకి 8.45 కోట్లతో నిర్మించటం జరుగుతుందని అలాగే మోతే లిఫ్ట్ ఇరిగేషన్ ని 244 కోట్ల రూపాయలతో 45,736 ఎకరాలకి 4.5 టి ఎం సి ల నీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు.పులిచింతల వెనుక జలాలు ని ఉపయోగించుకొని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లో 1450 కోట్ల రూపాయలతో 53000 ఎకరాలకి నీరు అందించటం జరుగుతుందని ఇప్పటికే 188.32 ఎకరాలకి భూ సేకరణ చేసి నష్ట పరిహారం అందించటం జరిగిందని జూలై 2026 నాటికి పూర్తి చేయాలని, పైపుల నిర్మాణం లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్ ని ఆదేశించారు.పాలకీడు మండలం లో జవహర్ జానపహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 10,000 ఎకరాలకి 302.20 కోట్లతో డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.కోమటికుంట, గుండ్లపహాడ్ చెరువులకి నీరు వచ్చేలా కాలువ ఏర్పాటు కి పరిశీలించాలని అధికారులకి ఆదేశించారు.బెట్టే తండా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2041 ఎకరాలకి 26.02 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని జానపాడు, బెట్టే తండా లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం పూర్తి ఐతే శాశ్వతంగా నీరు అందించి పాలకీడు మండలం సస్యశ్యామలం అవుతుందని స్పష్టం చేశారు.నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ 3200 ఎకరాలకి నీరు అందించేందుకు 31 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.పులి చింతల ద్వారా విద్యుత్ తయారీ చేసిన నీటి ద్వారా రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మేళ్లచెర్వు, కోదాడ, చిలుకూరు, చింతలపాలం మండలాలకి చెందిన 14100 ఎకరాలకు 320 కోట్ల తో నిర్మించటం జరుగుతుం దని చెప్పుకొచ్చారు. అదేవిధంగా మహంకాళి గూడెం, మంచ్య తండా ఎత్తి పోతల పథకాలకి మరమ్మతులు చేపించాలని బూరుగడ్డ చెరువు సర్వే చేసి కబ్జాలో ఉన్న వారిని తొలగించి సరిహద్దులు గుర్తించాలని పేర్కొన్నారు.తక్కువ ఖర్చు తో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తెచ్చేందుకు స్మాల్, మీడియం లిఫ్ట్ ఇరిగేషన్ లు నిర్మిస్తున్నామని రైతుల నుండి సేకరించిన భూములకి నష్ట పరిహారం ఇస్తామని ,పైపులు భూమి లోపటి నుంచి వేసి పైన సాగు చేసుకోవచ్చు అని భూ సేకరణ విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులను ఒప్పించాలని ఆదేశించారు. అదేవిధంగా కోదాడ బస్ స్టాండ్ ని ఆధునికరణ బస్ స్టాండ్ గా నిర్మించుటకి 16.89 కోట్లు, హుజూర్ నగర్ నందు బస్ స్టాండ్ కొరకు 3.52 కోట్లతో మంజూరు చేశామని పంద్రాగస్ట్ రోజు కోదాడ, హుజూర్ నగర్ ఆధునికరణ బస్ స్టాండ్లకి శంకుస్థాపన చేస్తామని అధికారులు ఆ దిశగా ఏర్పాటు చేయాలని 6 నెలల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రయాణికులకి మెరుగైన సౌకర్యాలు అందిస్తూ,పార్కింగ్, కాంటీన్, ఏ సి వెయిటింగ్ హల్, పిడింగ్ రూమ్ ఏర్పాటు చేస్తున్నా మని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకి తెలిపారు. గరిడేపల్లి, నేరేడు చర్ల, మేళ్లచెరువు బస్టాండ్ లలో పరి శుభ్రం చేసి టాయిలెట్స్ నిర్మించాలని కోదాడ-జానపాడు వయా మఠంపల్లి, నేరేడుచర్ల నుండి జానపాడు, చెన్నాయి పాలెం,యాత వాకిళ్ల, గానుగబండ, మోతే మండలం సిరికొండ లకి, కాపుగల్లు, యర్రవరం బస్సు ఏర్పాటు చేయాలని కాలేజీ విద్యార్థులు, బస్సు లు ఇబ్బంది పడుతున్నారని పలువురు సూచించగా మంత్రి కోదాడ డిపో కి ఎక్కువ బస్ లు తిరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు.గడ్డిపల్లి, చిలుకూరు యంగ్ ఇండియా రెసిడెన్సీ యల్ పాఠశాలకి రోడ్లకి అధిక ప్రాధాన్యతనిస్తూ పూర్తి చేయాలి అని హుజుర్నగర్ నియోజకవర్గం లో 315.10 కోట్లతో 16 రోడ్ల పనులు 407.4 కి మి లు నిర్మిస్తున్నామని, 46.70 కోట్లతో 6 బ్రిడ్జి లు నిర్మిస్తున్నామని,హుజూర్ నగర్ లో 8 కోట్లతో ఆర్ బి గెస్ట్ హౌజ్ నిర్మిస్తున్నామని,డి ఎం ఎఫ్ టి 20.44 కోట్లతో 10 రకాల పనులు నిర్మిస్తున్నామని తెలియజేశారు.పాలకీడు, చింతల పాలెం లో ప్రభుత్వ కార్యాలయాలు అలాగే కోదాడ నియోజకవర్గం లో 228.40 కోట్లతో 14 రోడ్ల పనులు 272 కి మి లు నిర్మిస్తున్నామని, 8 కోట్లతో మునగాల కొక్కిరేని బ్రిడ్జి నిర్మిస్తున్నామని, అనంతగిరి లో 43 కోట్లతో 3 బిల్డింగ్స్ నిర్మిస్తున్నామని,డి ఎం ఎఫ్ టి 6 పనులును 12.97 కోట్లతో నిర్మాణం కమ్యూనిటీ హల్స్ నిర్మిస్తున్నామని ఎస్ ఈ సీతారామయ్యఎస్ ఈ సీతారామయ్య మంత్రికి వివరించారు.గడ్డిపల్లి, చిలుకూరు యంగ్ ఇండియా రెసిడెన్సీ యల్ పాఠశాలకి రోడ్లకి అధిక ప్రాధాన్యతనిస్తూ పూర్తి చేస్తేనే పాఠశాల పనులు వేగంగా పూర్తి చేయుటకి అవకాశం ఉంటుందనిఅలాగే సొలర్జాంగ్ పేటలో ఈద్గా, కమ్యూనిటీ హాల్ త్వరగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## అమ్మ పాలు అమృతం



**తుంగతుర్తి, ఆగస్టు 5,( మనం న్యూస్ ):** అమ్మ పాలు అమృతం లాంటివని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఖైరున్నిషా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగూడెం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని అన్నారు పుట్టినబిడ్డకు వెంటనే ముర్రుపాలు అందించాలని అన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు లక్ష్మీబాయి ,శారద ,ఆయాలు పుష్ప, ఎలేంద్ర, చిన్నారులు ,తల్లులు తదితరు పాల్గొన్నారు.

## మహిళ జీవితంలో మాతృత్వం గొప్ప వరం




**సూర్యాపేట ఆగస్టు 05 (మనం ప్రతినిధి)** స్త్రీ జీవితంలో మాతృత్వం ఒక గొప్ప వరం అని వాసవి క్లబ్ డిస్టిక్ గవర్నర్ డైమండ్ స్టార్ కేసీజిఎఫ్ రాచకొండ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్లో సుధాకర్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో వాసవి వారి శ్రీమంతం వేడుకల్లో భాగంగా 104 మంది గర్భిణీలకు శ్రీమంతము నిర్వహించారు.ఈ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ... వాసవి డిస్టిక్ 104 ఏ ను ఇంటర్నేషనల్ లో రెండవ స్థానంలో నిలిపినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.ఒక ఇంట్లో శ్రీమంతం చేసుకోవాలంటే ఎంతో ప్రయాసతో కూడుకున్న పనిని అలాంటిది ఒకేసారి 104 మంది గర్భిణీలకు శ్రీమంతం నిర్వహించడం అభినందనీయం అని కొనియాడారు. వాసవి క్లబ్ కమ్యూనిటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ చేస్తూ వారికి ఆర్థికంగా తోడ్పాటు అందీయటం సంతోషంగా ఉందని ఆగస్టు 8న సారే ,చీర కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం గర్భిణీలకు గాజులు పూలు, పండ్లు, స్వీట్ లు,పసుపు కుంకుమ, చీర, జాకెట్ ముక్కలను అందజేశారు. ఫ్రెండ్షిప్ డే కార్యక్రమం తో పాటు మాజీ అధ్యక్షులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఈసీలు సింగరకొండ రవీందర్, తోట శ్యాంప్రసాద్, రాచర్ల కమలాకర్ క్యాబినెట్ సెక్రటరీ కృష్ణ, ట్రెజరర్ వెంపటి శబరి, జోన్ 1 చైర్మెన్ చల్ల లక్ష్మయ్య,రీజియన్ చైర్మన్ మిరియాల సుధాకర్ విజన్ క్లబ్ ప్రెసిడెంట్ దాచేపల్లి సంధ్య సెక్రటరీ వంగవీటి సుజాత ట్రెజరర్ బుర్లేజ్యోతి తో పాటు పలువురు ఐపీసీలు, సిడిపిఓ సుబ్బలక్ష్మి, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం అపూర్వ స్పందన



**నేరేడుచర్ల ఆగస్టు 5 మనం న్యూస్ :**సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామంలో టీయూడబ్ల్యూజే, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు కొంజేటి సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని శ్రీనివాసరావు ల ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ క్లబ్ సంయుక్తంగా మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన కొంతమందికి కంటి ఆపరేషన్ చేయవలసి వారిని గుర్తించి ఉచితంగా చేయిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కొంజేటి సత్యనారాయణ, చలసాని శ్రీనివాసరావులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ స్వాతి, మదన్, గ్రామ ప్రముఖులు కొడాలి పట్టయ్య, కొడాలి భాస్కర్ రావు, బుడిగె వెంకటేశ్వర్లు, వీరపునేని మురళి, కొండయ్య, సంకబుడ్డి శ్రీను, పోలంపల్లి వీరస్వామి, బుడిగె సాంబయ్య,మేకపోతుల శ్రీనివాస్, బుడిగె రంగయ్య, బోనగిరి శ్రీనివాస్, మేకపోతుల నాగరాజు, అనంతు వెంకన్న, సొల్లేటి వెంకటాచారి, మేకపోతుల పిచ్చయ్య, పొలంపల్లి వీరస్వామి, అనంతు వెంకటేశ్వర్లు, గుడిగుంట్ల అశోక్, కొడాలి భార్గవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతిక దర్యాప్తు పోటీల్లో విజేతలకు అభినందన



**సూర్యాపేట, ఆగస్టు 5 (మనం ప్రతినిధి):** రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీకు నందు పతకాలు సాధించిన సిబ్బందిని, పోలీస్ డాగ్ రోలెక్స్ ఈనెల 1, 2 వ తేదీలలో వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నందు జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ నందు యాదాద్రి జోన్ తరపున సూర్యాపేట జిల్లా పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతికత దర్యాప్తు నందు నిర్వహించిన పోటీల్లో హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ చక్రవర్తి తృతీయ స్థానంలో మెడల్ సాధించారు అలాగే ఈ పోటీల నందు నార్కోటిక్ డాగ్ రొలెక్స్ ఉత్తమ ప్రతిభ చూపి మత్తు పదార్థాల తనిఖీల నందు ద్వితీయ స్థానం మెడల్ పొందినది డాగ్ ట్రైనర్ సతీష్ ఉత్తమ ప్రతిభ చూపారు. దీంతో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ విజేతలైన హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ చక్రవర్తి, ఆర్మడ్ కానిస్టేబుల్ సతీష్ లను అభినందించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...పూణే పట్టణంలో జరగనున్న జాతీయస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ నందు ప్రతిభ చూపి పతకాలు సాధించాలని రాష్ట్ర పోలీస్ శాఖకు జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం నందు ఎస్పీ వెంట అడ్మిన్ అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, ఏ ఆర్.అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, ఏ ఆర్ డి ఎస్ పి. నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

## జంక్షన్ అభివృద్ధి పనుల తనిఖీ



**సూర్యాపేట ఆగస్టు 05 (మనం ప్రతినిధి)** పట్టణంలోని పెద్ద మశీదు వద్దా జరుగుతున్న జంక్షన్ అభివృద్ధి పనులను మంగళవారం మున్సిపల్ కమీషనర్ సిఎచ్.హన్మంత రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ.... కాంట్రాక్టర్లు తమకు కేటాయించిన పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేయాలని అన్నారు,జంక్షన్ అభివృద్ధి నిర్మాణ పనుల సంబంధించి పలు సూచనలు చేశారు, ఆయన వెంట మున్సిపల్ డి.ఇ సత్యారావు,సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## జాతీయ నుల్లి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**తుంగతుర్తి, ఆగస్టు 5( మనం న్యూస్):** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లింగమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పెన్షనర్ భవనంలో ఈనెల 11న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రలు అందజేస్తామన్నారు. విద్యార్థులకు నులిపురుగులు శరీరంలో చేరకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. 1 నుంచి 19 ఏళ్లలోపు ఉన్న వారికి పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఇలాంటి సమస్యలు పిల్లల్లో ఎదురుకాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, పీహెచ్ఎన్ టీకేఆర్ లక్ష్మి, డాక్టర్ విజయ్ కుమార్, ఏఎన్ఎంలు మౌనిక, సరిత, రమ్య, హెల్త్ అసిస్టెంట్లు, గాజుల సోమన్న, యాదగిరి, చారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## భూ భారతి ఆర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



**సూర్యాపేట, ఆగస్టు 05 (మనం ప్రతినిధి):** జిల్లాలోని భూ భారతి అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి భూ సమస్యలను పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. మంగళవారం సూర్యాపేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... భూభారతి అర్జీలపై అధికారుల బృందాలు గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని, అర్హులకు నూతన రేషన్ కార్డును త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ భూ భారతి రెవిన్యూ సదస్సుల ద్వారా 1758 అర్జీలు వచ్చాయని 369 అర్జీలను ఎంక్వయిరీ చేయనైనదని వాటిలో 34 అర్జీలను పరిష్కరించడం జరిగిందని మిగిలిన వివిధ దశలో ఉన్నాయని అదనపు కలెక్టర్ కి వివరించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ సి. హెచ్. కృష్ణయ్య, డి టి లావణ్య, సీనియర్ అసిస్టెంట్ కపిల్, అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి




**తుంగతుర్తి, ఆగస్టు 5( మనం న్యూస్ ):** సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని తుంగతుర్తి లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తల్లాడ కేదారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సంతోష్ ప్రైవేట్ ఆస్పత్రిలో జిల్లా మాజీ గవర్నర్ కోనేరు నాగేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకొని ప్రస్తుత గవర్నర్ రేపాల మదన్మోహన్ ఆదేశాల మేరకు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరు తమకు తోచిన విధంగా పేదలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కోశాధికారి గుండగాని రాము, కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్, ఎనగందుల సంజీవ, ఎనగందుల గిరి, డాక్టర్ చారి, పులుసు వెంకటనారాయణ, ఓరుగంటి సుభాష్, గుజ్జ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామాలయంలో సామూహిక కుంకుమార్చనలు

**నేరేడుచర్ల ఆగస్ట్ 5 మనం న్యూస్ :** నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం లక్ష్మీ అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో వేదమంత్రాలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు, ఆలయ పూజారి బృందావనం తేజ ఆధ్వర్యంలో ఆలయంలో కొలువైన శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అనంతరం విశ్వక్సేన పూజ పుణ్యాహవాచన అమ్మవారి వెండి ప్రతిమకు అభిషేకం చేసి అమ్మవారికి భక్తులచే సామూహిక కుంకుమ అర్చన చేయించారు, అభిషేకాలు కుంకుమార్చనలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు, కావలసిన ఏర్పాట్లను ఆలయ కమిటీ పర్యవేక్షించారు, ఈ పూజా కార్యక్రమాల లో ఆలయ కమిటీ చైర్మన్ కొణతంసత్యనారాయణ రెడ్డి, పులిజాల వెంకటరమణ రావు, ఉప్పల కృపాకర్, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, యడవల్లి వెంకటరెడ్డి జెట్టి వెంకటేశ్వర్లు, మాస్శెట్టి సైదయ్య, రాచకొండ విజయ్, దేవేందర్, కొణతం చిన్న లచ్చిరెడ్డి,కాంపెల్లినారాయణరెడ్డి, రాచకొండ చంద్రశేఖర్, తాటికొండ శ్రీరామ్ రెడ్డి, తాటికొండ నర్సిరెడ్డి, మెట్టు వేణుగోపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి లతోపాటు మహిళా భక్తులు పాల్గొన్నారు





## విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- వంటగది నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలి
- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ, ఆగస్టు 5(మనం ప్రతినిధి):** గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. జాఫర్ గడ్ మండలంలో గురుకుల విద్యాలయాలు కస్తూరిబా బాలికల విద్యాలయం, బాలికల వసతి గృహం, తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్ లను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రహదారి సౌకర్యాలు ను పరిశీలిస్తూ 3 విద్యాసంస్థలు ఒకే కాంపౌండ్‌లో ఉండటంతో అంతర్గత రహదారులను చేపట్టేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, గరల్స్ హాస్టల్ లను సందర్శించి వంటగదిని, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. కూరగాయలు ను పరిశీలించి ఎప్పటికప్పుడు తాజావి తెప్పించుకోవాలని తెలియజేశారు. గరల్స్ హాస్టల్ పరిశుభ్రత ను పరిశీలించి ప్రశంసించారు. ప్రతి రోజు ఇలాగే పరిశుభ్రతగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలికల పరిరక్షణ అధికారి గౌసియా బేగం, కెజిబివి ప్రత్యేక అధికారి స్వప్న, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, గరల్స్ హాస్టల్ వార్డెన్ జ్యోతి, విద్యార్థినులు ఉన్నారు.

## అంగన్వాడి కేంద్రాలను పిల్లలకు మొదటి పాఠశాలలుగా మార్చాలి



- పిల్లలందరినీ ప్రీ ప్రైమరీ విద్య కోసం అంగన్వాడి కేంద్రాల్లో చేర్చాలి
- జిల్లా కలెక్టర్, పి ప్రావిణ్య

**సంగారెడ్డి, ఆగస్టు 5 (మనం ప్రతినిధి):** అంగన్వాడి కేంద్రాలను పిల్లలకు మొదటి పాఠశాలలుగా మార్చాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. మంగళవారం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి . ప్రావిణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ బోధనా విధానాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రీ ప్రైమరీ విద్య కోసం తమ పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల లో చేర్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా సిబ్బంది కి సూచించారు.
ఎవరు కూడా ప్రీ ప్రైమరీ విద్య కోసం తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్చకుండా అంగన్వాడి కేంద్రాల్లోనే చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. తమ పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు మెరుగైన ప్రీ ప్రైమరీ విద్య అంగన్వాడి కేంద్రాల్లోనే లభిస్తుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు మెరుగుపడాలంటే అంగన్వాడీ కేంద్రాలకు తల్లిదండ్రులకు నమ్మకం పెంచాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే భోజనాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు పిల్లలకు ఇచ్చే ఆహారం మెనూ ప్రకారం ఉండాలన్నారు ప్రతి చిన్నారికి అవసరమైన పోషకాహారం అందించాల్సిన బాధ్యత అంగన్వాడి సిబ్బంది పై ఉందన్నారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలో ప్రీ ప్రైమరీ విద్య బోధనలు బోధన ప్రమాణాలు మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని పిల్లల అభివృద్ధి పై అసెస్మెంట్ కార్డులలో విద్యార్థుల ప్రగతిని నమోదు చేయాలని చదువులో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సకాలంలో సిలబస్ పూర్తయ్యేలా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, అంగన్వాడి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమూల్యమైన వరం

- సీడీపీఓ రాధికా రెడ్డి



**మహాదేవపూర్, ఆగస్టు 5(మనం న్యూస్):** నవజాత శిశువుకు తల్లి ముర్రు పాలు అమూల్యమైన వరం లాంటిదని మాతాశిశు సంక్షేమ శాఖ మహాదేవపూర్ ప్రాజెక్టు అధికారిని ఐత రాధికా రెడ్డి అన్నారు. తల్లి పాలవారోత్సవాల ను మండలంలోని సూరారం పెద్దంపేట, మహాదేవపూర్, కాళేశ్వరం, పల్గుల, ఎడపల్లి, పలిమేల మండలంలోని పంకెన అంగ న్వాడీ సెంటర్ల లోనిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రసవం అయిన వెంటనే బిడ్డకు ఒక గంట పాటు స్పర్శ కలిగించి ఆ తరు వాత పసుపు రంగులో వచ్చే చిక్కటి ముర్రు పాలను బిడ్డకు పట్టించాలని ఆమే గర్భిణీలకు అవగాహన కల్పించారు, తల్లి పాలు బిడ్డకు రెండు సంవత్సరా ల వరకు పట్టించాలని ఆమె తెలిపారు. తల్లులు ఆరోగ్య కరమైన పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నా రు. తల్లిపాలు బిడ్డకు మేదోశక్తిని మెరుగు పరిచడా నికి తోడ్పడుతాయని బిడ్డకు భవిష్యత్తులో రక్త పోటు, మధుమేహం, ఊబకాయం లాంటి జబ్బు లు రాకుండా నిరోదిస్తాయని ఆమె వివరించారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు నాగ రాణి, శివరాణి, రమాదేవి, టీచర్లు నిర్మల, సువర్ణ, గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ హెల్పర్లు,

### వర్షాలు, వరదల ముంపు సమస్యలను ఎదుర్కొనేందుకు

# అధికారులు సమాయత్తం కావాలి

- రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్
- ములుగు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓతో కలిసి ముందస్తు జాగ్రత్తలపై స్పెషల్ సీఎస్ సమీక్ష
- అధికారులతో కలిసి సమ్మక్క సాగర్ బ్యారేజ్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలన





**ఏటూర్ నాగారం, ఆగస్టు 5(మనం న్యూస్):** వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యలను ఎదుర్కొనేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా సమాయత్తం కావాలని రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏటూర్ నాగారం ఐ టి డి ఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐ టి డి ఏ పి. ఓ చిత్ర మిశ్రా, ఏ ఎస్ పి ఓ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి లతో కలిసి వర్షాకాలంలో వరదల ముంపు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళికల్లో భాగంగా, వరద ముంపు ప్రాంతాలను గుర్తించడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండటం వంటి అంశాలపై కూలంకషంగా సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ మాట్లాడుతూ గతంలో వరద ముంపు సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలని, సకాలంలో స్పందించకపోతే చిన్న సమస్య కూడా పెద్ద విపత్తుగా మారే అవకాశం ఉంటుందని అరవింద్ కుమార్ అధికారులను హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఎన్ డి ఆర్ ఎఫ్, జిల్లా అగ్నిమాపక శాఖ బృందాలు భారీ వర్షాల వల్ల నష్టం జరగకుండా ముంపు నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. జిలా ఆధికారులతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు చేపట్టాలని అన్నారు. సీజన్ వ్యాధులు ప్రబలే నేపథ్యంలో ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.
ఎన్ డి ఆర్ ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్ మాట్లాడుతూ ముందస్తుగా వరద నివారణ ప్రణాళికలను చేసుకొన్నచో సునాయసంగా వరదనుండి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో తక్షణ చర్యలకు అవసరమైన సిబ్బంది వాహనాలు సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందుగానే సమర్థవంతమైన ప్రణాళికతో ఉన్నట్లు తెలిపారు. సత్వర సహాయార్థం జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలో ఎన్ డి ఆర్ ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలతో సేవలు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు సానిటేషన్ నిర్వహణతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టుటకు అప్రమత్తంగా ఉంచడం జరిగిందన్నారు. వర్షాకాలంలో ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో తాగునీటి కలిషితం కాకుండా ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు కురిసే క్రమం లో ప్రజలను సురక్షితం గా పునరావాస కేంద్రాలకు తరలించి వారికి బెడ్ షీట్లు ఆహారం అందించేలా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శిథిల భవనాలకు నోటీసులు జారీ, వారిని తక్షణమే ఖాళీ చేయించడం జరుగుతున్నదని అన్నారు. ఈ సందర్భంగా పి ఓ చిత్ర మిశ్రా మాట్లాడుతూ ఐ టి డి ఏ కార్యాలయం లో టోల్ ఫ్రీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందనీ, వర్షానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న సత్వరమే సహాయం అందించనున్నట్లు తెలిపారు. అంతకముందు కన్నాయి గూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజ్ ను రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, ఏపీఓ వసంతరావు, జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారి అప్పల నాయుడు, పంచాయితి రాజ్ , అగ్నిమాపక , ఆర్‌డబ్ల్యుఎస్, అగ్రికల్చర్, సివిల్ సప్లై, విద్యుత్, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రమేష్‌కు పరుపాటి పరామర్శ



**రాయపర్తి, ఆగస్టు 5(మనం న్యూస్):** రాయపర్తి మండలంలోని బిల్ నాయక్ తండ గ్రామానికి చెందిన రమేష్ గత కొద్ది రోజుల క్రితం విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వలన మైలారం సబ్ స్టేషన్ లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడగా మంగళవారం వారి స్వగృహానికి వెళ్లి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, (బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకుడు) పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి మనోధైర్యాన్ని కల్పిస్తూ ఆర్థిక సహాయాన్ని అందించారు. మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్ పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు లేతకుల మధుకర్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, ఎండీ యూసఫ్, స్థానిక నాయకులు సదా శ్రీనివాస్, పాము మనోహర్, పోలేపక బిక్షపతి మాజీ సర్పంచ్ హనుమా నాయక్ పార్టీ భారీ ఎత్తున కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన బోధన, భోజనం అందించాలి

- రాష్ట్ర రెవెన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన స్పెషల్ సీఎస్, కలెక్టర్, పీఓ



**ఏటూర్ నాగారం, ఆగస్టు 5(మనం న్యూస్):** విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ సూచించారు. మంగళవారం ఏటూర్ నాగారం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల ను స్పెషల్ సీఎస్, కలెక్టర్, పి ఓ తో కలిసి సందర్శించి, వంటశాల, ఆహారం నాణ్యత, స్టోర్ రూమ్, కూరగాయలు నిల్వలు, హాజరు పట్టిక, ఆహారం నాణ్యతపై విద్యార్థులు వ్రాసిన ఫీడ్ బ్యాక్, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని స్పష్టం చేశారు. తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని, నాణ్యత, లేని సరుకులు వాపసు చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ రోజు ఉదయం ఏం టిఫిన్ చేశారు? మంచిగా ఉందా? అంటూ విద్యార్థులను కుశల ప్రశ్నలు అడిగారు. వారు బావుందని చెప్పడంతో, ఇలానే నాణ్యత పాటించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రావొద్దని సూచించారు. అనంతరం స్పెషల్ సీఎస్, కలెక్టర్, పీఓతో కలిసి వైటీసీలో భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న నీటి వరదలకు అత్యవసరంగా సహాయక చర్యలు అందించుటకు సిద్ధంగా ఉన్న 25 మంది ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఉపయోగించు పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జీ, ఆర్డీఓ వెంకటేష్, ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, మండల ప్రత్యేక అధికారి రాంపతి, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## దేవాదుల నీటిని విడుదల చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

**వర్ధన్నపేట, ఆగస్టు 05(మనం న్యూస్):** వర్ధన్నపేట మండలంలోని చెరువులను దేవాదుల నీటితో నింపాలని బీజేపీ ఆధ్వర్యంలో కట్ర్యాల గ్రామం వద్ద వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ కూడా మద్దతు ప్రకటించింది. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి మాట్లాడారు ఇప్పటికైనా ప్రభుత్వం దేవాదుల నీటిని విడుదల చేసి ఎండి పోతున్న పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించి నీటి కోసం పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జడ సతీష్ కిసాన్ మోర్చా కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి, రాజేందర్ రెడ్డి కడారి గూడెం గ్రామ మాజీ సర్పంచ్ మంద సతీష్, కంజర్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యత గల ఆహారం అందించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఇద్దరు ఉపాధ్యాయులకు మెమో జారీ



**ఖానాపురం, ఆగస్టు 5(మనం న్యూస్):** విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యత గల ఆహారం అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటలోని హైస్కూల్, వజీనపల్లిలోని మహాత్మ జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలను మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంను రుచి చూశారు. స్టాక్ ను పరిశీలించారు. ముక్కిన బియ్యంను వండి పెట్టడంపై మెస్ ఇన్‌ఛార్జీలు మధర్ హుస్సేన్, భద్యయ్య అనే ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం వహించిన మధర్ హుస్సేన్, భద్యయ్యలకు మెమో జారీచేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. శుభ్రమైన కూరలలో కారం ఉప్పు తగ్గించాలని సూచించారు. భోదన అంశాలపై ,ఇతర సమస్యలపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వజీనపల్లిలోని మహాత్మ జ్యోతిభా పూలే ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. భోజనశాలను ,వంట గదిని పరిశీలించారు. స్టాక్ రూమ్ లో కూరగాయలను పరిశీలించారు. ఈరోజు తెచ్చిన కూరగాయలు కుళ్ళిపోవడం, కాంట్రాక్టర్ తెచ్చిన వాటిని పరిశీలించకుండా ఏలా తీసుకుటున్నారని సిబ్బందిపై ఆగ్రహం వెలిబుచ్చారు. కుళ్ళిన కూర గాయలను కవర్ లో భద్రపరిచి ల్యాబ్ టెస్ట్‌కు పంపించారు. విద్యార్థినులతో మమెకమై భోజనం రుచి చూశారు. పిల్లలకు సరిపడా కూరలు వడ్డించడం లేదని, కారం అధికంగా వాడుతున్నారని, ఒక్కొక్కరి కి ఏమోతాదు వాడాలో తూకం వేయించి కలెక్టర్ చూపారు. మెనూ ప్రకారం నాణ్యమైన కూరగాయల తో నాణ్యత గల ఆహారం అందించాలని సూచించా రు. ఉప్పు, కారం అధిక మోతాదులో వాడితే విద్యా ర్థులకు జీర్ణ సమస్యలు తలెత్తుతాయన్నారు. దీంతో చదువు పట్ల శ్రద్ధ తగ్గి పోతుందన్నారు. సమాజానికి భవిష్యత్ మేధావుల ను తయారు చేయాలని, వారికి అవసరమైన భోజనం నాణ్యతతో ఉండాలన్నారు. హాస్టల్ లో ఏమైనా ఇబ్బంది గా ఉందా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని క్లాస్ రూమ్‌లో విద్యార్థినులతో కలెక్టర్ ఏకాంతంగా మాట్లాడారు. హాస్టల్ నిర్వహణపై ప్రిన్సిపాల్ జయశ్రీ, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. అంతకు ముందుగా ఖానాపురం మండలం బుధరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం గోదాంలో ఉన్న యూరియా బస్తాల నిల్వలు మరియు రిజిస్టర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యూరియా కొరత లేదని రైతులకు సరిపడా అందిస్తున్నామన్నారు. నానో ప్లస్ ద్రవ యూరియాను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం తహశీల్దార్ నంగునూరి రమేష్, ఏవో భోగ శ్రీనివాస్, ఇంకా కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ స్ఫూర్తిదాయకం బోడేపూడి జీవితం

- వర్ధంతి సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.సాయిబాబు



**ఖమ్మం, ఆగస్ట్ 5(మనం న్యూస్):** సీపీఎం సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యులు బోడేపూడి వెంకటేశ్వరరావు జీవితం అందరికీ స్ఫూర్తిదాయక మని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.సాయిబాబు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బోడేపూడి 28వ వర్ధంతి సభ మంగళవారం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.సాయిబాబు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన బోడేపూడి వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ బోడేపూడి జీవితం వారి ఆత్మ విశ్వాసానికి ఒక నిలువెత్తు నిదర్శనమని, వారి ఆదర్శం, నిజాయితీ, నిరాడంబరత, నిస్వార్థం, హుందాతనం, ఆచరణ, మర్యాద, మన్నన నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మధిర నియోజకవర్గ ప్రజలను ఫ్లోరైడ్ బారి నుండి రక్షించుటకు 104 గ్రామాలకు సుజల ప్రవంతి పథకం ద్వారా మంచినీరు అందించిన నాయకుడని పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలో గ్రామాల మధ్య లింకు రోడ్లకు ప్రాణ ప్రతిష్ట చేసిన వారు బోడేపూడి అని అన్నారు. ఆయన మరణానంతరం ఆయన పేరుతో చిరస్మరణీయ గుర్తుగా ''బోడేపూడి సుజల ప్రవంతి'' పేరుతో వందల గ్రామాలకు మంచినీటి పంపిణీ ప్రతి చుక్కలో బోడేపూడి పోరాట త్యాగం ఇంటింటికి చేరిందన్నారు. ప్రాథమిక విద్య మాత్రమే చదివిన బోడేపూడి ప్రజల జీవితాలను కాచి వడపోసిన అనుభవంతో ఉన్నతాధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రులు సైతం తన వాదన పటిమతో ఒప్పించి ప్రజా సమస్యలపై స్పందించే విధంగా మలచగలిగిన సవ్యసాచి బోడేపూడి వెంకటేశ్వరరావు అని అన్నారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తిచేయాలని ఆనాడే ప్రభుత్వం దృష్టికి తెచ్చారని తెలిపారు. ప్రభుత్వాలు మారినా నేటికీ నదీ జలాల సమస్య పరిష్కారం కాలేదన్నారు. బోడేపూడి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన చూపిన బాటలో నడుస్తూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ, బండి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బండి పద్మ, యర్రా శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, దొంగల తిరుపతిరావు పాల్గొన్నారు.

# గెలుపుపై ఆ రోజే నమ్మకం కలిగింది: గంగూలీ

ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ఐదో టెస్టులో టీమ్‌ఇండియా సంచలన విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో ముగించింది. 374 పరుగుల లక్ష్యఛేదనలో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ 367 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్ 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. సిరాజ్ (5/104) ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. ప్రసిద్ధ్ (4/126) కూడా రాణించాడు. ఓవల్‌లో అద్భుత విజయం సాధించిన టీమ్‌ఇండియాపై మాజీలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

ఓవల్ టెస్టులో భారత్ విజయం సాధిస్తుందని నాలుగో రోజు ఆట ముగిసిన తర్వాత నమ్మకం కలిగిందని టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నారు. 'నాలుగో రోజు ఆట ముగిసిన తర్వాత టీమ్‌ఇండియా గెలుస్తుందనే నమ్మకం నాకు కలిగింది. పిచ్ బాగుంది, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్ చేసిన తీరు అద్భుతం' అని గంగూలీ పేర్కొన్నారు.




మ్యాచ్ నాలుగో రోజు చివర్లో ప్రసిద్ధ్ వరుస ఓవర్లలో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌కు గెలుపు అవకాశాలు సృష్టించాడు. చివరి రోజు సిరాజ్ 3, ప్రసిద్ధ్ ఒక వికెట్ తీసి భారత్‌కు మరపురాని విజయాన్ని అందించారు.

**ఈ విజయాన్నిఎప్పటికీ గుర్తుంచుకుంటాం: మదన్ లాల్**

1983 ప్రపంచ కప్ విజేత మదన్ లాల్ (%వీంఅ ృాశ్రీ%) కూడా భారత జట్టును ప్రశంసించాడు. ఇటీవలి కాలంలో ఇది అత్యుత్తమ టెస్ట్ విజయాలలో ఒకటిగా అభివర్ణించాడు. 'ఇది చరిత్రాత్మక విజయం. భారత బౌలర్లు చివరి రోజు చాలా తక్కువ పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టారు. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఈ టెస్ట్ మ్యాచ్‌ను మనం ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. భారత క్రికెట్ చరిత్రలో ఇలాంటి మ్యాచ్‌లు చాలా తక్కువ' అని మదన్ లాల్ అన్నారు.

## ఆ ప్లాన్ వర్కవుట్ కానందుకే సిరాజ్ అసహనం: గిల్



ఓవల్ టెస్టులో ఓవైపు క్రిస్ వోక్స్ చేతికి కట్టుతో వచ్చాడు. అతడిని అడ్డుపెట్టుకుని మరోవైపు గస్ అట్కిన్సన్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాడు. పక్కాగా ప్లాన్ చేసి బంతి వేస్తే రనౌట్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఈ క్రమంలో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్‌పై సిరాజ్ కాస్త అసహనం వ్యక్తం చేశాడు. అయితే, మళ్లీ అట్కిన్సన్‌ను సిరాజే క్లీన్ బౌల్డ్ చేసి జట్టును గెలిపించాడు. ఈ మొత్తం ఎపిసోడ్‌పై ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గిల్ వివరించాడు.

''వైడ్ యార్కర్‌గా వేయాలని ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. వోక్స్‌కు స్ట్రైక్ ఇవ్వకుండా అట్కిన్సన్ ఆడతాడని తెలుసు. చివరి బంతికి సింగిల్ రాకుండా ఉంటే.. వోక్స్ స్ట్రైక్‌కు వస్తాడు. చివరి బంతికి సిక్స్ కొట్టేందుకు ప్రయత్నించడని తెలుసు. అలా జరిగితే వికెట్ లేదా రనౌట్ అయ్యే అవకాశం ఉంటుంది. అందుకే, అలా ప్లాన్ చేశాం. వికెట్ కీపర్ ధ్రువ్‌తో గ్లౌవ్స్ తీసేయించి రెడీగా ఉంచమని సిరాజ్ అప్పటికే నాతో చెప్పాడు. అయితే, నేను ధ్రువ్ వద్దకు వెళ్లి చెప్పే సమయానికి సిరాజ్ బంతిని వేయడం ప్రారంభించాడు. దీంతో రనౌట్ చేసే అవకాశం చేజారింది. అప్పుడు నాతో ధ్రువ్‌కి ఎందుకు చెప్పలేదని అడిగాడు. అక్కడ జరిగిందదే. నేను ముందే చెప్పినట్లు సిరాజ్‌పై నమ్మకం ఉంది. అతడినే నమ్మాం. ఈ మ్యాచ్‌లో అతడి కష్టం అద్భుతం. క్యాచ్ చేజార్చినంత మాత్రాన అతడిపై గౌరవం ఏమీ పోదు. ఈ మ్యాచ్‌లో మేం ఓడినా సరే ఆ గౌరవం అలాగే ఉంటుంది'' అని గిల్ వెల్లడించాడు.



## ఆ దిగ్గజ క్రికెటర్లు లేకుండానే.. ట్రోఫీ ప్రజంటేషన్?

సాధారణంగా క్రికెటర్ల పేరుతో ట్రోఫీని అందజేస్తే.. వారిని పిలిచి గౌరవించడం ఆనవాయితీ. కానీ ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఆ సంప్రదాయాన్ని మరిచిపోయినట్లు అనిపిస్తోంది. ఇంగ్లాండ్ - భారత్ జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ సమమైంది. తొలి టెస్టు, మూడో టెస్టును ఇంగ్లాండ్ గెలవగా.. రెండో టెస్టుతోపాటు చివరి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. మాంచెస్టర్ టెస్టు డ్రాగా ముగిసింది. దీంతో ఓవల్ వేదికగా ట్రోఫీని ఇరుజట్ల సారథులకు అందించారు. అయితే, ఇక్కడే అభిమానులకు ఓ డౌట్ వచ్చింది. ట్రోఫీకి అండర్సన్ - తెందూల్కర్ అని పేరు పెట్టారు. కానీ, ఆ ఇద్దరు దిగ్గజాలు లేకుండానే ప్రజంటేషన్ కార్యక్రమం ఎందుకు నిర్వహించారు?. దీనిపై సోషల్ మీడియా వేదికగా కొత్త చర్చ మొదలైంది. ఎందుకు వారిద్దరూ హాజరుకాలేదనే ప్రశ్నలు తలెత్తాయి.

తొలుత ఈ టెస్టు సిరీస్ పటౌడీ ట్రోఫీగా ఉండేది. కానీ, ఈసారి అండర్సన్ - తెందూల్కర్ ట్రోఫీగా నామకరణం చేశారు. పేరు మార్పు సమయంలో పెద్ద వివాదమే రేగింది. అప్పుడు చాలా విమర్శలూ వచ్చాయి. స్వయంగా సచిన్ తెందూల్కర్ కూడా స్పందించాడు.

## ఆ విషయంలో 'మిస్టర్ యాంగ్రీ' వైపే మెక్ కల్లమ్: డీకే



'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' కోసం ఇంగ్లాండ్ ప్రధాన కోచ్ మెక్‌కల్లమ్ తొలుత శుభ్‌మన్ గిల్ పేరును ప్రతిపాదించాడు. ఓవల్ టెస్టు ఐదోరోజు ఆటలో మాత్రం సిరాజే హైలైట్. చివరికి గిల్‌తో పాటు బ్రూక్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ దక్కింది. అయితే, సిరాజ్‌కు ఇస్తే బాగుండేదని మెక్‌కల్లమ్ భావించినట్లు భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ వెల్లడించాడు. మరోవైపు 'మిస్టర్ యాంగ్రీ'గా సిరాజ్‌కు ఇంగ్లాండ్ ఆటగాళ్లు నిక్‌నేమ్ పెట్టారని నాసిర్ హుస్సేన్ తెలిపాడు. ఇకనైనా సిరాజ్‌ను నంబర్ 1 బౌలర్‌గా గుర్తించాలని.. ఇప్పటికే ఆలస్యం చేసినట్లు అశ్విన్ వ్యాఖ్యానించాడు.''నాలుగో రోజే మ్యాచ్ ముగిసిఉంటే ఇప్పటిలానే శుభ్‌మన్ గిల్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును ముందే తీసుకొనేవాడు. అతడి పేరును ఇంగ్లాండ్ కోచ్ మెక్‌కల్లమ్ ప్రతిపాదించాడు. కామెంటేటర్ మైక్ అథర్టన్ కూడా ప్రశ్నలు సిద్ధం చేసుకున్నాడు. కానీ, మ్యాచ్ ఐదో రోజుకు వెళ్లింది. అక్కడ సిరాజ్ ఐదు వికెట్ల ప్రదర్శనతో భారత్‌ను గెలిపించాడు. దీంతో మెక్‌కల్లమ్ తన అభిప్రాయాన్ని మార్చుకొన్నాడు. సిరాజ్ బౌలింగ్‌ను ఆస్వాదించినట్లు చెప్పాడు. బంతిని బ్యాట్ డామినేట్ చేసిన ఐదు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ అద్భుతం చేశాడు.

# సినిమా ఫెయిల్యూర్‌కు రివ్యూలు కూడా ఓ కారణం



ఏదైనా ఒక సినిమా వచ్చిందంటే చాలు.. యూట్యూబ్ రివ్యూల, ట్విట్టర్ కామెంట్స్, ఇన్‌స్టా రీల్స్‌తో మైండ్ బ్లాక్ అంటూ ఇష్టం వచ్చిన రివ్యూ ఇస్తున్నారు. అసలు సినిమా ఎలా ఉందో తెలిసేలోపే.. 'ఫ్లాప్', 'ఓవరాక్టింగ్', 'బోర్' అంటూ ట్యాగ్‌లతో దండం పెట్టి ప్రేక్షకుల అభిప్రాయాలను దారి తప్పిస్తున్నారు ఈ ట్రెండ్‌పై ఇప్పటికే పలువురు హీరోలు, నిర్మాతలు నిప్పులు చెరిగారు. తాజాగా బాలీవుడ్ బ్యూటీ- మృణాల్ ఠాకూర్ కూడా ఇదే విషయంపై స్పందించింది. ఇటివల బాలీవుడ్ లో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' విడుదలైన మిశ్రమ స్పందన అందుకుంది. ఈ క్రమంలో మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ నిర్వహించారు. ఇందులో ఓ అభిమాని.. నేను నెగిటివ్ రివ్యూలు చూసి 'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమా చూడలేదు అంటూ కామెంట్ చేశాడు. దీనిపై ఆమె స్పందిస్తూ.. చాలా రివ్యూలు తప్పదారి పట్టించేవిగా ఉంటున్నాయి. అందుకే రివ్యూలను నమ్మకుండా, మీరే సినిమా చూసి ఓ అభిప్రాయం ఏర్పరచుకోవాలి. ఒక్కోసారి సినిమా ఫెయిల్యూర్‌కి రివ్యూలే కారణం అవుతాయి అంటూ కుండ బద్దలు కొట్టేసింది. ఈ కామెంట్స్ ఇప్పడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రివ్యూలు చూసి ప్రేక్షకులు సినిమాకు వస్తే.. అసలు సినిమా ఆత్మను చూడకముందే దాన్ని ఖండించేసినట్లే అవుతుందని ఇండస్ట్రీలో చాలామంది నిపుణులు కూడా చెబుతున్నారు. అయిన కూడా వారి ఆగడాలు ఆగడం లేదు. ఇక ప్రజంట్ మృణాల్ వరుస చిత్రాలతో బిజీగా గడుపుతున్నారు.

## విశ్వంభరలో ఆషిక రంగనాథ్ పోస్టర్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న భారీ విజువల్ ఎక్స్‌పీరియెన్స్ మూవీ 'విశ్వంభర'. యంగ్ డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫాంటసీ డ్రామా, ఇప్పటివరకు వచ్చిన ప్రతి అప్డేట్‌తో భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ నుంచి స్పెషల్ ట్రీట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఆషిక రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌కి వచ్చిన స్పందన చూస్తుంటే.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. పోస్టర్ అదిరిపోయింది, ఆషిక కళ్ళలో మ్యాజిక్ ఉంది, విశ్వంభరకు మరో హైలైట్ ఆమె అవుతుందని ఫిక్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఆమె అందాన్ని, క్యారెక్టర్ డెప్త్‌ను హైలైట్ చేస్తోంది. చిరు సరసన త్రిషతో పాటు-, సెకండ్ హీరోయిన్ ఈ కన్నడ బ్యూటీ ఆషిక రంగనాథ్ నటిస్తోంది. ఈ సినిమాను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్న యూవీ క్రియేషన్స్, ప్రమోషనల్ స్ట్రాటజీలో కూడా కొత్తదనం చూపించబోతున్నారు. బర్త్ డే పోస్టర్‌తో మొదలైన ఈ ప్రమోషన్ రన్ ఇక నుంచి రెగ్యులర్‌గా సాగనుందని సమాచారం. భారీ సెట్‌లు, విజువల్ ఎఫెక్ట్స్, మైథలాజికల్ టచ్‌తో కూడిన ఈ సినిమాను వినాయక చవితి లేదా దసరా సీజన్లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అంతే కాదు ఎం.ఎం.కీరవాణి అందిస్తున్న సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, రీసెంట్ గా 'హరి హర వీరమల్లు' వంటి సినిమాల్లో తన వర్క్‌కి ఇంటర్నేషనల్ గుర్తింపు తెచ్చుకున్న కీరవాణి.. ఇప్పుడు 'విశ్వంభర'కి సంగీతం అందిస్తుండటంతో మ్యూజిక్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.




## భారత్-చైనా యుద్ధం ఆధారంగా 120 బహదూర్

బాలీవుడ్ నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం '120 బహదూర్' . 1962లో జరిగిన భారత్-చైనా యుద్ధం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని రజనీష్ దర్శకత్వం వహిస్తుండగా.. పరమ వీర చక్ర పురస్కార గ్రహీత మేజర్ సైతాన్ సింగ్ భాటి పాత్రలో ఫర్హాన్ అక్తర్ నటించబోతున్నాడు. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రం నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. భాగ్ మిల్కా భాగ్ తర్వాత ఫర్హాన్ అక్తర్ మరోసారి బయోపిక్ చేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.




## ఉస్తాద్‌లో పవన్ షెడ్యూల్ పూర్తి

### దర్శకుడు హరీష్ శంకర్ వెల్లడి

పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా కోసం అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి దర్శకుడు గుడ్‌న్యూస్ చెప్పారు. ఈ సినిమాలో పవన్‌కు సంబంధించిన షెడ్యూల్ పూర్తయినట్లు- తెలుపుతూ ఓ ప్రత్యేక ఫొటో పంచుకున్నారు. ఇటీవలే 'హరిహర వీరమల్లు'తో పలకరించిన పవన్‌కల్యాణ్ అదే జోష్‌తో ఇప్పుడు 'ఉస్తాద్ భగత్‌సింగ్'ను పూర్తి చేశారు. ఆయన సపోర్ట్ వల్లే ఈ షెడ్యూల్ త్వరగా పూర్తయినట్లు- హరీశ్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌పై ప్రశంసలు కురిపించారు. మాటిస్తే నిలబెట్టుకోవడం, మాట మీదే నిలబడడం.. మీరు పక్కనుంటే కరెంట్ పాకినట్లే అంటూ ఆయనతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఈ రోజును తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని దర్శకుడు తెలిపారు. పవన్ ఎనర్జీ సినిమాకు మరింత పవర్‌ను ఇచ్చిందన్నారు. సపోర్ట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం హరీశ్ షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో పవన్ సింపుల్ లుక్‌లో కనిపించడంతో అభిమానులు షేర్ చేస్తున్నారు. 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ - హరీశ్‌శంకర్) కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టు-కున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. దేవీశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పవన్ 'ఓజీ'లో నటిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఇది రానుంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.